ఆదివారం
21-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 90
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గగన్‌యాన్ మరో కీలక పరీక్ష సక్సెస్

బెంగళూరు: గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించిన మరో కీలక పరీక్షను భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో) విజయవంతంగా నిర్వహించింది. క్రూ మాడ్యూల్ ల్యాండింగ్ పారాచూట్‌లను పరీక్షించింది. తొలి అంతరిక్ష ప్రయాణానికి ఇస్రో సన్నద్ధమవుతున్నది. 2026లో సిబ్బంది లేకుండా గగన్‌యాన్ మిషన్ చేపట్టనున్నది. దీని కోసం అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నది. ఈనెల 18, 19న చండీగఢ్‌లోని డీఆర్డీవో టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లేబరేటరీలోని రైల్ ట్రాక్‌పై ఈ పరీక్ష చేపట్టింది. రాకెట్ స్లెడ్ సహాయంతో పారాచూట్‌లకు సంబంధించిన ట్రయల్స్‌ను విజయవంతంగా నిర్వహించింది.

మెస్సీకి రూ.89 కోట్లు ఇచ్చాం

న్యూఢిల్లీ: ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటన కోసం నిర్వాహకులు రూ.89 కోట్లు చెల్లించారు. ఇందులో భారత ప్రభుత్వానికి రూ.11 కోట్లు పన్నుగా చెల్లించామని ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఈవెంట్ నిర్వాహకుడు శతాద్రు దత్తా వెల్లడించినట్లు తెలిసింది. ఈ పర్యటన మొత్తం ఖర్చు రూ.100 కోట్లు కాగా ఇందులో 30 శాతం నిధులను స్పాన్సర్ల నుంచి, మరో 30 శాతం టికెట్ల అమ్మకాల ద్వారా సేకరించినట్లు ఆయన చెప్పినట్లు సమాచారం. దత్తాకు సంబంధించి ఇటీవల ఫ్రీజ్ చేసిన అకౌంట్లలో

- మిగతా 2 లో

గుడ్డు సురక్షితమే

న్యూఢిల్లీ: గుడ్లతో కేన్సర్ ముప్పు అన్న అపోహ వద్దంటూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీసీఐ) స్పష్టంచేసింది. నెట్టింట వచ్చేవి తప్పుదోవ పట్టించేవిగా పేర్కొంది. దేశంలో లభ్యమవుతోన్న గుడ్లు సురక్షితమైనవని శనివారం ఒక ప్రకటన చేసింది. వాటిల్లో కేన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని చెప్పేందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పేర్కొంది. భారత్‌లో విక్రయించే గుడ్లలో నైట్రోఫ్యూరాన్ మెటబాలైట్స్‌ను గుర్తించినట్లు కొన్ని రోజులుగా పోస్టులు వచ్చాయి. 2011లో తీసుకు వచ్చిన ఆహార భద్రత నిబంధలన ప్రకారం పౌల్ట్రీ, ఎగ్ ప్రొడక్షన్ జరిగే అన్ని దశల్లో నైట్రోఫ్యూరాన్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

పొన్నం ప్రభాకర్

రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి, మరణాల రేటును నివారించడమే లక్ష్యంగా జనవరిలో జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

2లో

భూ సేకరణ చట్టం ఉల్లంఘన

- షెడ్యూల్డ్ ప్రాంతాల్లో కఠినంగా అమలు చేయాలి
- కాగితాలకు పరిమితమైన గ్రామసభల అనుమతులు
- పార్లమెంటరీ కమిటీ నివేదిక

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ ప్రాంతాల్లో న్యాయమైన పరిహారం, పారదర్శక భూసేకరణ, పునరావాస చట్టం 2013 (ఎల్ఏఆర్ఆర్ యాక్ట్) కఠినంగా అమలు చేయాలని పార్లమెంటరీ కమిటీ స్పష్టంచేసింది. ఈ చట్టనిబంధనల అతిక్రమణపై ఆందోళన వ్యక్తంచేసింది. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలాఖా నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ పార్లమెంటరీ స్థాయి సంఘం ఇటీవల పార్లమెంటుకు ఓ నివేదిక సమర్పించింది. తప్పనిసరిగా అమలు చేయాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ భూసేకరణ చట్టం ముఖ్యంగా మార్కెట్ లావాదేవీలు కట్టడి చేసిన షెడ్యూల్డ్ ప్రాంతాల్లో తరచూ అతిక్రమణకు గురవుతోందని పేర్కొంది. గిరిజన జనాభా అధికంగా ఉండి... రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ పరిధిలో గిరిజన సంక్షేమానికి ప్రత్యేక పాలనాధికారం కల్పించిన ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాలు అంటారు. ప్రాంతీయ భాషల్లో సంబంధిత వివరాలు తెలియజేసే పత్రాలు లేకపోవడం, గ్రామసభల సంప్రదింపులలో తీవ్రజాప్యం లేదా నామమాత్రంగా జరుగుతుండటంతో పాటు నిజమైన బాధితులతో సంప్రదింపులు లేకుండా యాంత్రికంగా పత్రాలు జారీ చేయడంపై కమిటీ

- మిగతా 2 లో



ఎప్‌స్టీన్ సంచలనం

అమెరికాలో రాజకీయ ప్రకంపనలు

క్లింటన్, ట్రంప్ ఫొటోలు బహిర్గతం

మసాజ్ టెక్నిక్ ప్రస్తావన

వాషింగ్టన్: అమెరికాలో ఎప్‌స్టీన్ ఫైళ్లు సంచలనంగా మారాయి. ఇక్కడి రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, పాప్ గాయకుడు మైఖేల్ జాక్సన్ వంటి ప్రముఖుల పేర్లు, ఫొటోలు బహిర్గతమయ్యాయి. మసాజ్ టెక్నిక్... ఆయుర్వేదం ప్రస్తావన కూడా ఆ ఫైళ్లలో ఉన్నది. 200 మంది ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల గురించి ఈ ఫైళ్లలో ఉన్నట్లు మీడియా తెలిపింది. లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైళ్లను 30 రోజుల్లోగా విడుదల చేయాలని గత నెలలో ఒక బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశాడు. దీంతో వేలాది ఫైళ్లను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. వీటిలో ప్రపంచ ప్రముఖుల పేర్లు, ఫొటోలు ఉన్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని ఫైళ్లు మాత్రమే విడుదల చేసినట్లు డెమొక్రాట్లు ఆరోపించారు. అన్ని ఫైళ్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఫైళ్ల ద్వారా ఎప్‌స్టీన్ అధ్వర్యంలో జరిగిన దారుణాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఎప్‌స్టీన్‌తో ట్రంప్ చాలాకాలం స్నేహంగా ఉన్నారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఇది రాజకీయ వివాదానికి దారి తీసింది. తాజా ఫైళ్లలో ట్రంప్ ఫొటోలు తక్కువగా ఉన్నాయని న్యాయశాఖ తెలిపింది. ఆయుర్వేదం, మసాజ్ టెక్నిక్కుల గురించి ఈ ఫైళ్లలో ప్రస్తావన ఉన్నది. భారత్‌కు సంబంధించి ఐదు వేల ఏళ్ల నాటి సహజ వైద్య విధానం గురించి, నువ్వుల నూనెతో డీటాక్సిఫికేషన్ మసాజ్ పద్ధతులను ఈ ఫైళ్లు వివరించాయి. పాశ్చాత్య దేశాలలో

- మిగతా 2 లో

పబ్లిక్ సర్వీస్ కమిషన్లు

పాలనా వ్యవస్థకు వెన్నెముక

పరీక్షల నిర్వహణలో వార్షిక క్యాలెండర్ తప్పనిసరి

రిజర్వేషన్‌లు సంఖ్యకే పరిమితం కారాదు: భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పాలనా వ్యవస్థకు వెన్నెముకలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శకమైన, సమగ్ర నియామక విధానాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు సరైన స్థానం దక్కుతుందని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో వార్షిక క్యాలెండర్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. పరీక్షల్లో జాప్యం వల్ల యువతలో నిరాశ పెరుగుతోందని, అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికతో పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత కమిషన్లపై ఉందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ నిర్వహిస్తోందని అన్నారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని అన్నారు. ప్రశ్నపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకు ప్రతి దశ స్పష్టంగా, సందేహాలకు తావులేకుండా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి రియల్‌టైమ్ సమాచారం అందించాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందడమే కమిషన్ల ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రశ్నపత్రాల లీకేజీలు ... అభ్యర్థుల కలలను చిదిమేస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీలను అడ్డుకునేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు అమలు చేయాలని, సిబ్బందికి నైతిక విలువలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. తప్పిదాలు చోటుచేసుకుంటే వేగంగా, నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్వ్యూలు కేవలం జ్ఞాన పరీక్షలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వం, నైతికత, నిర్ణయ సామర్థ్యాన్ని అంచనా వేసేలా ఉండాలని సూచించారు. విభిన్న నిపుణులతో ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలులో కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రిజర్వేషన్లు కేవలం సంఖ్యలకే పరిమితం కాకుండా వాస్తవికంగా ఫలితాలు ఇచ్చేలా చూడాలన్నారు. అర్హులైన అభ్యర్థులు అవకాశాలు పొందేలా కోచింగ్, సడలింపులు, పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాలని సూచించారు. నియామక ప్రక్రియల్లో న్యాయపరమైన వివాదాలు తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. కోర్టుల తీర్పుల నుంచి పాఠాలు నేర్చుకొని వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలని, రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పనిచేయాలని స్పష్టం చేశారు. చర్చలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవ్వాలని కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లను నిజాయతీకి ప్రతీకగా నిలపాలని భట్టి పిలుపునిచ్చారు.

అసమానతలు తొలగించేది విద్యే

అభివృద్ధికి మానవ మూలధనం లోతైన పునాది

'లయోలా' గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భట్టి

2లో

24న శ్రీహరికోట నుంచి అమెరికా ఉపగ్రహ ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకమైన శ్రీహరికోట నుంచి అమెరికా భారీ ఉపగ్రహ ప్రయోగం డిసెంబర్ 24 బుధవారం ఉదయం 8.54 గంటలకు జరగనుంది. దేశ శాస్త్రీయ సామర్థ్యాన్ని ప్రపంచానికి ఘనంగా చాటే ఈ చారిత్రక అంతర్జాతీయ ప్రయోగం శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జరగడం ద్వారా మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. ప్రభుత్వ రంగ సంస్థ న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ బాధ్యతగా నిర్వహిస్తున్న ఈ మిషన్ ద్వారా అమెరికాకు చెందిన భారీ వాణిజ్య శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను భూమి చుట్టూ నిరంతరం పరిభ్రమించే కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టనున్నారు. భారతదేశంలో అత్యంత శక్తివంతమైన గగన్‌యాన్ శ్రేణికి చెందిన ఎల్‌బీఎం-3 రాకెట్ ద్వారా నిర్వహించే ఈ ప్రయోగాన్ని ఎల్‌వీఎం-3 ఎం-6 మిషన్‌గా పిలుస్తున్నారు. రెండో ప్రయోగం వేదిక నుంచి చేపట్టనున్న ఈ మిషన్‌లో ప్రయోగించే శాటిలైట్ బరువు సుమారు 6,500 కిలోలు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా హై స్పీడ్ సెల్యులర్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శాటిలైట్‌ను రూపొందించారు. దాదాపు 2400 చదరపు అడుగుల విస్తీర్ణం గల అత్యాధునిక కమ్యూనికేషన్ అరేలు ఇందులో ఉండటం

- మిగతా 2 లో

పేదలపై ప్రత్యక్ష దాడి

నల్ల చట్టాన్ని రద్దు చేసే వరకు పోరు: సోనియా గాంధీ



న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను మోదీ ప్రభుత్వం బుల్డోజ్ చేసిందని, ఇది పేదలపై ప్రత్యక్ష దాడి అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ ఉద్దేశాన్ని నీరుగార్చేలా తీసుకొచ్చిన నల్ల చట్టాన్ని ప్రతిఘటిస్తామని, దానిని రద్దు చేసేంత వరకు పోరాడతామని ప్రకటించారు. ఈమేరకు ఆమె శనివారం ఒక వీడియో విడుదల చేశారు. దేశ రైతులు, కార్మికులు, భూములు లేని పేదల ప్రయోజనాలపై మోదీ ప్రభుత్వం ప్రత్యక్షంగా దాడి చేసిందని ఆరోపించారు. గత 11 ఏళ్లుగా గ్రామీణ నిరుద్యోగులు, పేదల ప్రయోజనాలను మోదీ సర్కారు విస్మరిస్తోందని దుయ్యబట్టారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు యత్నించిందన్నారు. కోవిడ్ సమయంలోనూ పేదలకు జీవనరేఖగా ఎంజీఎన్ఆర్ఈజీఏ ఉన్నట్లు తెలిపారు. ఈ నల్ల చట్టానికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షల మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని సోనియాగాంధీ తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఏకు భిన్నంగా కొత్త చట్టాన్ని మోదీ ప్రభుత్వం

- మిగతా 2 లో

బీజేపీని గద్దె దించుదాం

- ఎర్రజెండాలన్నీ ఏకం కావాలి
- కమ్యూనిస్టు పార్టీది ఘనమైన చరిత్ర
- దామాషా ప్రాతిపదికన ఎన్నికలు నిర్వహించాలి
- సీపీఐ శతవసంతోత్సవ సభలో పల్లా వెంకటరెడ్డి

2లో

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే: కూనంనేని

కోడిపుంజువాగు సర్పంచ్ సీపీఐలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో- కొత్తగూడెం : సీపీఐ బలపరిచి... గెలిపించిన సర్పంచ్‌లు పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రణాళికబద్దంగా ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కోడిపుంజుల వాగు సర్పంచ్ అజ్మీర మహేశ్వరి శ్రీనివాస్ శనివారం సీపీఐలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో అజ్మీరకు కండువా కప్పి కూనంనేని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో సీపీఐ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పాల్వంచ మండలం కోడిపుంజుల వాగు సర్పంచ్ మహేశ్వరి సీపీఐలో చేరారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పంచాయతీ పాలన సాగాలని కోరారు. రాగద్వేషాలకు తావు లేకుండా రాజకీయాలకతీతంగా పారదర్శకతతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పేదల పక్షాన అనునిత్యం పోరాడే సీపీఐ కుటుంబం లోకి రావడం చాలా సంతోషంగా ఉందని సర్పంచ్‌ను

- మిగతా 2 లో

నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు శనివారం వెళ్లారు. గతంలో ఉస్మానియా యూనివర్సిటీ, తిరుమలగిరి, మట్టంపల్లి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల విషయమై నాంపల్లిలోని మనోరంజన్ కోర్టుకు హాజరయ్యారు. ఓయూలో నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ సభ నిర్వహణపై 2016లో రేవంత్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో పాటు వివిధ కారణాలతో తిరుమలగిరి, మట్టంపల్లి పోలీస్ స్టేషన్లలో సైతం అప్పట్లో కేసులు నమోదయ్యాయి. తనపై నమోదైన ఆ కేసులను కొట్టివేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. రాజకీయ ఒత్తిళ్లతోనే తనపై అక్రమంగా కేసులు పెట్టారని పిటీషన్ వేశారు. ఈ పిటీషన్ పై ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో నడుస్తున్న విచారణకు సీఎం వ్యక్తిగతంగా

- మిగతా 2 లో

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర బ్యూరో-మేడ్చల్/మల్కాజిగిరి : రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి, మరణాల రేటును నివారించడమే లక్ష్యంగా జనవరిలో జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో తీసుకోవాల్సిన కార్యాచరణపై సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తితో కలిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించారు. గత సంవత్సరం తెలంగాణలో 25,934 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 7,949 మంది మరణించారని తెలిపారు. ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు నిబంధనలు ఉల్లంఘించి రాష్ డ్రైవింగ్, డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే జరిగినట్లు గుర్తించామన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, ప్రజలకు రోడ్డు నిబంధనలపై, జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోడ్డు భద్రతపై ప్రతి జిల్లాలో ఏర్పడిన రోడ్డు భద్రతా కమిటీలు ఈ నెలాఖరు లోపు సమావేశాలు ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి జిల్లాలో రోడ్డు భద్రతా దళ వలంటీర్ బృందాలను ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో అధికారులతో కలిసి ఈ బృందం అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ బృందాలకు జనవరి 26 న ప్రశంస పత్రాలతో సత్కరిస్తామన్నారు. రోడ్డు నిబంధనలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి చిల్డ్రన్ ట్రాఫిక్ అవగాహనా పార్కులను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. యూనిసెఫ్ సహకారంతో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగానాంశాలను పాఠ్యాంశాలలో చేరుస్తామని తెలిపారు. కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి, డ్రైవింగ్ లైసెన్స్ పొందిన ప్రతి వారికి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారుల్లో, ప్రధాన నగరాలలో నిబంధనలు ఉల్లంఘించే వారికి చలానాలు విధించాలని, వాహనదారులు హెల్మెట్‌లు ధరించేలా, సీటు బెల్ట్ పెట్టుకునేలా చూడాలని, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నగదు రహిత చికిత్సను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, దీని ద్వారా బాధితుడికి ఏడు రోజుల్లో లక్షా 50 వేల వరకు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించిన వాహనదారులను ప్రోత్సహించడానికి రహవీర్ గుడ్ సమర్థన్ పథకం ద్వారా రూ.25 వేల నగదు పురస్కారం అందించే కార్యక్రమం రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానుందని మంత్రి తెలిపారు. జనవరిలో జరిగే రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా హెల్మెట్ బైక్ ర్యాలీలు, వాక్ థన్ రన్‌లు, రంగోలి ముగ్గుల పోటీలు, రోడ్డు భద్రత ప్రతిజ్ఞలు, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, మోటార్ సైకిల్‌కు చిన్న హెల్మెట్ స్టిక్కర్, కారు విండ్ స్క్రీన్‌కు చిన్న సీట్ బెల్ట్‌ను అతికించడం ద్వారా అవగాహన కల్పించడం, అన్ని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

బీజేపీని గద్దె దించుదాం

విశాలాంధ్ర- హైదరాబాద్: మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, ఆర్థిక, రాజకీయ అరాచకాలకు పాల్పడుతున్న కేంద్రంలోని బీజేపీని గద్దె దించేందుకు వామపక్షాలు, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులన్నీ ఏకమై పోరాడాలని, అప్పుడే మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించవచ్చని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి అన్నారు. సీపీఐ శతవసంతాలను పురస్కరించుకుని నారాయణగూడ మార్వేల్ ఫంక్షన్ హాలులో హైదరాబాద్ కౌన్సిల్ అధ్వర్యంలో శనివారం "వందేళ్ల సీపీఐ త్యాగాల, విజయాల స్ఫూర్తిసభ" జరిగింది. తొలుత సభా ప్రాంగణంలో సీపీఐ జెండాను పల్లా ఆవిష్కరించి అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం కొనసాగితే భవిష్యత్తులో కార్మిక, రైతు, యువజన వ్యతిరేక చర్యలు మరింత ఉధృతమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్ర జెండాలన్నీ ఏకమై ఒకే గుర్తుపై ఎన్నికల్లో పోటీ చేసినప్పుడే, ప్రజలు కమ్యూనిస్టులను ఒక ప్రత్యామ్నాయంగా చూస్తారన్నారు. కమ్యూనిస్టు నాయకుల పేర్లను, చరిత్రను బీజేపీ హైజాక్ చేస్తోందన్నారు. భారత స్వాతంత్ర్య, హైదరాబాద్ సంస్థానం విలీనం కోసం జరిగిన పోరాటాల్లో భారత కమ్యూనిస్టు పార్టీకి గణనీయమైన చరిత్ర ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ లేకపోతే తమకు ఎదురు ఉండదనే ఉద్దేశంతోనే మోదీ ప్రభుత్వం పోరాట, ఉద్యమ చరిత్రను వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని, అప్పటికే పది లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు ప్రజలకు పంపిణీ చేశారని, దీంతో హైదరాబాద్ కమ్యూనిస్టుల వశమౌతుందనే భయంతోనే హైదరాబాద్ విలీనానికి ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో బీజేపీ పాత్ర లేదన్నారు. భారతదేశ పోరాట చరిత్రను బీజేపీ, కాంగ్రెస్ వక్రీకరిస్తోందని మండిపడ్డారు. భారత స్వాతంత్ర్య పోరాటం... ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, విద్య, ఉద్యోగ, ఉపాధి, గృహ సమస్యలపై విరోచిత పోరాటం చేసిందని, ఫలితంగా అనేక చట్టాలను, హక్కులను సాధించిందని, అందుకే కమ్యూనిస్టు పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ వంద సంవత్సరాలుగా ప్రజల పక్షాన నిలబడుతున్నదన్నారు. దామాషా పద్ధతిన ఎన్నికలను నిర్వహించాలని, అలా చేస్తే కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం దక్కుతుందన్నారు. కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగానే నాడు బ్యాంకులను జాతీయకరణ చేశారని, కానీ మోదీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ల రుణాలను మాఫీ చేస్తున్న కేంద్రం, వ్యవసాయ కార్మికుల రుణాలను ఎందుకు మాఫీ చేయడం లేదని నిలదీశారు. జనవరి 18న ఖమ్మంలో జరుగబోయే సీపీఐ వందేళ్ల ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ, ఎంఐఎంకు పోరాట చరిత్ర లేదు: ఈ.టి.నర్సింహ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం, హైదరాబాద్ సంస్థాన విలీనంలో పోరాటం చేసిన చరిత్ర బీజేపీ, ఎంఐఎంకు లేదని అన్నారు. కమ్యూనిస్టుల అధ్వర్యంలో జరిగిన సాయుధ పోరాట చరిత్రను కూడా బీజేపీ వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అబద్దాలను ప్రచారం చేస్తుంటే.. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసి దేశం మొత్తం తిరిగి విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో సీపీఐ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందన్నారు. మతోన్మాద బీజేపీ, ఎంఐఎం గుట్టు రట్టయితే ప్రజలే ఆ పార్టీలకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పార్టీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు ఎస్.చాయాదేవి, ఎ.రవీంద్ర చారి, సీనియర్ నాయకులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రేమ్ పావని, రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి, ఆరుట్ల సుశీల, ఇ.ఉమామహేశ్, కమతం యాదగిరి, తెలంగాణ ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.నరసింహ, జి.చంద్రమోహన్ గౌడ్, ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, నాయకులు పడాల నళిని పాల్గొన్నారు. కాగా, మహిళా నాయకురాళ్లను పల్లా వెంకట రెడ్డి, ఈ.టి.నర్సింహ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

భారీ ప్రదర్శన...

తొలుత సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి నారాయణగూడలోని మార్వేల్ ఫంక్షన్ హాల్ వరకు హైదరాబాద్ కౌన్సిల్ అధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎర్ర దుస్తులు ధరించి, ఎర్ర జెండాలు చేతబూని సీపీఐ శ్రేణులు కదం తొక్కారు. తలపై గొడుకు, కోలాటాలతో చిన్న పిల్లలు చేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

బీజేపీ గూటికి సినీనటి ఆమని

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలుగు సినీనటి ఆమని రాజకీయ రంగప్రవేశం చేశారు. బీజేపీ తెలంగాణ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ఆమె శనివారం కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమని మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టానన్నారు. ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఆమని ప్రశంసించారు. మోదీ ఎన్నో మంచి పనులు చేస్తున్నారని, భారతీయులమని చెప్పుకోవడానికి గర్వంగా ఉందన్నారు. మోదీ అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నానన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం మోదీ కృషి చేస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు.

గువహతిలో వెంకటేశ్వరఆలయానికి 25 ఎకరాలు

గువహతి: అసోం రాజధాని గువాహతిలో 10.8 ఎకరాల భూమికి బదులుగా 25 ఎకరాల భూమిని వెంకటేశ్వర స్వామి ఆలయం కోసం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు గతంలోనే అంగీకరించింది కానీ ఇప్పుడు దానిని 25 ఎకరాలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది... టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు లేఖ రాస్తూ కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో టీటీడీ వెంకటేశ్వర ఆలయం నిర్మిస్తే, అక్కడ ఉన్న ఆలయ ప్రయోజనాలకు భంగం కలగవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న సిల్చార్, డిబ్రూగఢ్ నగరాల్లో ఆలయం ఏర్పాటు చేయాలని సూచించారు.

నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

హాజరయ్యారు. ఈ కేసులకు సంబంధించి విచారణ పూర్తయినట్లు సమాచారం.

అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పించిన సీఎం

హజ్రత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తి 814వ ఉర్సును పురస్కరించుకుని ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించారు.

అజ్మీర్ షరీఫ్ దర్గా ... ఆధ్యాత్మికత, సామాజిక సామరస్యం, ప్రేమ, సోదరభావానికి చిహ్నంగా నిలుస్తుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పణకు మంత్రులు మహమ్మద్ అజాహరుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎంపీ పోరిక బలరాం నాయక్, ఫహీమ్ ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ ఖాద్రీ పాషా బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ , మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఇతర ముస్లిం మైనారిటీ నేతలు హాజరయ్యారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

అభినందించారు. ప్రజల పక్షాన చేపట్టే ప్రతి మంచి కార్యక్రమం వెనుక సిపిఐ అండదండలు ఉంటాయని కూనంనేని స్పష్టం చేశారు. సర్పంచ్ మహేశ్వరి చేరికతో స్థానిక సంస్థల్లో మరింత బలం పెరిగిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ భాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీశం శెట్టి పూర్ణచంద్రరావు, అజ్మీర రాములు నాయక్, బాదావత్ వెంకటరామ్, బాదావత్ రాములు, బాదావత్ రాంజీ, గూగులోత్ రాములు, బాదావత్ లక్పతి, బానోత్ చందు అజ్మీరా బాలు, అజ్మీర కృష్ణ, తేజవత్ రమేష్ పాల్గొన్నారు.

భూ సేకరణ చట్టం ఉల్లంఘన

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తూ ఈనెల 18న పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. ఎల్‌ఏఆర్‌ఆర్ చట్టంలో గ్రామసభలకున్న ప్రాధాన్యత గుర్తుచేసింది. గ్రామ సభల అనుమతి కాగితాలకే పరిమితమైన సందర్భాలు అనేకమని పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లింది. అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) 2006 నిబంధనలను అతిక్రమించడం ద్వారా అటవీ భూములు సేకరించిన సందర్భాలు కోకొల్లలు అని తెలిపింది. అడవి బిడ్డల భూమి-వనరుల హక్కు పరిరక్షణకు ఎల్‌ఏఆర్‌ఆర్ చట్టంతో ఎఫ్ఆర్ఏను ముడిపెట్టాలని సూచించింది. కొన్ని కేసుల్లో సామాజిక ప్రభావం అంచనా (ఎస్ఐఏ), పర్యావరణ ప్రభావం అంచనా (ఈఐఏ) కూడా సేకరణదారులకు అనుకూలంగా ఉంటున్నట్లు వెల్లడించింది. భూమికి న్యాయంగా విలువ కట్టాలని చట్టం సూచిస్తుంటే.... చాలాసార్లు మార్కెట్ విలువ కంటే తక్కువకు సేకరించినట్లు తెలిసిందని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. జాతీయ పర్యవేక్షణ కమిటీ (ఎన్ఎంసీ) పనితీరునూ ప్రశ్నించింది. కెన్-బెట్వా లింక్, పోలవరం వంటి ప్రాజెక్టులపై జరిపే సమీక్షలు సెటిలర్లను సంతృప్తిపర్చలేకపోయాయని వ్యాఖ్యానించింది. వ్యవస్థీకృత యంత్రాంగాలు ఉన్నప్పటికీ భూ సేకరణ, పరిహారం, పునరావాసం, రీసెటిల్మెంట్‌కు సంబంధించిన ఫిర్యాదులు తగ్గడం లేదని, ముఖ్యంగా ఇంటర్-బేసిన్ నదుల అనుసంధాన ప్రాజెక్టుల విషయంలో ఇది సమస్యగా మారిందని కమిటీ నివేదిక తెలిపింది. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా భూ సేకరణ చట్టం అమలు మరింత సమర్థంగా, పారదర్శకంగా, పటిష్ఠంగా ఉండాలని పేర్కొంది.

అసమానతలు తొలగించేది విద్యే

విశాలాంధ్ర - హైదరాబాద్:సమాజంలో అసమానతలను రూపుమాపేది విద్య మాత్రమేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మేడ్చల్ జిల్లా అల్వాలలో శనివారం లయోలా విద్యాసంస్థల అధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నైపుణ్యం తోపాటు మానవ విలువలు కలిగిన విద్యను అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే భారత్ ఫ్యూచర్ సిటీలో స్కిల్ వర్సిటీ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 100 ఐటీఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని, వీటి ద్వారా యువతకు ఉపాధితో పాటు రాష్ట్ర జీడీపీ పెరుగుతుందని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో పాఠశాలను రూ.200 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్నామని చెప్పారు. వ్యవస్థలు, సంస్థల్లో మార్పు విద్య ద్వారానే సాధ్యమవుతుందని సిపెక్(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల) సర్వే ద్వారా స్పష్టమైందని చెప్పారు. మూలధనం, ఆవిష్కరణలు ఎంత ముఖ్యమైనవైనా... అవి ఆధారపడే లోతైన పునాది మానవ మూలధనం అని పేర్కొన్నారు. 1976లో లోయోలా అకాడమీ స్థాపించినప్పుడు, లక్ష్యం... కేవలం డిగ్రీలు పొందిన విద్యార్థులను తయారు చేయడం కాదు ... విలువలతో కూడిన సమర్థులైన పౌరులను తీర్చిదిద్దడమే అన్నారు. ఉత్పాదకత అంటే ఎక్కువ గంటలు పని చేయడం కాదు. తెలివిగా, మెరుగ్గా కలిసి పని చేయడమే అన్నారు. అది అంతా నైతికతను నేర్పే విద్యపై ఆధారపడి ఉంటుంది కానీ యాంత్రికంగా చదవడంపై మాత్రం కాదు అన్నారు. విద్యను కేవలం జీవనోపాధి కోసం మాత్రమే కాకుండా, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రశ్నించడానికి, అర్థవంతంగా సహకరించడానికి వినియోగించుకోండి అని విద్యార్థులకు సూచించారు. నిజాం కాలేజీ... ఆ తరువాత హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తన అకాడమిక్ ఆలోచనలతో పాటు సామాజిక దృక్పథాన్ని కూడా మలిచాయి అని డిప్యూటీ సీఎం వివరించారు. తాకట్టు లేకుండా విద్యా రుణాలను ప్రోత్సహించడం, సామాజిక గృహాలను విస్తరించడం, కిసాన్ క్రెడిట్ కార్డులను బలోపేతం చేయడం వంటి చర్యల్లో సామాజిక స్పృహ స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఉత్పాదకత అంటే కేవలం ఆర్థిక ఉత్పత్తి కాదు, చదువుకున్న మేధస్సులు ఇతరులకు అవకాశాలను విస్తరించే సామర్థ్యం అన్నారు. ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే... ప్రగతికి బాట: మంత్రి తుమ్మల



విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: భవిష్యత్తులో తెలంగాణతో పాటు ఉత్తర భారతదేశం, దక్షిణ భారత దేశానికి అనుసంధానం చేసే ప్రత్యేక మార్గంగా ఖమ్మం -దేవరపల్లి జాతీయ రహదారి మారబోతున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ధంసలాపురం వద్ద ఖమ్మం -దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఆర్‌ఓబీ, ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను, మున్నేరు బ్రిడ్జి వంతెన పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనులపై మంత్రి అధికారులకు వివిధ సూచనలు చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అన్నారు. 160 కిలోమీటర్ల జాతీయ రహదారి పూర్తయితే గంటన్నరలో రాజమండ్రి వెళ్లవచ్చని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రా ప్రజలకు ఈ రహదారి ఉపయోగపడుతుందని తెలిపారు. ధంసలాపురం ఆరోఓబీ సంక్రాంతి నాటికి పూర్తి అవుతుందని మంత్రి తెలిపారు. హై టెన్షన్ విద్యుత్ లైన్స్ తరలింపు, భూసేకరణ పనులు పూర్తి చేశామని, ఒకవైపు రైల్వే బ్రిడ్జి పూర్తి చేసుకుంటే సత్తుపల్లి, రాజమండ్రి వరకు ఉపయోగపడుతుందని అన్నారు. హైదరాబాద్ నుంచి రాజమండ్రి, వైజాగ్ వెళ్లే వారు విజయవాడ వెళ్లకుండా ఖమ్మం, దేవరపల్లి హైవే పై 150 కిలో మీటర్ల ప్రయాణం ఆదా అవుతుందని పేర్కొన్నారు. హైవేలు ఖమ్మం జిల్లా ప్రగతికి బాటలు వేస్తాయన్నారు.

రైల్వే శాఖను సమన్వయం చేసుకుంటూ ఆర్‌ఓబీ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రైల్వే, కెనాల్, మున్నేరు పై రహదారి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్నేరు బ్రిడ్జ్ తో పాటు ధంసలాపురం ఎగ్జిట్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రూ.3,500 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. చిన్న సమస్యలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సైదులు పాల్గొన్నారు.

పేదలపై ప్రత్యక్ష దాడి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చింది. పూర్వం కేంద్రమే పూర్తిగా నిధులు సమకూర్చాల్సి ఉండేది కానీ కొత్త బిల్లు ప్రకారం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు వాటా పంచుకోవాల్సి ఉంటుంది. కొత్త చట్టంలో మరిన్ని కీలక మార్పులు జరిగాయి. ఇదే క్రమంలో సోనియా గాంధీ మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట పార్లమెంటులో ఎంజీఎన్ఆర్ఈజీఏను ఆమోదించిన రోజు ఇప్పటికీ గుర్తుందని, అప్పట్లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నారని అన్నారు. అణగారిన వర్గాలకు, శ్రమ దోపిడీకి గురయ్యే వారికి, ముఖ్యంగా పేదలకు జీవనోపాధి కల్పించే దిశగా అదొక విప్లవాత్మక అడుగని ఎంజీఎన్ఆర్ఈజీఏను వర్ణించారు. ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చాక పని కోసం వలసలు తగ్గాయని అన్నారు. ఉపాధి పొందడం న్యాయమైన హక్కుగా మారిందని, తద్వారా గ్రామ పంచాయతీలు సాధికారత సాధించగలిగాయని తెలిపారు. మహాత్మా గాంధీ 'గ్రామ స్వరాజ్' విజన్ ఆధారంగా భారత్ కల నెరవేర్చే దిశగా ఎంజీఎన్ఆర్ఈజీఏ ద్వారా పటిష్ఠ ముందడుగు పడింది కానీ, మోదీ ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసిందని సోనియా గాంధీ విమర్శించారు. మహాత్మాగాంధీ పేరు తొలగించడమే కాదు, చట్టం స్వరూపాన్నే మార్చి వేశారని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మార్పులపై సర్కారు ఎవరితో సర్కారులు చర్చించలేదు... ప్రతిపక్ష సభ్యుల సలహాలు, సూచనలు కోరలేదని తెలిపారు. ఓ మంచి ఉద్దేశంతో తెచ్చిన చట్టాన్ని మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా నీరుగార్చిందని సోనియా గాంధీ విమర్శించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ ఎప్పుడు కూడా పార్టీకి సంబంధించినది కాదని, ప్రజా ప్రయోజనాల కోసం రూపొందిందని, 20 ఏళ్ల కిందట ఉపాధి హామీ కోసం పాటుపడ్డాను... ఇప్పుడూ నల్ల చట్టానికి వ్యతిరేక పోరాటానికి కట్టుబడి ఉన్నాను అని సోనియా గాంధీ ప్రకటించారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఆమోదించిన వీజీ ఆర్‌ఏఎం జీ బిల్లు (వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ))ను రాష్ట్రపతి ఆమోదిస్తే అది చట్టమవుతుంది. కొత్త బిల్లును వ్యతిరేకించే క్రమంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై నిర్ణయించేందుకుగాను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఈనెల 27న సమావేశం కాబోతోందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

మెస్సీకి రూ.89 కోట్లు ఇచ్చాం

(మొదటిపేజీ తరువాయి)

రూ.20 కోట్లు ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇవి కోల్‌కతా, హైదరాబాద్ ఈవెంట్ల టికెట్ల అమ్మకాలు, స్పాన్సర్ల నుంచి సేకరించిన మొత్తంగా విచారణ సందర్భంగా దత్తా చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈనెల 19న దత్తా ఇంట్లో నిర్వహించిన సోదాల్లో కొన్ని పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మెస్సీ కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియానికి వచ్చినప్పటి నుంచి ఆ రాష్ట్ర క్రీడా మంత్రి అరూప్ బిస్వాస్ అత్యుత్సాహం ప్రదర్శించడం, మెస్సీ నడుముపై చేయి వేసి ఫొటోలకు పోజులిచ్చిన వీడియోలు వైరల్‌గా మారాయి. పలుకుబడి ఉపయోగించి ఆయన కుటుంబ సభ్యులు, పరిచయస్తులను మెస్సీ దగ్గరకు తీసుకొచ్చినట్లు తెలిసింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో అరూప్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మైదానంలో ఉన్నప్పుడు మెస్సీ చికాకు పడ్డారు. అసౌకర్యానికి గురయ్యారు. జనసమూహాన్ని అదుపు చేయాలని పదే పదే చెప్పినా ఫలితం లేకుండా పోయింది. మెస్సీని కొందరు చుట్టుముట్టి, ఆలింగనం చేసుకున్న విధానం ఆమోదయోగ్యం కాదని అని దర్యాప్తు అధికారులకు దత్తా చెప్పినట్లు తెలిసింది.

గ్రౌండ్‌లోకి వచ్చేందుకు 150 పాసులు ఇచ్చినప్పటికీ అంతకుమించి మూడింతల మంది రావడంతో పరిస్థితి చేజారిందని నిర్వాహకులు తెలిపారు. ఇదిలావుంటే, మెస్సీ పర్యటన వేళ కోల్‌కతాలో జరిగిన ఘటనలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. దత్తాను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారిస్తోంది. స్టేడియంలోకి రాగానే అనేకమంది తాకడం, కౌగిలించుకోవడంతో మెస్సీ తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారని, నిర్దేశిత సమయానికి ముందే ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారని దర్యాప్తు అధికారులతో దత్తా చెప్పారు. ఈ పర్యటన ఖర్చు, మెస్సీకి చెల్లించిన నగదు వివరాలనూ ఆయన వెల్లడించారు.

అమెరికా ఉపగ్రహ ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. భూ కక్ష్యలో ఇప్పటివరకు ప్రయోగించిన వాణిజ్య శాటిలైట్‌లలో ఇదే అతిపెద్ద ప్రయోగంగా నిలవనుంది. ఒకప్పుడు ఇతర దేశాల సహకారంపై ఆధారపడిన భారత అంతరిక్ష కార్యక్రమం నేడు అమెరికా వంటి అగ్రశ్రేణి దేశాల శాటిలైట్లను స్వదేశీ రాకెట్ ద్వారా ప్రయోగించే స్థాయికి ఎదగడం దేశ శాస్త్రీయ శక్తికి స్పష్టమైన నిదర్శనంగా నిలుస్తోంది. ఈ మిషన్ ద్వారా అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష రంగంలో భారత్ విశ్వసనీయత మరింత పెరిగి ప్రపంచంలో భారత స్థానం మరింత బలపడనుంది.

ఎప్‌స్టీన్ సంచలనం

(మొదటిపేజీ తరువాయి)



చాలామంది వైద్యులు ఈ సహజ వైద్య వ్యవస్థ ఆధారంగా మసాజ్, ఇతర చికిత్సలు అందిస్తున్నారని ఫైళ్లు చెబుతున్నాయి. 'ది ఆర్ట్ ఆఫ్ గివింగ్ మసాజ్' అనే శీర్షికతో కథనాలు ఇందులో ఉన్నాయి. వాస్తవానికి ఈ కేసులో జెఫ్రీ ఎప్‌స్టీన్, అతని భాగస్వామి ఘిస్లైన్ మాక్స్‌వెల్ ప్రధాన నిందితులు. 2002-05 మధ్య జరిగిన సెక్స్ కుంభకోణంలో అనేకమంది యువతులకు డబ్బు ఎర వేసి జెఫ్రీ లైంగిక దాడులు చేయడమే కాకుండా, అమెరికా ప్రముఖులకు మైనర్ అమ్మాయిలను సరఫరా చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై బాధితుల్లో ఒకరైన వర్జీనియా గియుఫ్రే 2015లో సివిల్ దావా వేయడంతో ఈ పత్రాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఫైళ్లలో అమెరికా రాజకీయ నాయకుల నుంచి ప్రముఖ వ్యాపారవేత్తల పేర్లు ఉన్నాయి.

ఎప్‌స్టీన్ సెక్స్ ట్రాఫికింగ్‌కు అనేకమంది సహకరించినట్లు ఈ ఫైల్స్ పేర్కొన్నాయి. యుక్త వయస్సు బాలికలను ఈ దందాలోకి ఎప్‌స్టీన్ ఏ విధంగా దించారనే వివరాలు అందులో ఉన్నట్లు తెలుస్తోంది. 2019, జులైలో ఎప్‌స్టీన్‌పై సెక్స్ ట్రాఫికింగ్ అభియోగాలు మోపారు. అతడు విచారణకు ముందే మాన్‌హటన్ జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. సెక్స్ ట్రాఫికింగ్ కేసులో మాక్స్‌వెల్ 20 ఏళ్ల శిక్ష అనుభవిస్తున్నాడు.

ట్రాఫిక్ రూల్స్ పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ట్రాఫిక్ రూల్స్ పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సిఎస్ రామకృష్ణ ,స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్ , ఎంజేపి సెక్రటరీ సైదులు, జిల్లా కలెక్టర్ లు జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు , జేటీసిలు, డీటీసీలు, నేషనల్ రోడ్స్ అథారిటీ అధికారులు, ఇతర రవాణా శాఖ అధికారులతో నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి అదనపు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అన్ని విభాగాల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. జనవరిలో జరిగే రోడ్ సేఫ్టీ మాసంలో చేయాల్సిన కార్యక్రమాలుపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించడానికి రోడ్ సేఫ్టీ మాసంలో విద్యార్థులను, ఉద్యోగులను, వివిధ సంస్థలను భాగస్వామ్యం చేసేలా వారికి అవగాహన సదస్సులు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ విడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ భూక్య రవి రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్,డి.ఎస్.పి తిరుపతిరావు, జిల్లా విద్యాధికారి రాజేశ్వర్ రావు,ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, ఆర్.అండ్.బి ఈఈ భీమ్లా, జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి పాల్గొన్నారు.

కలెక్టర్ అభిలాష్ అభినవ్‌కు అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : జిల్లాలో ఇటీవల ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్‌ను అన్ని మండలాల ఎంపీడీవోలు శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అభినందించారు. ఎంపీడీవోలు పుష్పగుచ్ఛాలను అందిస్తూ, శాలువలతో సన్మానించారు. అలాగే, బైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ ను కూడా ఎంపీడీవోలు శాలువాతో సన్మానించారు. మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎక్కడా ఇబ్బందులు లేకుండా, ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యాయని ఎంపీడీవోలు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అధికారులకు కలెక్టర్ ఇచ్చిన ప్రోత్సాహం గొప్పదని, కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని వారు అభిప్రాయపడ్డారు. అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ఎంపీడీవోలను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం పి డి ఓ లు లక్ష్మీకాంత్, గజానన్, నీరజ్ కుమార్, రాధ, అరుణ, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలన : మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: రామగుండంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ఆయన గోదావరిఖని పాత మున్సిపల్ కార్యాలయంలో ఆగిపోయిన పార్కింగ్ కాంప్లెక్సును సందర్శించారు. శాలువల మార్కెట్ సింగరేణి కాకూర్ రెండేళ్ల పాలనపై ఆయన చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం గ్రాంట్ రూ.200 కోట్ల నిధుల ద్వారా రామగుండంలోని ప్రతి డివిజన్ లో డ్రైనేజీలు, రోడ్ల మరమ్మతులు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ పనులను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.అలాగే సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో ప్రతిపాదించిన పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భూమిపూజ చేసి దాదాపు 3 కోట్లకు పైగా నిధులతో పనులు ప్రారంభించామని అన్నారు. తాను వ్యాపార కూడలి లక్ష్మీనగర్ లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రారంభించిన పార్కింగ్ కాంప్లెక్స్ ప్రస్తుత ఎమ్మెల్యే పూర్తి చేయాల్సిన బాధ్యత ఉండగా పట్టించుకోవడంలేదని అన్నారు.తన హయంలో టియుఎఫ్ ఐ డి ద్వారా 100 కోట్ల రూపాయలు,అమృత్ ద్వారా 250 కోట్లు, డిఎమ్ ఎఫ్ టి ద్వారా 54 కోట్ల రూపాయలు శాంక్షన్ అయ్యి ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోవడం జరిగిందని అవే నిధులు ఇప్పుడు విడుదల అయినా ఎమ్మెల్యే పార్కింగ్ కాంప్లెక్స్ ను పట్టించుకోకుండా, పాతపనులనే కమీషన్లకోసం కొత్తగా చేస్తున్నారని ఆరోపించారు.ప్రస్తుత పాత మున్సిపల్ కార్యాలయంలో నిర్మాణంలో ఉన్న పార్కింగ్ కాంప్లెక్ ను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మూల విజయ రెడ్డి గోప్ అయిలయ్య యాదవ్ కల్వచర్ల కృష్ణవేణి జనగామ కవిత సరోజిని నూతి తిరుపతి,బొడ్డుపల్లి శ్రీనివాస్ నారాయణదాసు మారుతి తదితరులు పాల్గొన్నారు.



యూరియా ఆన్‌లైన్ బుకింగ్ యాప్ ప్రారంభం

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు సమయానికి, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ఫర్టిలైజర్ యూరియా ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌ను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మన గ్రోమోర్ -కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ కార్యాలయంలో ఈ యాప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన యూరియాను ముందుగానే బుక్ చేసుకుని, సమీప డీలర్ వద్ద నేరుగా పొందే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. ఇకపై రైతులు ఎరువుల కోసం క్యూ లలో నిలబడాల్సిన అవసరం ఉండదని, అక్రమ నిల్వలు, దళారుల పాత్ర తగ్గుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. యాప్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా యూరియా సరఫరా, పంపిణీలో పూర్తి పారదర్శకత ఉంటుందని చెప్పారు. రైతులు తమ మొబైల్ ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్, భూమి వివరాలతో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా బ్లాక్ మార్కెట్, బోగస్ కంపెనీలకు తావు లేకుండా పారదర్శకంగా ఎరువుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని, ఇది వ్యవసాయ శాఖ తీసుకున్న మంచి నిర్ణయమని అన్నారు. ఈ యాప్‌ను విస్తృతంగా వినియోగించి రాష్ట్రంలో నల్గొండ జిల్లాను నెంబర్ వన్‌గా నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జేడీ శ్రవణ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరు శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ సంపత్ రెడ్డి, ఫర్టిలైజర్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను సన్నద్ధం చేయాలి : మంత్రి

విశాలాంధ్ర- ఆంధ్ర బ్యూరో ఖమ్మం : ప్రపంచ స్థాయి పోటీలకు మన విద్యార్థులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఖమ్మం నగరం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ లో జిల్లా స్థాయి ఇన్ స్పైర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 900 ఎగ్జిబిట్స్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ఎగ్జిబిషన్ కు రావడం మన పిల్లల సృజనాత్మకతకు నిదర్శనమని, ఇది చాలా సంతోషకరమని అన్నారు. విజ్ఞాన ప్రదర్శనల వల్ల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో తల్లిదండ్రులు పడిన కష్టాలను చూసి కొంత మంది విద్యార్థులు ఆలోచించి వ్యవసాయ పనులను ఒకే యంత్రం చేసేలా తయారు చేశారని తెలిపారు. సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం విజ్ఞానాన్ని వినియోగిస్తూ చిన్న చిన్న యంత్రాలను విద్యార్థులు తయారు చేయడం మంచి పరిణామం అని అన్నారు. దేశ మాజీ రాష్ట్రపతి మహనీయులు అబ్దుల్ కలాం చిన్నతనంలో సరిగ్గా ఆహారం లేకపోయినా బాగా చదువుకొని దేశ అత్యున్నత స్థాయికి చేరుకున్నారని, అబ్దుల్ కలాం సూచించిన విధంగా పిల్లలు గొప్ప గొప్ప ఆలోచనలు చేయాలని, కలలు కనండి, వాటిని సాకారం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఖమ్మం జిల్లా విద్యారంగంలో భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. విద్య లేకపోతే ఎటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేసిన ప్రయోజనం ఉండదని, మన పిల్లలకు ఇచ్చే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. విద్యా ప్రమాణాలు పెరగడానికి ఉపాధ్యాయులకు కూడా అవసరమైన శిక్షణ ఎప్పటికప్పుడు అందించాలని, ప్రపంచంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యా బోధనలో మార్పులు చేసుకుంటూ విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయాలని మంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థలో ఎటువంటి అవసరం ఉన్న వెంటనే విద్యాశాఖ అధికారులు కలెక్టర్ ను సంప్రదించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఇన్ స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్ కార్యక్రమానికి 900 పైగా ఎగ్జిబిట్స్ రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పిల్లలో సైంటిఫిక్ టెంపర్ పెంపు కోసం ఇటువంటి వైజ్ఞానిక ఎగ్జిబిషన్స్ ఉపయోగపడ్డాయని అన్నారు. సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి మన చదువు ఏ విధంగా ఉపయోగ పడుతుందో ఆలోచించాలని, పాఠశాలలో చదివిన పరిజ్ఞానం ప్రాక్టికల్ గా ఎక్కడ ఎలా వాడాలి అనే అంశాన్ని విద్యార్థులు ఎల్లప్పుడూ ఆలోచించాలని, అప్పుడే చదువు మనకు బాగా ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిఈవో చైతన్య జైని, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, కార్పొరేటర్లు మల్లీడు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర-నిజామాబాద్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్, అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డి.సి.పి బస్వారెడ్డి, ఇతర అధికారులతో కలిసి నిజామాబాద్ నగర శివార్లలో తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మాక్లూర్ మండలం మానిక్ బండార్ చౌరస్తా సమీపంలోని సుభిక్ష్ స్టార్ మిల్ వద్ద, బోధన్ రోడ్ లోని ఎస్.ఎఫ్.ఎస్ ఫ్లైఓవర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా గల ప్రధాన రహదారులను సందర్శించారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగేందుకు గల కారణాలు గురించి పోలీస్, రోడ్లు-భవనాలు, పంచాయతీరాజ్, రవాణా తదితర శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ముఖ్యంగా బోధన్ రోడ్ లో మూడు సంవత్సరాల వ్యవధిలోనే రోడ్డు ప్రమాదాలలో 19 మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని, ప్రమాదాల తీవ్రతపై కలెక్టర్ ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాద ఘటనలలో అత్యధిక మరణాలు చోటుచేసుకున్న వాటిలో నిజామాబాద్ జిల్లాలోని ఈప్రాంతం 20వ స్థానంలో ఉందన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రోడ్డు ప్రమాదాల నివారణ కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాలలో రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి, రోడ్డు విస్తరణ పనులను జరిపించాలని ఆర్ అండ్ బీ, పోలీస్ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా గల అన్ని రహదారులపై బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాలలో ప్రమాదాలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఆర్టీసీ బస్ డ్రైవర్లు సహా, ఇతర ప్రైవేట్ వాహనాల ఆపరేటర్లకు రోడ్డు భద్రతా ప్రమాణాలను విధిగా పాటించేలా ట్రాఫిక్ నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ స్పాట్లను పరిశీలించిన అధికారుల బృందంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎం.వి.ఐ డి.శ్రీనివాస్, ఆర్ అండ్ బీ అధికారి ప్రవీణ్, ఈడీఎం మేనేజర్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

కొంతమంది అధికారులతో సింగరేణి కీర్తి ప్రతిష్ట దెబ్బతింటున్నాయి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - కొత్తగూడెం : కొంతమంది అధికారుల ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తుండటంతో సింగరేణి సంస్థ కీర్తిప్రతిష్టలు దెబ్బతింటున్నాయని సంస్థ మనుగడకే నష్టం కలిగిస్తున్నారని ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. శనివారం ఆయన మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలు అనేక విషయాలు ప్రస్తావించారు. తమ స్వార్థం స్వార్థ ప్రయోజనాల కోసం అధికార వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులలో ఏ పార్టీ ఉంటే దానికి దాసోహం అంటూ సింగరేణి సంస్థకు నష్టాలు కలుగజేస్తూ తీవ్ర అక్రమాలకు పాలు చేస్తున్నారని ఆరోపించారు. రిటైర్డ్ అయిన కార్మికులకు లాభాల వాటా బోనస్ పీవీబీ బోనస్ ఇవ్వటానికి క్వార్టర్లు ఖాళీ చేయాలని నిబంధన ఇవిధరకు ఎప్పుడు సింగరేణిలో లేదన్నారు. రిటైర్డ్ అయిన కార్మికుడు క్వార్టర్ ఖాళీ చేయకపోతే ఒక గ్రాట్యూటీ మాత్రమే ఇవిధరకు ఆపేవారని సీతారామయ్య గుర్తు చేశారు. కాకపోతే ప్రస్తుతం అధికారులు అనుసరిస్తున్న వ్యవహార శైలి చూస్తే కొత్త నిబంధనల పేర రిటైర్డ్ అయిన కార్మికులు క్వాటర్ ఖాళీ చేస్తేనే లాభాల వాటా, దీపావళి బోనస్ ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్మిక సంఘం ఏఐటియుసీగా మేము దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ నిధులు కోట్లది రూపాయలు దొడ్డిదారిన ప్రభుత్వాలకు అందించటం అభ్యంతరకరమన్నారు. విద్యుత్ సంస్థల నుండి సింగరేణి సంస్థకు వచ్చే రూ. 40 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని లెక్కలు చెప్పారు. సంస్థకి వచ్చే నిధులను మాత్రం రాబట్టడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా సింగరేణి సంస్థ లేని జిల్లాలో కోట్లల్లో ఎందుకు ఖర్చు పెడుతున్నారని ప్రశ్నించారు. సింగరేణిలో సంప్రదాయంగా వస్తున్న పండగ సింగరేణి అవతరణ దినోత్సవం సందర్భంగా సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం కుటుంబ సభ్యులతో వారి వారి ఏరియాల్లో వేడుకలను ఘనంగా జరుపుకుంటారని దీన్ని కూడా నిధుల కొరత పేర నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. వేలకోట్ల టర్నోవర్ ఉన్న ఇంత పెద్ద సంస్థకు అవతరణ దినోత్సవ పండుగకి మాత్రం పైసలు లేవని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఏరియా జీఎం కార్యాలయాల్లో మాత్రమే వేడుకలు జరుపుకోవాలని తక్కువ బడ్జెట్ కేటాయించడం బాధాకరమన్నారు. కొంతమంది అధికారులు కావాలని కార్మికుల మధ్య పరస్పరం గొడవలు సృష్టిస్తూ రెచ్చగొట్టే పద్ధతి అనుసరిస్తున్నారని ఈ పరిణామం సంస్థ మరొకటుకు తీవ్ర విఘాతమన్నారు. ఇలాంటి అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్న హెచ్చరించారు.

రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

విశాలాంధ్ర/ములుగు జిల్లా బ్యూరో: రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు–2026 పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు, రవాణా, ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేష్ ఎం భగవత్, జాతీయ రహదారులు, ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం శనివారం నిర్వహించగా, జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఓ ఎస్ డి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేవారని, గత ఏడాది నుంచి మాసోత్సవాలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులతో మాట్లాడుతూ, జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించుటకు, ఆయా విద్య సంస్థల్లో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ ఇతర పోటీలు నిర్వహించుటకు, నేషనల్ హై వే, ఆర్అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, డిఈఓ సిద్ధార్థ రెడ్డి, నేషనల్ హై వే డిఈ కుమార స్వామి, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, ఆర్అండ్ బీ ఈఈ శ్యామ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి : సీపీఐ

విశాలాంధ్ర ఖమ్మం : నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కోరారు. శనివారం కామేపల్లి మండలం గాదెపాడు సర్పంచ్ భూక్యా రంజిత్, వార్డు సభ్యులు సిపిఐ కార్యాలయంలో సిపిఐ నేతలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి -సురేష్ సర్పంచ్, వార్డు సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రజల ఆశలకు అనుగుణంగా పనిచేయాలని, సంక్షేమ పథకాలు పేదల దరిచేరేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు -సభ్యులు ముక్కంటి విజయ, బానోత్ వీరమ్మ, నాసరాల లీల, నాసరాల మల్లయ్య, అస్లాం, ఎస్కె జైన్, వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాసరాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : సోమవారం, జిల్లాలో నిర్వహించబోయే విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లను పలువురు అధికారులు పరిశీలించారు. జిఎన్ఆర్ కాలనీలో, ఎక్సర్సైజ్ నిర్వహించే ప్రదేశాన్ని ప్రత్యేకంగా పరిశీలించి, అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు కమిషనర్. ఈ కార్యక్రమం జిఎన్ఆర్ కాలనీతో పాటు, జిల్లా వివిధ ప్రాంతాల్లో నిర్వహించబడ నుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు ప్రభాకర్, శివాజీ, సీపీవో జీవరత్నం, డిపిఎం శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్‌రాజు, స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : ఆదివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విజ్ఞప్తి చేశారు. చిన్న చిన్న కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ...ఆర్థిక భారంతో పాటు సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువైపుల సమ్మతితో సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం %c% కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేసినవారికిపై శిక్ష తప్పదు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు మండలంలో జరిగిన స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎవరెవరైతే కార్యకలాపాలు చేశారో వారికి కఠిన చర్యలు తప్పవని మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ అన్నారు. శనివారం స్థానిక పరమేశ్వర ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీతరపున గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన వారందరికీ సన్మాన సత్కారాన్ని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులు చిట్ల వెంకన్న అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలలో గెలిపోటములు సహజమని గుర్తు చేస్తూ గూడూరు మండల కేంద్రంలో 2 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ జెండా కింద ఆహోరాత్రులు పాటుపడి గెలుపు లక్ష్యంగా ముందుకు సాగిన వాంకోవోత్ సునీత కొమ్మాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిట్ల వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వేం శ్రీపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాంకోవోత్ కొమ్మాలు, జిల్లా నాయకులు ప్రదీప్ రెడ్డి,మండల యూత్ అధ్యక్షులు బొల్లికొండ మధు,నెక్కొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏళ్ల నరేష్, మండల నాయకులు అజ్మీర వీరస్వామి, యాదవ రెడ్డి, నూతన సర్పంచులు, ముఖ్య పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జన వికాస సంస్థ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-మరిపెడ: జన వికాస సంస్థ సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయం మాజీ సర్పంచ్ బానోత్ రాంలాల్,ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జ్యోతి కిరణ్ అన్నారు.శనివారం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని బాల వికాస కార్యాలయంలో జన వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర ఆధ్వర్యంలో అనాథ పిల్లల పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జ్యోతి కిరణ్,మాజీ సర్పంచ్ బానోత్ రాంలాల్,అబ్బాయిపాలెం సర్పంచ్ బోడ సోమ్లా నాయక్,ఉప సర్పంచ్ షేక్ షరీఫ్, ఉగ్గంపల్లి మాజీ ఎంపీటీసీ భర్తపురం ఐదయ్య కొమురెల్లి,కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాయల రవి, ఎడ్యుకేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అమ్మల్లు, దంతాలపల్లి సెంటర్ మేనేజర్ సుకన్య, శోభ, తొర్రూర్ సెంటర్ మేనేజర్ రమా,తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై పిల్లల చేత కేక్ కట్ చేయించారు.అనంతరం పిల్లలకు తినిపించి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జ్యోతి కిరణ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తల్లిదండ్రులు లేని పిల్లలకి వాళ్ళ చదువులకు అయ్యే ఖర్చులు, నిత్యావసర వస్తువులు, బ్యాగ్, పెన్నులు అందించడం జరిగిందని తెలిపారు.జన వికాస సంస్థ దాతల సహాయంతో అనాథ పిల్లలను,వృద్ధులను చేరదీసి వారి బాగోగులు చూడటంతో పాటు అనేక గ్రామాలల్లో తాగునీరు, విద్య, వైద్యం, పారిశుధ్యం,సేంద్రియ వ్యవసాయం,వితంతు వివక్షత నిర్మూలన, మహిళలను చైతన్యపరచటం చేయడం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి గ్రామాలల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.జన వికాస చేపడుతున్నటువంటి వివిధ కార్యక్రమాలు వివరించారు.అనంతరం రాంలాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారి బాగోగులను చూస్తూ ప్రయోజకులను చేస్తున్న జన వికాస సంస్థ సేవలు అభినందనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర, సహ కోఆర్డినేటర్ జె.ఉపేంద్ర, జి. కవిత,గ్రామ పెద్దలు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వికాస్ పాఠశాలలో వింటర్ డే

విశాలాంధ్ర-తొర్రూరు: తొర్రూరుడివిజన్ కేంద్రంలోని వికాస్ పాఠశాలలో వింటర్ డే కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ అన్నారు. శు క్రవారం పాఠశాలలో విద్యార్థులు చలికాలపు దుస్తులను ధరించి స్నో మాన్, పోలార్ బియర్, స్నో క్రిస్టల్ లతో కార్నివాల్ నిర్వహించి,రకరకాల ఆకృతులను ప్రదర్శిస్తూ విద్యార్థులకు ఉపాధ్యాయులు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, అలాగే వచ్చే వ్యాధుల వాటికి సంబంధించిన చిన్న చిన్న రెమెడీస్ గూర్చి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వాతావరణ మార్పులను తట్టుకొని, విద్యార్థులు ఎదగడం కోసం అలాగే విద్యార్థులకు వాతావరణంలో వచ్చే మార్పులని అవగాహన కల్పించడం కోసం వింటర్ డే ఆక్టివిటీని చేయడం జరిగిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కె.వి. రెడ్డి , ప్రిన్సిపల్ వేణుమాధవ్, నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ రాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

సంపాదకీయం

విద్వేషానికి కర్నాటక అడ్డుకట్ట

దాదాపు నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయిన సందర్భంలోనే విద్వేష ప్రసంగాలను నిరోధించడం కోసం సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాలు జారీ చేసింది. విద్వేష ప్రసంగాలు చేసిన వారిని అరెస్టు చేయడానికి ఉండవలసిన ప్రాతిపదిక, విధించదగిన శిక్ష ఏమిటో కూడా ఈ మార్గదర్శక సూత్రాలలో నిర్దేశించారు. 2014లో జారీచేసిన ఈ మార్గదర్శక సూత్రాలను అర్నేష్ కుమార్ గైడ్‌లైన్స్ అంటారు. విద్వేష ప్రసంగాలు చేసినప్పుడు ఆ వ్యక్తి పారిపోతాడనో, సాక్ష్యాలను ధ్వంసం చేస్తాడోనని అనుమానం ఉన్నప్పుడు మాత్రమే అరెస్టు చేయాలని కూడా స్పష్టంగా చెప్పారు. విద్వేష ప్రసంగం చేసినందుకు ఎవరినైనా అరెస్టు చేస్తే ఆ వ్యక్తిని ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని కూడా సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈ మార్గదర్శక సూత్రాలలో అరెస్టు చేసే అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదన్నది అత్యున్నత న్యాయస్థానం ఉద్దేశం. విద్వేష ప్రసంగాలు చేసిన వారికి అత్యధికంగా ఏడేళ్ల జైలు శిక్ష విధించవచ్చునని కూడా ఉంది. అయితే మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ మార్గదర్శక సూత్రాలను మార్గదర్శక్ మండల్‌లో పడేసినట్టున్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి తమ మీద చేయి వేసేవారు ఎవరూ లేరన్న ధైర్యం వచ్చినందువల్ల విద్వేష ప్రసంగాలు రోజువారీ కార్యక్రమాలు అయిపోయాయి. అనురాగ్ ఠాకూర్, గిరిరాజ్ కిశోర్, నిశికాంత్ దుబే లాంటి వారైతే విద్వేష ప్రసంగాలలో డాక్టరేట్లు సాధించినట్టున్నారు. ఈ మార్గదర్శకాలు జారీ చేసిన దాదాపు పదకొండేళ్లకు కర్నాటక శాసనసభ శుక్రవారం విద్వేష ప్రసంగాలను నిరోధించడానికి బిల్లు ఆమోదించింది. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. సహజంగానే ప్రతిపక్ష బీజేపీ ఈ బిల్లును గట్టిగా వ్యతిరేకించడమే కాక ఆమోదించే సమయంలో వాకౌట్ కూడా చేసింది. గత పదో తేదీన ఈ బిల్లును శాసనసభలో ప్రతిపాదించారు. కర్నాటక సముద్ర తీర ప్రాంతంలో గత రెండు నెలలుగా వరసగా మతపరమైన హత్యలు జరుగుతున్నందువల్ల, విద్వేష ప్రసంగాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నందు వల్ల ఈ బిల్లు ప్రతిపాదించవలసి వచ్చింది. గత ఏప్రిల్‌లో అష్రాఫ్‌ను హతమార్చడం విద్వేష హత్యలకు తాజా ఉదాహరణ. హోం మంత్రి జి.పరమేశ్వర ఈ బిల్లు ప్రవేశ పెట్టారు. ఆ దశలోనే ప్రతిపక్ష బీజేపీ గట్టిగా వ్యతిరేకించింది. సభ వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ బిల్లు ఆమోదిస్తే దీనిని హిందూ సంస్థల మీద కసి తీర్చుకుంటారని బీజేపీ వాదించింది. ఆమోదంపొందిన ఈ బిల్లులో ఆన్‌లైన్లో ప్రచురితమయ్యే విద్వేష ప్రచారాన్ని తొలగించే అధికారం కూడా ప్రభుత్వానికి ఉంటుంది. ఒక వ్యక్తికి లేదా ఒక సమూహానికి హాని చేసే ఉద్దేశంతో చేసే వ్యాఖ్యలను విద్వేష ప్రసంగంగా పరిగణిస్తారు. ఈ విద్వేషం జాతిని, మతాన్ని, ఒక నిర్దిష్ట సమూహాన్ని, పుట్టిన చోటును, స్త్రీనో పురుషుడినో నిందించడాన్ని విద్వేషంగా ఈ బిల్లు పరిగణిస్తుంది. అంటే ఇది కేవలం మత విద్వేషాలను రెచ్చగొట్టడానికే పరిమితమైంది కాదు. ఈ బిల్లు ప్రకారం విద్వేషానికి పాల్పడే వారు కేవలం వ్యక్తులే కానక్కర్లేదు, వ్యవస్థలు, సంస్థలు కూడా కావొచ్చు. ఆ వ్యవస్థలు, సంస్థలతో సంబంధం ఉన్న వారి మీద చర్య తీసుకోవడానికి ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది. విద్వేషం రెచ్చగొట్టే సంస్థ మీద కూడా చర్య తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే ఒక సంస్థ లేదా వ్యవస్థ విద్వేషం రెచ్చగొట్టినప్పుడు ఆ సంస్థ సభ్యులకు తెలియకుండా ఉంటే ఆ వ్యక్తుల మీద చర్య తీసుకోవడానికి అవకాశం ఉండదు. ఈ వెసులుబాటు ఇంతకు ముందు వెలువడ్డ ముసాయిదా బిల్లులో ఉండేది కాదు. అయితే ప్రజా శ్రేయస్సు కోసం వెల్లడించే సమాచారం విద్వేష ప్రసంగంగా కనిపించినా చర్య తీసుకోవడానికి వీలుండదు. విజ్ఞాన శాస్త్రం, కళలు, పాఠ్యాంశాలు, మతపరమైన వ్యవహారాలు, వారసత్వానికి సంబంధించిన అంశాలలో విద్వేషంలా కనిపించే విషయాలపై చర్య తీసుకునే అవకాశం ఉండదు. విద్వేష ప్రసంగాలు చేసే వారికి ఒక సంవత్సరం నుంచి ఏడేళ్లదాకా జైలు శిక్ష విధించవచ్చు. రూ. 50,000 జరిమానా కూడా విధించవచ్చు. మొదటిసారి శిక్ష అనుభవించినప్పటికీ రెండోసారి అదే పని చేస్తే 2 నుంచి పదేళ్ల దాకా జైలు శిక్ష విధించవచ్చు. లక్ష రూపాయల జరిమానా కూడా విధించే అవకాశం ఉంటుంది. మునుపటి ముసాయిదా బిల్లు ప్రకారం అయితే నిందితులకు, విద్వేష ప్రసంగాన్ని రెచ్చగొట్టడానికి తోడ్పడే వారికి మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉండేది. అయితే ఈ ముసాయిదా బిల్లుపై న్యాయ నిపుణుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అయింది. పదేళ్ల శిక్ష విధించే అవకాశం ఉండడం అర్నేష్ కుమార్ మార్గదర్శక సూత్రాల పరిధిని ఉల్లంఘించడమేనని విమర్శకులు అభిప్రాయపడ్డారు. అంతేకాక పోలీసులు అరెస్టు చేయడానికి అపరిమితమైన అవకాశాలు కల్పించే ప్రమాదమూ ఉంటుంది.

శుక్రవారం ఆమోదించిన బిల్లులో విద్వేష ప్రసంగానికి గురైన బాధితులకు పరిహారం చెల్లించే అవకాశమూ కల్పించారు. ఈ బిల్లు విద్వేష ప్రసంగాలను నిరోధించే చర్య తీసుకోవడానికి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లకు, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ స్థాయికి తగ్గని పోలీసు సిబ్బందికి అధికారాలు ఇస్తోంది. విద్వేషాన్ని రెచ్చగొట్టే క్రమంలో చర్య తీసుకునే అధికారుల మీద బాధితులు లేదా వారి తరఫు వారు కల్పించుకోకుండా వెసులుబాటు కల్పించారు. ఇంతకు ముందు జూన్‌లో బయటికొచ్చిన ముసాయిదాలో ఈ అవకాశం లేదు. విద్వేష ప్రసంగాలను కట్టడి చేయడానికి ప్రత్యేక చట్టం రూపొందించిన ఖ్యాతి కర్నాటక శాసనసభకే దక్కుతుంది. విద్వేష ప్రసంగాలు చేసినప్పుడు ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు తమంత తాముగా చర్య తీసుకునే అవకాశం కల్పించారు. ఈ బిల్లు వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను అతిక్రమిస్తుందని ప్రతిపక్ష బీజేపీ నాయకుడు ఆర్. అశోక ఆవేదన వ్యక్తం చేశారు. విద్వేషాన్ని రెచ్చగొట్టేవారు చేస్తున్న పని ఇదే అని ఆయన గుర్తించినట్టు లేదు. ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకన్నా ఏం ఆశించగలం అని కూడా గతాన్ని తవ్వే ప్రయత్నం గట్టిగానే చేశారు. నిజానికి ఈ బిల్లులో ఉన్న అంశాలన్నీ భారతీయ న్యాయ సంహితలో ఉన్నాయి. కర్నాటక శాసనసభ ఆ అంశాల ఆధారంగా మాత్రమే బిల్లు రూపొందించింది తప్ప వాక్ స్వాతంత్ర్యాన్ని, పత్రికా స్వేచ్ఛను హరించడానికి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ఈ బిల్లును వినియోగించుకోవచ్చునని, అది ఎన్నటికైనా మీ మీదే ప్రయోగించే ప్రమాదం ఉందని అశోక్ దెప్పి పొడిచారు. నిజానికి కర్నాటక కోస్తా ప్రాంతంలో విద్వేష ప్రసంగాలకు అడ్డూ ఆపూ లేకుండా పోయింది. మతపరమైన విద్వేషాలను ఆపాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు గత మేలో అభిప్రాయపడింది. అయితే చట్టాలు విద్వేష ప్రసంగాలను ఆపుతాయని అనుకోలేం. కానీ ప్రభుత్వం చర్య తీసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం అవశ్యం

కె. సుబ్బరాయన్, తిర్పూర్ ఎంపీ

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ నేడు సంక్షోభంలో ఉంది. దానిని పరిష్కరించేందుకు ఎన్నికల సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉంది. ఓట్ల శాతానికి అనుగుణంగా దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరం. ఎన్నికల సంస్కరణలపై ఈ నెల 10 వ తేదీన లోక్‌సభలో జరిగిన చర్చలో సీపీఐ తరపున చర్చలో పాల్గొనే అవకాశం నాకు కలిగింది. ఆ ప్రసంగంలోని ముఖ్యాంశాలు. ఎన్నికల సంస్కరణలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తరపున నా అభిప్రాయాలను సభ ముందు ఉంచాను. స్వతంత్ర భారతదేశంలో అనేక సంవత్సరాలుగా జరుగుతున్న ఎన్నికలు మనకు ఎన్నో అనుభవాలను ఇచ్చాయి. వాటి నుంచి నేటి పాలకులు పాఠాలు నేర్చుకొని ఈ దిశగా ఆలోచిస్తారో లేదో నాకు తెలియదు.

ఇప్పుడు అవసరమైన మొదటి సంస్కరణ ఏమిటంటే, ఓట్ల శాతానికి అనుగుణంగా దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యాన్ని కల్పించాలి. నిజంగా ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే, దానిపట్ల శ్రద్ధ వహించే వారు చేయవలసిన గొప్ప సంస్కరణ ఇది. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. జాతీయ స్థాయిలో ప్రతి పార్టీకి వచ్చిన ఓట్లు, ఓటింగ్ శాతాన్ని మీరు చూడాలి. ఆ శాతం ఆధారంగా, ప్రతి పార్టీకి ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్యను నిర్ణయించాలి. ఇది అత్యంత అవసరమైనది. కానీ నేటి పాలకులు అలా చేసేందుకు సుముఖంగా లేరు. అధికార పార్టీ, ప్రభుత్వం పనితీరును దగ్గరగా గమనిస్తే, వారిలో అలాంటి ఆలోచన లేదా ఆలోచనా విధానం ఏమాత్రం లేదని స్పష్టంగా తెలుస్తోంది. తప్పు ఎక్కడ జరిగింది? ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థకు నాయకత్వం వహించే నైతిక బాధ్యత ఈ ప్రభుత్వానికి ఉందా? ఎన్నికల కమిషనర్ ఎంపిక కోసం ముగ్గురు సభ్యుల ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని మీరు (ప్రభుత్వం) ఎందుకు తొలగించారు? మీ ఉద్దేశం ఏమిటి?

గౌరవ ప్రతిపక్ష నాయకుడు మిమ్మల్ని నాలుగు ప్రశ్నలు అడిగారు. అవన్నీ చాలా అర్థవంతమైనవి. అధికారంలో ఉన్నవారు సమాధానం చెప్పాలి. వారు ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ నాలుగు

ప్రశ్నలలో కుట్ర దాగి ఉంది. వారు గంభీరంగా సమాధానం ఇస్తే, అది ప్రయోజనకరంగా ఉంటుంది. వారు మూడు ఏర్పాట్లు చేశారు. మొదటిది ఏమిటంటే, వారు 2011 జనాభా లెక్కలను వాయిదా వేశారు. ఈ ప్రభుత్వం ప్రకటించినట్లుగా, ఇది 2027 లో జరుగుతుంది. 2031 కి ప్రకటించాల్సిన జనాభా లెక్కలు ఇప్పుడు 2027 లో జరుగుతాయి. దీని వెనుక ఒక ఉద్దేశం ఉంది. మీరు ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను చూస్తే, ఆయన 2029 సంవత్సరం వరకు ఆ పదవిలో ఉంటారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ 2029 వరకు ఆ పదవిలో కొనసాగేలా వారు ఒక పక్కా ఏర్పాటుచేశారు. వారు ఎంత కుట్రపూరితంగా ఉన్నారో చూడండి? వారు ఈ ఏర్పాటు ఎందుకు చేశారు? ఈ విషయంపై సామాన్య ప్రజలకు పాలకులు సమాధానం చెబుతారా? ఎందుకంటే వారిలో నిజాయితీ లేదు. ప్రజాస్వామ్యంలో వారు అనర్హులు. పాలకులకు ఆర్ఎస్ఎస్ సంస్థ నేర్పిన పాఠం ఇదే. మీరు చేస్తున్న పనిని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం అంటారు. మీరు ఒక శక్తిమంతమైన ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేస్తున్నారు. మీరు అలా చేస్తే ఓడిపోతారు. ప్రజాస్వామ్యాన్ని అంగీకరించవద్దని వారికి ఆర్ఎస్ఎస్ నేర్పింది. నేను బహిరంగ సవాలు చేస్తున్నాను. ప్రజాస్వామ్యం ఒక విదేశీ వస్తువు, అది ఏ

ప్రస్తుత ఎన్నికల కమిషనర్ 2029 వరకు ఆ పదవిలో కొనసాగేలా వారు ఒక పక్కా ఏర్పాటు చేశారు. వారు ఎంత కుట్రపూరితంగా ఉన్నారో చూడండి? వారు ఈ ఏర్పాటు ఎందుకు చేశారు? ఈ విషయంపై సామాన్య ప్రజలకు పాలకులు సమాధానం చెబుతారా? ఎందుకంటే వారిలో నిజాయితీ లేదు. ప్రజాస్వామ్యంలో వారు అనర్హులు. పాలకులకు ఆర్ఎస్ఎస్ సంస్థ నేర్పిన పాఠం ఇదే. మీరు చేస్తున్న పనిని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం అంటారు. మీరు ఒక శక్తిమంతమైన ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేస్తున్నారు. మీరు అలా చేస్తే ఓడిపోతారు. ప్రజాస్వామ్యాన్ని అంగీకరించవద్దని వారికి ఆర్ఎస్ఎస్ నేర్పింది. నేను బహిరంగ సవాలు చేస్తున్నాను. ప్రజాస్వామ్యం ఒక విదేశీ వస్తువు, అది ఏ విధంగానూ భారతీయ స్వభావం కలది కాదు గోల్వాల్కర్ వారికి నేర్పిన పాఠం ఇదే. గోల్వాల్కర్ నుంచి పాఠాలు నేర్చుకున్న తర్వాత, వాళ్లు (బిజెపి, ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, మతాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య వ్యవస్థను చేజిక్కించుకుని అధికారాన్ని ఆక్రమించారు. దీని ద్వారా, వారు ఆ సంస్థలలో ఉంటూనే ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తారు లేదా కూల్చివేస్తారు. అందుకే అన్ని విధాలుగా, వారు సైన్యం, న్యాయ వ్యవస్థ, అన్ని ఇతర సంస్థలలో చొరబడుతున్నారు.

విధంగానూ భారతీయ స్వభావం కలది కాదు గోల్వాల్కర్ వారికి నేర్పినపాఠం ఇదే. గోల్వాల్కర్‌నుంచి పాఠాలు నేర్చుకున్న తర్వాత, వాళ్లు (బిజెపి, ఆర్ఎస్ఎస్) రాజ్యాంగం, మతాన్ని ఉపయోగించి ప్రజాస్వామ్య వ్యవస్థను చేజిక్కించుకుని అధికారాన్ని ఆక్రమించారు. దీని ద్వారా, వారు ఆ సంస్థలలో ఉంటూనే ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తారు లేదా కూల్చివేస్తారు. అందుకే అన్ని విధాలుగా, వారు సైన్యం, న్యాయ వ్యవస్థ, అన్ని ఇతర సంస్థలలో చొరబడుతున్నారు. భారతదేశం ఒక కఠినమైన, అత్యంత దారుణమైన సమయాన్ని ఎదుర్కొంటోంది.

(న్యూయేజ్ నుంచి)

విద్యా వ్యవస్థలో వెలుగుతున్న 'చీకటి' వైరుధ్యం

వెంకగారి భూమయ్య, 9848559863

వ్యంగ్యానికి అంటూ ఒక శాశ్వత చిరునామా కావాలంటే అది ఏ రాజమార్గాల్లోనో లేదా ప్రభుత్వ అధికారిక బంగ్లాల్లోనో కాకుండా, ఒక భారతీయ పాఠశాల స్టాఫ్ రూమ్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. అది చిరిగిపోతున్న హాజరు పట్టికలకు, వ్యవస్థను సజీవంగా ఉంచే నిలువెత్తు విద్యావేత్తల వేలిముద్రలను సైతం గుర్తించడంలో పదేపదే విఫలమయ్యే మొండి బయోమెట్రిక్ యంత్రాలకు మధ్య ఒక నిశ్శబ్ద రోదనలా కూర్చుని ఉంటుంది. జ్ఞానాన్నిపూజించే సంస్కృతిగల ఈ దేశంలో, ఉపాధ్యాయులను 'గురుబ్రహ్మ' అని కొనియాడుతూనే, వారిని నిశ్శబ్దంగా 'ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్లర్కులు'గా మార్చే కుట్రపూరిత ప్రక్రియ నిర్విరామంగా కొనసాగుతోంది. శిక్షణపొందిన ఒక మేధావిని బోధన అనే 'అసౌకర్యం'తో ఎందుకు ఇబ్బంది పెట్టాలి? అనే ధోరణి నేడు పాలకుల్లో బలంగా పాతుకుపోయింది. అందుకే వారిని ఫారాలు నింపడం, లెక్కలేనన్ని పోర్టల్స్‌లో పొంతన లేని సమాచారాన్ని నమోదు చేయడం, సంతకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ యాచకుల్లా తిరగడం వంటి పనుల్లో బందీలను చేస్తున్నారు. ఫలితంగా, విద్యార్థులతో గడపాల్సిన విలువైన సమయం డేటా అప్‌లోడ్ల పేరుతో గాలిలో కలిసిపోతోంది. అక్షరాలను దిద్దించాల్సిన చేతులు స్మార్ట్‌ఫోన్లలో ఓటీపీల కోసం వెతుక్కుంటున్నాయి. ఒకప్పుడు ఉపాధ్యాయుడి వృత్తి అంటే సమాజానికి దిశానిర్దేశం చేసే ఒక ఉన్నత గౌరవం, కానీ నేడు అది అటెండెన్స్ యాప్‌లో ఫోటోలు దిగడానికి తాపత్రయపడే ఒక నిస్సహాయ వేతన జీవి స్థాయికి దిగజారిపోయింది. ఇది వ్యవస్థీకృత నిర్లక్ష్యం కాదు, ఒక మేధోపరమైన దోపిడీ ఎందుకంటే ఆలోచించే మెదళ్లను తయారుచేసే గురువును, కేవలం గణాంకాలను సేకరించే గణాంక యంత్రంగా మార్చివేస్తే, ఆ దేశం భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లక తప్పదు.

ఒకప్పుడు ఉపాధ్యాయుడి వృత్తిపరమైన పరికరాలు అంటే కేవలం చాక్‌పీస్, పుస్తకాలు, జిజ్ఞాసతో కూడిన మనసు మాత్రమే. కానీ నేడు, అది ఒక జూనియర్ బ్యూరోక్రాట్ పరికరాల వలే ఉంది. ఉపాధ్యాయులు కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌ల వంటి పనితనాన్ని, క్లరికల్ సిబ్బంది వంటి విధేయతను ప్రదర్శించాలని ఆశిస్తున్నారు, కానీ వారికి ఇచ్చే గౌరవం, వేతనం మాత్రం సులభంగా భర్తీ చేయగల ఒక సామాగ్రి వలే ఉంటుంది. భవిష్యత్‌పౌరులను తీర్చిదిద్దేబాధ్యతను మనం ఉపాధ్యాయులకు అప్పగిస్తాం, కానీ విద్యార్థులతో అర్థవంతంగా మమేకమవ్వడానికి అవసరమైన సమయాన్ని, స్వయంప్రతిపత్తిని, గౌరవాన్ని వారికి నిరాకరిస్తాం. తరగతి గది ఒక నిశ్శబ్దమైన అణచివేతకు గురైంది. ఒకప్పుడు సంభాషణలకు, ఆవిష్కరణలకు నిలయంగా ఉన్న తరగతి గది, ఇప్పుడు పరిపాలనాపరమైన పనులమధ్య ఒక అంతరాయంగా మారింది. ఉపాధ్యాయులు ఆలోచనలను పెంపొందించడం కంటే డేటాను ధృవీకరించడానికే ఎక్కువ సమయం గడుపుతున్నారు. విలువలరూపకల్పన కంటే నివేదికలను సిద్ధం చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. జనాభా గణన నుంచి ఎన్నికల విధుల వరకు, ఉపాధ్యాయులు ప్రభుత్వ యంత్రాంగానికి ఒక సాధనంగా మారిపోయారు. ఉపాధ్యాయుడు తరగతి గదిలో ఉండాల్సిన సమయంలో సర్వేల కోసం వీధుల్లో తిరగాల్సి రావడం విద్యా వ్యవస్థ వైఫల్యానికి పరాకాష్ఠ.

ఈ వ్యవస్థ ఒక విచిత్రమైన సందిగ్ధంలో పయనిస్తోంది. వెలుగును పంచాల్సిన దీపం కేవలం తన చుట్టూ ఉన్న నీడలను లెక్కించడానికే పరిమితమైతే, అది వెలుగునిస్తుందా లేక చీకటిని కొలుస్తుందా అనే ప్రశ్నార్థకంలో విద్యార్థుల భవిష్యత్తు కొట్టుమిట్టాడుతోంది. గొడ్డలి వేటుకు గురవుతున్న చెట్టులో చివరి శ్వాసలా విద్యా వ్యవస్థ ఊపిరి పోసుకుంటుంటే, అంధకారమే ఒక అధికారిక విధానంగా చలామణి అవుతున్న చోట దీపాన్ని వెలిగించడమా లేక ఆరిపోతున్న దానిని ఆర్పేయడమా అనే సంశయంలోనే నేటి విధానకర్తలు చిక్కుకుపోయారు. ఆ గందరగోళమే ఇప్పుడు ఒక క్రమశిక్షణగా, ఆ అస్తవ్యస్తతలే ఒక అభివృద్ధిగా భ్రమింపజేస్తున్న ఈ కాలంలో, జ్ఞానం ఒక డేటా పాయింట్‌గా మారి సమాధి అవుతోంది. అసలు ఉపాధ్యాయుడు బోధిస్తున్నాడా లేక డేటాను పోషిస్తున్నాడా? విద్యార్థి నేర్చుకుంటున్నాడా లేక కేవలం అటెండెన్స్ యాప్‌లో అంకెలా మిగిలిపోతున్నాడా? అనే నిజం తేలని ఈ మాయాజాలంలో, అక్షరం ముక్కరాని అజ్ఞాని కంటే, అక్షరాన్ని కేవలం గణాంకాల కోసం వాడే మేధావే ప్రమాదకరమనే నిజాన్ని ఈ వ్యవస్థ ఎప్పుడు గుర్తించాలో ఎవరికీ ఎరుక లేని ఒక వింత పరిస్థితి నెలకొంది. దీపం వెలుగునివ్వడం మరచిపోయి నీడలను లెక్కపెట్టడంలో నిమగ్నమైనప్పుడు, మనం వెతుకుతున్నది దారియా లేక పాతాళమా అనే గందరగోళంలోనే విద్యా వ్యవస్థ తన అంతిమ ప్రయాణాన్ని సాగిస్తోంది. నిర్మాణమే విచ్ఛిన్నంగా, సంస్కరణలే సంకెళ్లుగా మారుతున్న వేళ, నిశ్శబ్దాన్ని నిరసనగా మార్చుకున్న ఉపాధ్యాయుడు రేపటి తరానికి ఏ పాఠం చెబుతాడు? అసలు తరగతి గది అనే నాలుగు గోడల మధ్య మిగిలింది జ్ఞానమా లేక కేవలం సర్కారు ఆదేశాల కాగితపు కుప్పా? అంకెలు పెరుగుతున్నా ఆలోచనలు ఆగిపోతున్న ఈ వైరుధ్యాన్ని అభివృద్ధి అనుకోవాలా లేక మేధోపరమైన ఆత్మహత్యగా భావించాలా? గమ్యం లేని ప్రయాణంలో దారిచూపే వాడే దారి తప్పితే, ఆ ప్రయాణమే ఒక గందరగోళ ప్రహసనం అవుతుంది.

కార్పొరేటు వైద్యానికి 'దోపిడీ రోగం'

ప్రొఫెసర్ పీటాబాబీవర్ధన్

'వైద్యో నారాయణో హరి' అనేది నానుడి. వైద్యుడు దేవునితో సమానమని దానర్థం. అందుకే ఆ వృత్తికి అంత గౌరవం. కానీ ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు వైద్యం ఓ ఖరీదైన వ్యాపారం. కొందరు డాక్టర్లు ధనార్జనే ధ్యేయంగా నడిపే వ్యవహారం. ప్రభుత్వాస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేక ఎక్కువ మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. స్టార్ హోటళ్లను తలపించేలా, హంగులతో ఏర్పాటు చేసిన కార్పొరేట్ ఆస్పత్రులు జనాన్ని దోపిడీ చేస్తున్నాయి. జలగల్లా రక్తాన్ని తోడేస్తున్నాయి. మౌలిక సదుపాయాలు సాకుగా చూపించి ప్రభుత్వ వైద్యులు సైతం ప్రైవేటుగా సొంత ఆస్పత్రులు నడుపుతున్నారు. కొందరుడాక్టర్లు కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో కన్సల్టెంట్స్‌గా పనిచేస్తూ, ప్రభుత్వాసుపత్రులకు వచ్చిన రోగులను కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేరమని సిఫార్సు చేస్తూ దోపిడీ దందాకు దారులు వేస్తున్నారు. పవిత్రమైన వైద్య వృత్తికి అన్యాయం చేస్తున్నారు. డబ్బు దండుకోవడమే ప్రధాన ధ్యేయంగా జనాన్ని దగా చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేటు ప్రాక్టీసు నిర్వహించకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ బేఖాతరు చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో 'మూడు కార్పొరేట్లు, ఆరు కన్సల్టెన్సీలు' అన్న చందాన కోట్లకు పడగలెత్తుతున్నారు. దేశం మొత్తం మీద దాదాపు 75 వేలకు పైగా ఆస్పత్రులు ఉండగా, వీటిలో మూడో వంతు ప్రైవేటు ఆస్పత్రులే అంటే ఆశ్చర్యం కలిగిస్తోంది. కార్పొరేట్ ట్యాగ్ తగిలించుకుని, అద్దాల భవంతుల్లో ఆధునిక వసతుల పేరిట రోగుల నుంచి లక్షలు గుంజుతున్నారని తెలుస్తోంది. అవసరం వున్నా లేకున్నా, లేనిపోని 'పరీక్షలు'(టెస్టులు) చేసి జేబులు ఖాళీ చేస్తున్నారు. ఏసీ రూముల్లో రోగులను చేర్చి రోజుకి ఐదు నుంచి ఏడెనిమిది వేల దాకా అద్దె వసూలు చేస్తున్నారు. చిన్న చిన్న వ్యాధులకు సైతం లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నారు. నాకు తెలిసిన ఓ ప్రొఫెసర్ విరోచనాలు అవుతున్నాయని విశాఖ నగరంలోని ఓ పెద్ద కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లారు. ఎమర్జెన్సీ అని చెప్పి ఐసీయూలోకి తరలించారు. ఎక్కువ సార్లు విరోచనాలు అవ్వడం వల్ల మనిషి నీరసించి పోయారు. ఇదే అదనుగా ఆక్సిజన్ తగిలించారు. నానా హంగామా చేశారు. ఈ హైరానా అంతా చూసి కుటుంబ సభ్యులు భయపడ్డారు. ఆ బలహీనతను ఆసరా చేసుకుని దాదాపు ఇరవై దాకా 'టెస్టులు' రాశారు స్పెషలిస్టు వాళ్ల ల్యాబ్‌లోనే అన్ని పరీక్షలు నిర్వహించి పాతిక వేలదాకా బిల్లు వేశారు. ఇది పదిహేనేళ్ల నాటి సంగతి. చూద్దానికి వెళ్లిన నాకు టెస్టుల రిపోర్టులు చూపించారు. ఆ లిస్టులో ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ కోసం చేసే హెచ్ఐవీ కూడా ఉంది. షాక్ గురయ్యాను నేనైతే. అదే విషయం డాక్టర్ని అడిగితే 'అనుమాన నివృత్తి' కోసం అలా రాస్తుంటామని తాపీగా సెలవిచ్చారు. మొత్తానికి లక్షపైనే బిల్లు కట్టించుకుని మూడు రోజుల తర్వాత 'వదిలి పెట్టారు' పెద్దాయన్ని. ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ నుంచే అంత మొత్తం గుంజిన కార్పొరేట్ జలగలు, ఇక సామాన్యుని విషయంలో ఎంత బరితెగిస్తాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఆరోగ్యశ్రీనే పెద్ద ఆదాయ వనరు: ముందే అనుకున్నట్టు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులు వున్నా, సరైన సదుపాయాలు లేక జనం కార్పొరేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందేందుకు అవకాశం కల్పిస్తోంది. దీని కోసం కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులను రెఫరల్స్‌గా గుర్తించి, పేద రోగులకు వైద్య సేవలు పొందే అవకాశం కల్పిస్తోంది. ఇదే అవకాశంగా భావించిన కార్పొరేట్లు' దోపిడీకి తెరతీస్తున్నాయి. తెల్లకార్డులు ఉన్న రోగులకు పూర్తి బిల్లును ప్రభుత్వమే చెల్లిస్తుంది కనుక కార్పొరేటు ఆస్పత్రుల దందాకు మార్గం సుగమం అవుతోంది. ఒక అంచనా మేరకు దేశంలో ఎనభై శాతం మంది రోగులు కార్పొరేట్ ఆస్పత్రులకే వైద్యం కోసం వెళ్తున్నారు. దీంతో ఏడాదికి ఒక్కో ప్రైవేటు ఆస్పత్రి కోట్లలో ఆర్జిస్తోంది. ఇది ప్రభుత్వాలు చెల్లించే సొమ్ము. ఇది గాక మిగతా రోగుల నుంచి గుంజుకునే సొమ్ముకు అవధులే లేవు. ప్రభుత్వ రెఫరల్ ఆస్పత్రుల జాబితాలో పేరు సంపాదించుకోవడం కోసం నానా 'తిప్పలు' పడతారు. ప్రభుత్వ 'పెద్దల'అండతో విజయం సాధిస్తారు. ఈ క్రమంలో కోట్లు చేతులు మారతాయన్నది బహిరంగ రహస్యం. చాలా సందర్భాల్లో ఆరోగ్యశ్రీ దుర్వినియోగం అవుతోంది. అవసరం వున్నా లేకున్నా కొందరు అర్హత వుంది కదాని చిన్న చిన్న రోగాలకే ఆస్పత్రిలో చేరిపోతుంటారు. కనీసం ఐదు రోజులు ఎలాగోలా ఉంచి లక్షల్లో బిల్లులు వేస్తున్నారు ఆస్పత్రి నిర్వాహకులు. ఇంకొందరైతే ఏమీ లేకున్నా బిల్లుల్ని 'తయారు'చేయించి భవిష్యత్‌లో చెల్లింపులు జరిగాక' వాటాలు' తీసుకుంటున్న సంఘటనలు కూడా వెలుగు చూస్తున్నాయి. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులకు అనుబంధంగా వైద్య కళాశాలలు కూడా ఉంటాయి. కోట్లలో ఫీజులు చెల్లించి సీట్లు సంపాదించిన వైద్య విద్యార్థులు భవిష్యత్‌లో డాక్టర్లు అయ్యాక వృత్తిని వ్యాపారంలా చూడడం సర్వసాధారణమైన అంశమే. వైద్య కళాశాలలకు అనుమతుల విషయంలోనూ బోలెడంత అవినీతి జరుగుతున్నదన్నది వాస్తవం. మెడికల్ కౌన్సిల్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాక పరిశీలన కోసం వచ్చే కేంద్ర బృందానికి లంచాలు మేపి, బహుమతులు అందజేసి అనుమతి తీసుకుంటున్న వైద్య కళాశాలలు కోకొల్లలుగా ఉన్నాయి. కమిటీ సందర్శన సమయంలో డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని'అద్దెకు' తెచ్చి, అనుమతులు పొందిన కళాశాలలు కూడా దేశంలో ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు. కొన్ని కేసుల్లో మంచాలు, రోగులను కూడా అద్దెకు తెస్తున్నారంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో సులభంగానే అర్థమవుతుంది. కోట్లలో లంచాలు ఇచ్చిన కళాశాలల యాజమాన్యాలు, సీట్లను కోట్లకు అమ్ముకుంటున్నారు. కోట్లు కట్టి సీట్లు 'కొనుక్కున్న' వైద్య విద్యార్థులు రేపు డాక్టర్లు అయ్యాక వడ్డీతో సహా రోగుల నుంచి పిండుకోక మిన్నకుంటారా! ఇదో విషవలయం. దోపిడీ రాజ్యానికి కేంద్రాలయం.

సేవ పునాదిగా విరాజిల్లాల్సిన పవిత్ర వృత్తి వైద్యం. కానీ కార్పొరేటీకరణ ముసుగు తగిలించు కొని, ధనార్జనే ధ్యేయంగా ఫక్తు వ్యాపారంగా మారింది. ఖరీదైన వ్యాపకంగా అవతరించింది. అనారోగ్య పోటీతో జనం ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతోంది. తక్కువ జీతాలు చెల్లించి అనుభవం లేని వైద్యులను ఎంపిక చేసుకుని, అరకొర వైద్యం చేస్తున్నాయి కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు. శిక్షణ లేని నర్సులు, ఇతర సిబ్బంది చాలా సందర్భాల్లో 'తప్పుడు వైద్యం' చేసి రోగుల ప్రాణాలతో చెలగాటమారుతున్నారు. వార్డుబోయ్‌లు, ఆయాలు కార్పొరేట్ల దోపిడీలో బలిపశువులే ! చాలా ఆస్పత్రులు సరైన వైద్యులు లేకపోయినా రోగులను చేర్పించుకుంటాయి. మరేదో ఆస్పత్రి నుంచి డాక్టరుని పిలిపించుకుంటాయి. కొన్నిసార్లు ఈ తతంగంలో ఆలస్యం వల్ల రోగి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లినప్పుడు లేనిపోని హడావుడి చేస్తారు. అనుభవం లేని డాక్టరుతోనో, నర్సులతోనో వైద్యం చేయిస్తారు. దీంతో రోగులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఈమధ్య ఎక్కువగానే సంభవిస్తున్నాయి. దీంతో రోగి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నాకు దిగడం, కొన్ని సందర్భాల్లో కొట్లాటకు దిగడం పరిపాటిగా మారింది. అవసరం వున్నా లేకున్నా సిజేరియన్ కాన్పులు చేసి లక్షలు గుంజడంతో పాటు కొన్నిసార్లు తల్లిని చంపి పసికందును అనాథను చేస్తున్న సంఘటనలు కూడా జరుగుతుండడం విషాదం. కుడికంటికి బదులు ఎడమ కంటికి సర్జరీ చేయడం, పైపళ్లకు బదులు కింది పళ్లు పీకేయడం వంటి సంఘటనలు కూడా అక్కడక్కడా జరుగుతున్నాయి. కొన్ని కేసుల్లో రోగిని లేవనీయక, అలాగని చావనీయక 'సాగదీత' వైద్యంతో వారాల తరబడి ఆస్పత్రిలోనే ఉంచి లక్షలు దండుకోవడం కూడా చూస్తున్నాం. దేశంలోని వివిధ కార్పొరేట్ ఆస్పత్రులు ఏడాదికి సుమారు లక్ష కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నాయంటే దోపిడీ ఏ స్థాయిలో వుందో అర్థం చేసుకోవొచ్చు.

మనిషికి రోగం వస్తే మొక్కేది ఇద్దరికే. ఒకటి కనిపించని దేవుడు, రెండు కళ్లెదుట కనిపించే దైవ సమానుడైన వైద్యుడు. ఎలాంటి వ్యాధి వచ్చినా ప్రాణాలు కాపాడుతాడన్న నమ్మకంతో వైద్యుల దగ్గరకు వెళ్తారు. కానీ వైద్యాన్ని పవిత్రమైన వృత్తిగా భావించి సేవలు అందించేందుకు ప్రయత్నించే వైద్యులు నూటికో, కోటికో ఒకడు అన్నట్టు ఎక్కడో కానీ కన్పించడం లేదు. చార్వాకుడు, శుశ్రూషుడు వంటి మహావైద్యుల వారసులుగా చెప్పుకునే డాక్టర్లు, నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి ధనార్జనే ధ్యేయంగా కొనసాగుతున్నారు. అలాగని అందరినీ ఓకేగాట కట్టడం భావ్యం కాదు. రోగి ప్రాణాలను ఎలాగైనా నిలపాలన్న సంకల్పంతో అహర్నిశలు కృషి చేసే సేవా 'గుణవంతులు' కూడా అక్కడక్కడా లేకపోలేదు. అటువంటి వారినే ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారు జనం. అటువంటి సేవామూర్తులకు శతకోటి దండాలు. కానీ ఎక్కువ మంది వైద్యులు రోగి ప్రాణాలు కంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత నీయడం శోచనీయం. కమీషన్లకు కక్కుర్తి పడి బారెడు మందుల చీటీ రాసిచ్చే వాళ్లు, పోటీతత్వం వల్ల, రోగిని పరీక్షించకుండానే మందులు, టెస్టులు రాసే డాక్టర్లు లేకపోలేదు. మరికొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్య బీమా విషయంలో పేచీలు పెడుతున్నారు. కార్డు చూసి జాయిన్ చేసుకుని, వైద్యం అందించి, తీరా లక్షల్లో బిల్లు వేశాక, కార్డు చెల్లదు సొమ్ము కట్టాల్సిందేనని రభస చేసే వాళ్లూ వున్నారు. బిల్లులో పారదర్శకత లేకపోవడం, అర్థం కాని పదాలతో తప్పుడు బిల్లులు రూపొందించి దోచుకోవడం కూడా మరో మార్గంగా కనిపిస్తోంది. వైద్య వృత్తికి సంబంధించి ప్రత్యేక నైతిక నియమావళి ఉంది. పేద, పెద్ద తేడా లేకుండా రోగులందరిని ఒకేలా చూడాలని వైద్యశాస్త్ర నైతిక విలువలు చెబుతున్నాయి. ఏ ఒక్కరోగికి హాని చేయకూడదని, ప్రజా విశ్వాసం పొందేందుకు అహర్నిశలు కృషి చేయాలని, వైద్య వృత్తి పవిత్రతను కాపాడేందుకు అంకితం కావాలని నియమావళి పేర్కొన్నది. అన్నిటికంటే ముఖ్యమైది. రోగి ఆరోగ్యసమాచారాన్ని కుటుంబంలోని ముఖ్య సభ్యులకు మినహా మరెవరికీ తెలియపర్చకూడదన్నది కూడా ఒకానొకనియమమే. అనుచితమార్గాల్లో ఆదాయం సమకూర్చుకోవడం కూడా అనైతికమే! ఫార్మాస్యూటికల్ కంపెనీలు, వైద్య పరికరాలు విక్రయించే సంస్థల నుంచి లంచాలు, బహుమతులు స్వీకరించకూడదన్నది కూడా నైతిక విలువలకు సంబంధించిన ముఖ్యాంశమే !!ఇలాంటి నియమాలను కొన్నింటినైనా పాటించే 'ఆదర్శ వైద్యులు' ఎక్కడున్నారో వెదుకుదాం.

మనిషి మనుగడకు జీవాధారమైన వైద్య వృత్తికి అంటిన కళంకాన్ని శుద్ధి చేయడం అందరి బాధ్యత. డొనేషన్ల చదువుల్ని ఆపేయడం సభ్యత. కోట్లు కుమ్మరించి అనుమతులు సంపాదించే ప్రైవేటు వైద్యకళాశాలల్ని బహిష్కరించాలి. ప్రభుత్వాలే ఎక్కువ సంఖ్యలో వైద్యకళాశాలలు ఏర్పాటు చేసి వైద్య విద్య అభివృద్ధికి తోడ్పాటునందించాలి. ఇప్పటికే వున్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి కృషి చేయాలి. శాశ్వత ప్రాతిపదికన వైద్యుల, ఇతర సిబ్బంది నియామకం చేపట్టాలి. అప్పుడే వైద్యం 'సేవావృత్తి'గా మిగులుతుంది.

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి డీన్,
ఆంధ్ర విశ్వవిద్యాలయం, 9393100566.

హిజాబ్ బాధితురాలికి జార్ఖండ్ ప్రభుత్వం బంపర్ ఆఫర్

రాంచీ: బీహార్‌లో హిజాబ్ వ్యవహారరం తీవ్ర దుమారం రేపింది. డిసెంబర్ 15న పట్నాలో వైద్యులకు నియామక పత్రాలు అందజేస్తుండగా ఒక ముస్లిం వైద్యురాలి హిజాబ్‌ను ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తొలగించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రతిపక్ష పార్టీలు దుమ్మెత్తిపోశాయి. నితీష్ కుమార్ మానసిక స్థితి బాగోలేదని ఆర్జేడీ ఆరోపించింది. పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్ అయితే క్షమాపణ చెప్పకపోతే చంపేస్తానంటూ నితీష్‌కుమార్‌ను బెదిరించాడు. తాజాగా హిజాబ్ బాధిత వైద్యురాలు నుస్రత్ పర్వీన్‌కు జార్ఖండ్ ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. జార్ఖండ్‌లో మంచి ఉద్యోగం ఇస్తామని ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ప్రకటించారు. హెల్త్ సర్వీసులో నెలకు రూ.3 లక్షల జీతం, నచ్చిన పోస్టింగ్, ప్రభుత్వ వసతి, పూర్తి భద్రతతో కూడిన ఉద్యోగం ఇస్తామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నేతృత్వంలోనే ఉద్యోగ నియామకం జరుగుతుందని వెల్లడించారు. గౌరవంతో పాటు భద్రత హామీ ఇస్తామని తెలిపారు. బీహార్‌లో వైద్యురాలి విషయంలో అసభ్యకరమైన, అమానవీయమైన, హృదయ విదారక సంఘటన యావత్తు దేశ మనస్సాక్షిని బాధపరించిందన్నారు. హిజాబ్‌ను లాగడం అవమానకరమైన చర్యగా పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంపై జరుగుతున్న దాడిగా తెలిపారు. తాను కూడా మొదట వైద్యుడినేనని, తర్వాతే మంత్రిని అయినట్లు ఇర్ఫాన్ అన్సారీ చెప్పారు.

కమ్ముకున్న పొగమంచు

100 విమానాలు రద్దు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. ఢిల్లీ వీధులన్నీ శనివారం తెల్లవారుజామున పొగమంచుతో నిండిపోయాయి. దీంతో చూపు కనబడడమే కష్టమైంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఏక్యూఐ 384గా ఉంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం కొన్ని ప్రాంతాల్లో కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు తెలిసింది. నగరంలోని అనేక ప్రాంతాల్లో కాలుష్యం స్థాయి ఆందోళనకరంగా ఉంది. సీపీసీబీ ప్రకారం సరాయి కాలే ఖాన్ వద్ద ఏక్యూఐ 428గా ఉంది. అక్షర్‌దామ్ వద్ద 420, తులారామ్ మార్గ్ వద్ద 403, ఆనంద్ విహార్ వద్ద 428, అశోక్ విహార్ వద్ద 407, ఐటీవో వద్ద ఏక్యూఐ 429గా నమోదయ్యాయి. వాయు నాణ్యత తగ్గిపోవడంతో ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ కఠిన చర్యలు తీసుకుంది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఢిల్లీతో పాటు ఎన్సీఆర్ ప్రాంతంలో స్టేజ్-4 ప్రణాళిక అమలు చేస్తోంది. గ్రాప్-4 ప్రకారం నిర్మాణ పనులను ఆపేస్తారు. డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించారు. తీవ్రమైన పొగమంచు ఉన్న కారణంగా... ఇందిరా గాంధీ విమానాశ్రయ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశారు. విమానాల తాజా సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్ సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచన చేసింది. పొగమంచు వల్ల సుమారు 100 విమానాలు రద్దు అయ్యాయి. 50 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.

ఎంత బలమైన దేశమైనా ఇతరులపై ఇష్టాలు రుద్దొద్దు: జైశంకర్

పూణె: శక్తిమంతమైన దేశమైనా తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. ప్రపంచీకరణ మన ఆలోచన, పనివిధానాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. మహారాష్ట్ర పూణెలోని సింబయోసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్సిటీ)లో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి జైశంకర్ చెప్పారు. 'అధికారం అనేదానికి ఎన్నో అర్థాలు ఉంటాయి. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా ఇవి మారుతుంటాయి. ఈ అధికారం ఏ ఒక్కదేశానికి పరిమితం కాదు. ఈ విషయాన్ని గ్లోబల్ పవర్స్ గుర్తించాల్సిన అవసరం ఉంది. ఎంత శక్తిమంతమైన దేశమైనా తన ఇష్టాలను ఇతరులపై రుద్దలేదు. అంతేకాకుండా ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉంది' అని మంత్రి పేర్కొన్నారు. భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు తయారీ రంగంలో దూసుకువెళ్లాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఇరుపక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే భారత వస్తువులపై టారిఫ్‌ను రెట్టింపు చేసి 50 శాతానికి ట్రంప్ చేర్చిన సంగతి తెలిసిందే. అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ దిగుమతులపై భారత్ పన్నులు తగ్గించాలని అమెరికా కోరుతోంది. అందుకు భారత్ అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలోనే టారిఫ్‌లను ట్రంప్ ఆయుధంగా వాడుకుంటున్నారు.

పార్లమెంటులో అణు బిల్లు 'బుల్డోజ్'

స్నేహితుడు ట్రంప్ కోసమే 'శాంతి బిల్లు'

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన 'ఒకప్పుడు మంచి స్నేహితుడు' తో 'శాంతి'ని పునరుద్ధరించడానికి సహాయపడటానికి మాత్రమే శాంతి బిల్లును పార్లమెంటులో 'బుల్డోజర్' చేశారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. 2026 కోసం అమెరికా జాతీయ రక్షణ అధికార చట్టంలో లేవనెత్తిన ఆందోళనకు పౌర బాధ్యత కోసం అణు నష్ట చట్టంలోని కీలక నిబంధనలను శాంతి బిల్లు తొలగిస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను అమెరికా జాతీయ రక్షణ అధికార చట్టంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారని పేర్కొంటూ, 'చట్టం 3,100 పేజీల పొడవు ఉంది. పేజీ 1,912 అణు బాధ్యత నియమాలపై అమెరికా, భారతదేశం మధ్య ఉమ్మడి అంచనాకు సూచన ఉంది' అని 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఈ వారం ప్రారంభంలో పార్లమెంటు ద్వారా శాంతి బిల్లును ప్రధాన మంత్రి ఎందుకు బుల్డోజర్ చేశారో ఇప్పుడు మనకు కచ్చితంగా తెలుసు. ఇతర విషయాలతో పాటు పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన పౌర బాధ్యత చట్టం-2010 కి సంబంధించిన కీలక నిబంధనలను కూడా ఇది తొలగించింది. ఇది తన ఒకప్పటి మంచి స్నేహితుడితో శాంతిని పునరుద్ధరించడానికి' అని కాంగ్రెస్ నాయకుడు తన పోస్ట్‌లో అమెరికా చట్టం ప్రతిని పంచుకున్నారు. 'శాంతి చట్టాన్ని ట్రంప్ చట్టం - రియాక్టర్ వినియోగ, నిర్వహణా హామీ చట్టం' అని పిలుస్తారు' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

రాజ్యసభలో ఈ బిల్లుపై మాట్లాడుతూ అణు విద్యుత్ మౌలిక సదుపాయాలను నిర్మించడంలో ప్రభుత్వ రంగాన్ని పణంగా పెట్టి ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించవద్దని జైరాం రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి అందుబాటులో ఉన్న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థల పైకి ప్రైవేట్ సంస్థలు ప్రవేశించలేవని, అందువల్ల అవి అణు రంగం వృద్ధికి చోదకంగా ఉండలేవని కూడా ఆయన అన్నారు. గురువారం పార్లమెంటు అణు ఇంధన బిల్లును ఆమోదించింది. అయితే ప్రతిపాదిత చట్టాన్ని పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన అనేక సవరణలను తిరస్కరించింది.

వాట్సాప్ గ్రూపులతో ముడుపులు

బొగ్గు కుంభకోణంలో విస్తుపోయే వాస్తవాలు

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో దాదాపు రూ.540 కోట్ల మేర జరిగిన భారీ బొగ్గు కుంభకోణం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ దోపిడీ వెనుక ఉన్న సిండికేట్ సభ్యులు అత్యంత తెలివిగా డిజిటల్ నెట్‌వర్క్‌ను వాడుకున్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. 'బిగ్ బాస్', 'జుగ్ను', 'టవర్' వంటి వింత పేర్లతో వాట్సాప్ గ్రూపులు సృష్టించి... అధికారుల కళ్లు గప్పి వసూళ్లకు పాల్పడ్డారు. డబ్బు అందినట్లు సూచించడానికి 'గిరా' లేదా 'ఇన్' వంటి కోడ్ వాడటం ఈ సిండికేట్ పక్కా ప్రణాళికకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ కుంభకోణంలో రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల పాత్రపై విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బాగెల్ డిప్యూటీ సెక్రటరీ సౌమ్య చౌరాసియా ఈ నెట్‌వర్క్‌లో కీలక సూత్రధారిగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆమె ప్రైవేట్ కార్యదర్శి జయచంద్ కోస్లే ద్వారా ఫైళ్లు కదలండంతో పాటు నగదు వసూళ్లు జరిగినట్లు 1,000 పేజీల చార్జిషీట్‌లో అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) పేరు వాడుకుంటూ అధికార యంత్రాంగాన్ని ఈ సిండికేట్ శాసించిన తీరు చర్చనీయాంశంగా మారింది. వసూళ్ల కోసం ఈ సిండికేట్ ఒక ప్రత్యేకమైన 'డబుల్ లెవీ' వ్యవస్థను రూపొందించింది. ఎన్డీటీవీ కథనం ప్రకారం బొగ్గు రవాణా చేసే వ్యాపారుల నుండి టన్నుకు రూ.100 చొప్పున అక్రమంగా వసూలు చేసేవారు. ఇందుకోసం ఆన్‌లైన్ పర్మిట్ వ్యవస్థను కాదని, ఆఫ్‌లైన్ పర్మిట్‌లు ప్రవేశపెట్టి వ్యాపారులను బెదిరించినట్లు దర్యాప్తులో తేలింది. వసూలు చేసిన కోట్లాది రూపాయలను సిండికేట్ సభ్యులు పంచుకోవడమే కాకుండా... పెద్ద ఎత్తున స్థిరాస్తులు కొనుగోలు చేయడానికి మళ్లించారు. ఈ కేసులో ఈడీ, ఏసీబీ ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాయి. ఇప్పటివరకు రూ.222 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేయగా... రాను సాహు, సమీర్ విష్ణోయ్ తదితర ఐఏఎస్ అధికారులతో పాటు 15 మందిని అరెస్ట్ చేశారు.

అధిష్ఠానం పిలుపు కోసం వేచి ఉన్నాం

నాయకత్వ సమస్యపై డీకే శివకుమార్

బెంగళూరు: రాష్ట్రంలో నాయకత్వ సమస్యపై కాంగ్రెస్ అధిష్ఠానం 'తగిన సమయంలో' మమ్మల్ని పిలుస్తుందని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అన్నారు. తనకు, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మధ్య ఉన్న నాయకత్వ సమస్య మళ్లీ తెర పైకి వస్తున్న నేపథ్యంలో ఈ విషయంపై చర్చించడానికి ఎప్పుడు ఢిల్లీకి రావాలనే విషయాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఇద్దరి నాయకులకు చెప్పిందని శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. ఇటీవల ముగిసిన శాసన సభ సమావేశాల తర్వాత పార్టీ అధిష్ఠానాన్ని కలవడానికి మీరు, సిద్ధరామయ్య దేశ రాజధానికి వెళ్లే అవకాశం ఉందా ప్రశ్నించగా, 'నేను మీకు తెలియజేస్తాను. తెలియజేయకుండా నేను ఏమీ చేయను. నేను మీ నుంచి దాక్కునేందుకు వెళ్లను' అని అన్నారు. అధిష్ఠానం నుంచి ఆహ్వానం ఏదైనా ఉందా అని అడిగినప్పుడు... 'వారు (అధిష్ఠానం) మా ఇద్దరినీ తగిన సమయంలో పిలుస్తామని చెప్పారు. మేము పిలుపు కోసం వేచి ఉంటాము' అని కాంగ్రెస్ కర్నాటక అధ్యక్షుడు తెలిపారు. శివకుమార్ ప్రకటన చేసిన ఒక రోజు తర్వాత సిద్ధరామయ్య అసెంబ్లీలో తాను పదవిలో కొనసాగుతానని నొక్కి చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానం 'నాకు అనుకూలంగా' ఉందని, తన డిప్యూటీతో అధికార భాగస్వామ్యంపై 2023 ఒప్పందం ప్రకారం, అతను రెండున్నర సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉండాలనే దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన నొక్కి చెప్పారు. ఇదిలాఉండగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రమేయంతో తాను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒక ఒప్పందానికి వచ్చామని, వారిద్దరూ దానికి కట్టుబడి ఉంటారని శివకుమార్ చెప్పారు. నవంబరు 20న కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలం సగం పూర్తి చేసుకున్న తర్వాత, రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు చెలరేగుతున్న నేపథ్యంలో అధికార పార్టీలో అధికార పోరు తీవ్రమైంది. 2023లో సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య జరిగిన 'అధికార భాగస్వామ్య' ఒప్పందం ఈ ఊహాగానాలకు ఆజ్యం పోసింది. కొంతమంది 'నాగ సాధువులు' డిప్యూటీ సీఎం నివాసాన్ని సందర్శించి ఆయనను ఆశీర్వదించారు. ఇదే సమయంలో కొంత మంది 'నాగ సాధువులు' ఉప ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి ఆయనను ఆశీర్వదించారు. మరోవైపు, మంగళవారం తాను ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలవనున్నట్లు జలవనరుల శాఖ మంత్రి కూడా అయిన శివకుమార్ తెలిపారు. నదుల అనుసంధానం గురించి కేంద్ర జల వనరుల విభాగం తమను పిలిచిందని అన్నారు. 'నేను అక్కడికి వెళ్లి మహాదాయి, కృష్ణా జల అవార్డు, మేకెదాతు, అప్పర్ బద్ర వంటి రాష్ట్ర నదీ ప్రాజెక్టులకు సంబంధించిన విషయాలను చర్చిస్తాను' అని చెప్పారు. కేంద్ర జల వనరుల మంత్రి, అటవీ మంత్రి, పట్టణాభివృద్ధి మంత్రిని కూడా కలుస్తానని అన్నారు. 'చాలా సమస్యలు ఉన్నాయి. మేము వారిని రాష్ట్ర ఎంపీలతో కలిసి కలవాలనుకుంటున్నాము. అయినప్పటికీ నేను వెళ్లి కలుస్తాను. ఆ తర్వాత, అవసరమైతే, ప్రధాన మంత్రిని కూడా సమస్యలతో కలుస్తాము' అని శివకుమార్ తెలిపారు. ప్రస్తుత గ్రామీణ ఉపాధి చట్టం ఎంజీఎన్ఆర్ఈజీఏను భర్తీ చేసి దాని నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించినందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ... ఇది జాతిపితను అవమానించిందని శివకుమార్ ఆరోపించారు. కరెన్సీ నోట్ల నుంచి గాంధీజీ చిత్రాన్ని తొలగించగలరా అని ఆయన ప్రభుత్వాన్ని సవాలు చేశారు. 'దేశం గాంధీని కోరుకుంటోంది. దేశ ప్రజలు దీనికి ప్రతిస్పందిస్తారు' అని తెలిపారు. 'వారు గాంధీ పేరును మార్చాలనుకుంటున్నారు... గాంధీ చిత్రాన్ని కూడా మార్చనివ్వండి' అని ఆయన కరెన్సీ నోటును చూపిస్తూ అన్నారు. 'గాంధీ పేరుతో మేము సోనియా గాంధీ, దివంగత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాము. వారు ఈ పథకాన్ని రద్దు చేయాలనుకుంటున్నారు. అందువల్ల వారు దాని పేరును మార్చారు. కర్నాటక నుంచే దీనికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం ప్రారంభమవుతుంది' అని ఆయన తెలిపారు.

రాష్ట్రాలపై భారం మోపేందుకే...

జీ రామ్ జీ బిల్లుపై ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: 'సవరించబడిన ఎంజీఎన్ఆర్ఈజీఏ బిల్లు' హానికరమని, కేంద్రం ఈ పథకం భారాన్ని రాష్ట్రాలపై వేసిందని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. శనివారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొత్త బిల్లు పేరు... వికసిత్ భారత్ - రోజ్‌గార్ గ్యారెంటీ... అజీవిక మిషన్ (గ్రామీణ్) (విబి-జి రామ్ జి) బిల్లు - దీనిని 'జి మమ్మీ జీ' అనే బాలీవుడ్ సినిమాతో పోల్చడంపై కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'ఈ పేరు ఎక్కడి నుంచి వచ్చింది? నన్ను క్షమించండి. కానీ వారు జాగ్రత్తగా ఆలోచించిన తర్వాతే బిల్లుకు పేరు పెట్టాలి. ఇది నాకు పాత బాలీవుడ్ సినిమా 'జి మమ్మీ జీ'ని గుర్తు చేస్తుంది. 'బహుశా, చాలామంది ఆ సినిమా చూసి ఉండకపోవచ్చు. కానీ నా మేనల్లుడు చూశాడు. 'జి రామ్ జి! ఇది బిల్లుకు పెట్టాల్సిన పేరేనా?' అని ఆయన అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరును పథకం నుంచి తొలగించడం తప్పు అని సీఎం అబ్దుల్లా అన్నారు. 'మొదట, మీరు మహాత్మా గాంధీ పేరును తొలగించారు. అది తప్పు తర్వాత మీరు ఈ పథకం భారాన్ని రాష్ట్రాలపై వేశారు. ఈ బిల్లులో మనలాంటి రాష్ట్రాలకు హాని కలిగించే, మనకు ప్రయోజనం చేకూర్చని అనేక మార్పులు ఉన్నాయి' అని తెలిపారు. ఢిల్లీలో ఉన్నప్పుడు తాను బీజేపీని ప్రశంసిస్తానని ప్రతిపక్షం చేసిన ఆరోపణ గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, కేంద్రం ఏదైనా సరైనది చేసినప్పుడు తాను దానిని అభినందిస్తానని, కానీ తప్పులు జరిగినప్పుడల్లా తాను ఎల్లప్పుడూ ఎత్తి చూపుతానని' అబ్దుల్లా అన్నారు. 'నేను ఇక్కడ, ప్రతిచోటా అలా అంటున్నాను. ప్రజలను మోసం చేయడానికి రాజకీయాలు చేసే వారిలో నేను లేను. కేంద్రం ఎక్కడ సహాయం అందించినా నేను దానిని చెబుతాను. ఎక్కడ ఏవైనా లోపాలు ఉంటే, వాటిని కూడా నేను లేవనెత్తుతాను' అని ఆయన తెలిపారు. రాష్ట్ర హోదా విషయానికి వస్తే, కేంద్రం 'ఇతర విషయాలలో ఫిర్యాదుకు అవకాశం ఇవ్వలేదు. దాని గురించి ఫిర్యాదు చేయడానికి కారణాలు తప్ప మరేమీ ఇవ్వలేదు' అని అబ్దుల్లా అన్నారు. ఎవరినైనా బాధపెట్టకుండా అబద్ధం చెప్పడం తప్పు అని నొక్కి చెబుతూ, శ్రీనగర్‌లో, ఢిల్లీలో కేంద్రం చేసిన తప్పులను తాను ఎత్తి చూపానని ముఖ్యమంత్రి అన్నారు. 'నేను దీనిని ఢిల్లీలో మాత్రమే చెప్పను. నేను ఇక్కడ, సమావేశాలలో, బహిరంగ సభలలో, అసెంబ్లీలో చెబుతాను. నా అసెంబ్లీ ప్రసంగాలను పరిశీలించండి. కేంద్ర ప్రభుత్వం ఎక్కడ సరైనది చేసినా దానికి నా కృతజ్ఞతలు తెలియజేస్తానని నేను క్రమం తప్పకుండా చెప్పాను. తప్పులు ఎక్కడ ఉన్నా వాటిని నేను ఎత్తి చూపుతాను' అని ఆయన అన్నారు.

మలయాళ నటుడు శ్రీనివాసన్ మృతి

తిరువనంతపురం: మలయాళ చిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ నటుడు, దర్శకుడు శ్రీనివాసన్ (69) మృతిచెందారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. శుక్రవారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయనను త్రిపునితురలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో చనిపోయారు.

శ్రీనివాసన్ మృతితో మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. శ్రీనివాసన్ 1956 ఏప్రిల్ 6వ తేదీన కేరళలోని పట్యంలో జన్మించారు. సినిమాలపై ఆసక్తితో చెన్నైలోని ఫిల్మ్ స్కూల్‌లో శిక్షణ పొందారు. 1977లో విడుదలైన 'మని ములక్కమ్' సినిమాతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకు 225 సినిమాల్లో నటించారు. తనకంటూ ఓ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కేవలం నటుడిగానే కాకుండా రచయితగా, డైరెక్టర్‌గా, నిర్మాతగా తన సత్తా చాటారు. రాష్ట్ర, జాతీయ అవార్డులు గెలుచుకున్నారు.

శ్రీనివాసన్ మృతికి సీఎం సహా ప్రముఖుల నివాళి

దర్శకుడు, రచయిత శ్రీనివాసన్ భౌతికకాయానికి పలువురు సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు. స్టార్ హీరోలు మమ్ముట్టి, మోహన్ లాల్ శ్రీనివాసన్‌కు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాసన్ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఐదు దశాబ్దాలపాటు కేరళ చిత్ర పరిశ్రమకు ఆయన సేవలు అందించారు. 'వడక్కునోక్కియంత్రం', 'చింతవిశిష్టాయ శ్యామల' వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ . వీరు కూడా మలయాళ చిత్ర పరిశ్రమలో నటులుగా, దర్శకులుగా రాణిస్తున్నారు. శీనివాసన్ మృతికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రూ.40 లక్షలతో పని మనిషి పరారీ

న్యూఢిల్లీ: ఇంట్లో పనిమనిషిగా చేరిన ఓ వ్యక్తి రూ.40 లక్షల నగదు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పశ్చిమ ఢిల్లీలోని పంజాబీ బాగ్‌లో ఈ చోరీ జరిగింది. ఓ వ్యక్తి తన తండ్రిని చూసుకునేందుకు పనిమనిషిని ఇంట్లో పెట్టుకున్నాడు. అయితే పనిలో చేరిన 15 రోజులకే అతడు దొంగతనానికి పాల్పడ్డాడు. నవంబరు 29న ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు నమోదైంది. బీఎన్ఎస్ చట్టం కింద కేసు రిజిస్టర్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంటి పరిసర ప్రాంతాలను విశ్లేషించారు. ధ్రువ్ అనే వ్యక్తి ఇంట్లో నుంచి ఖాళీ చేతులతో వెళ్తున్న దృశ్యాలు తొలుత కనిపించాయి. కానీ మరో ప్రాంతంలో అతడు తన మిత్రులు జతిన్, శివమ్‌తో కలిసి తిరగడం కనిపించింది. శివన్ అనే వ్యక్తి బ్లాక్ కలర్ బ్యాగు తీసుకెళ్తున్నట్లు ఓ క్లిప్‌లో గుర్తించారు. ఘటన తర్వాత ముగ్గురు వ్యక్తులు తమ ఫోన్లను స్విచాఫ్ చేశారు. ఢిల్లీలో వారి కోసం పోలీసులు గాలించారు. వారి జాడ గుర్తించలేకపోయారు. ఫోన్ కాల్ రికార్డులను పరిశీలించారు. వాళ్లు ఢిల్లీ దాటి వెళ్లినట్లు నిర్ధారించారు. జమ్మూకశ్మీర్‌లో ఉన్నట్లు గుర్తించారు. ధ్రువ్, జతిన్ కోర్టులో సరెండర్ అయ్యారు. శివమ్ అనే వ్యక్తి క్యాబ్‌లో హిమాచల్ ప్రదేశ్ వెళ్లినట్లు తేల్చారు. క్యాబ్ డ్రైవర్ సమాచారం ఆధారంగా శివమ్ ఉన్న లొకేషన్‌ను గుర్తించారు. శివమ్ ఉంటున్న హోటల్ చేరుకున్న పోలీసులు అతడిని బంధించారు. రూ. 36 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎత్తుకెళ్లిన సొమ్ముతో బ్రాండెడ్ షూలు, బట్టలు కొన్నట్లు గుర్తించారు.

ఆటవిక పాలనకు స్వస్తి పలుకుదాం

చొరబాటుదారుల రక్షణకే ఎస్ఐఆర్‌పై వ్యతిరేకత

మమత సర్కారుపై మోదీ విమర్శలు

కోల్‌కతా: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని అధికాం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమబెంగాల్‌లో చొరబాటుదారులను కాపాడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అందువల్లే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందన్నారు. మమత పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని, ఇటువంటి 'మహా జంగిల్ రాజ్'కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. బెంగాల్‌లోని తాహెర్‌పూర్ ర్యాలీలో శనివారం వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మోదీ ప్రసంగించారు. తృణమూల్ నేతలు తనను, బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం తాము ఆపబోమని మోదీ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమత పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి బాటలు వేస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

వెనక్కి మళ్లిన మోదీ హెలికాప్టర్

ప్రతికూల వాతావరణం కారణంగా ప్రధాని మోదీ ప్రయాణిస్తోన్న హెలికాప్టర్ వెనక్కి మళ్లాల్సి వచ్చింది. పశ్చిమబెంగాల్‌లోని తాహెర్‌పూర్ హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ దిగాల్సిఉండగా... వెలుతురు సరిగా లేక ల్యాండింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు వెల్లడించారు. పశ్చిమబెంగాల్ పర్యటనలో భాగంగా శనివారం ఉదయం మోదీ కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తాహెర్‌పూర్ బయల్దేరారు. అయితే పొగమంచు కారణంగా హెలిప్యాడ్‌పై ల్యాండింగ్‌కు వీలు కాలేదు. దాంతో పైలట్ ల్యాండింగ్‌కు కొద్దిసేపు ప్రయత్నించి విఫలమవడంతో హెలికాప్టర్ తిరిగి కోల్‌కతా విమానాశ్రయం చేరుకుంది. వాతావరణ పరిస్థితి అనుకూలించేవరకు ప్రధాని అక్కడే వేచి చూశారని అధికారులు వెల్లడించారు. నాదియా జిల్లాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొనాల్సి ఉంది. రోడ్డు మార్గంలో అక్కడికి వెళ్తే... ఇతర షెడ్యూళ్లకు అంతరాయం కలగనుండటంతో విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్ నుంచే ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు.పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా రణఘాట్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్‌కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమారు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని పేర్కొంది.

విజన్ లేని మోదీ ప్రసంగం

మతువా వర్గీయుల శ్రేయస్సుపై కనిపించని ఆందోళన: టీఎంసీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ తహేర్‌పూర్ ర్యాలీలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంలో విజన్ లోపించిందని తృణమూల్ కాంగ్రెస్ విమర్శించింది. ఆయన మాటల్లో ఎక్కడ కూడా మతువా వర్గీయుల ఊసే లేదని పేర్కొంది. ఎస్ఐఆర్ తర్వాత వెలువడిన ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడి, అగమ్యగోచరంగా మారిన మతువా వర్గీయుల పరిస్థితిపై ఆయనలో ఏ మాత్రం ఆందోళన కనిపించలేదని వ్యాఖ్యానించింది. టీఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కునాల్ ఘోష్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీ మాట్లాడే వారు వేధింపులకు గురవుతుండటం గురించీ మోదీ ఒక మాట కూడా మాట్లాడలేదన్నారు. ఆయన ప్రసంగంలో ముందుచూపు, బాధ్యత లోపించాయని విమర్శించారు. దళిత-హిందూ శరణార్థి 'మతువా' వర్గం బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చింది. 2002 తర్వాత జరిగిన రాష్ట్రవ్యాప్త ఎస్ఐఆర్‌తో రాష్ట్ర ఓటర్లలో వారి గుర్తింపు, పౌరసత్వంపై భయాందోళన మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 58,20,898 మంది పేర్లు ముసాయి జాబితా నుంచి తొలగించారు. దీంతో బెంగాల్ ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 7.08 కోట్లకు తగ్గింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పోలీసుల ద్వారా దేశ పౌరులను బలవంతంగా బంగ్లాదేశ్‌కు పంపడంపైనా మోదీ మౌనం వహించారని ఘోష్ వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ జోక్యంతో అలాంటి వారు స్వదేశానికి తిరిగి రాగలిగారని (జూన్‌లో బంగ్లాదేశ్‌కు తరలించిన సునాలీ ఖాతూన్ ఈనెల 6న భారత్‌కు తిరిగి రావడాన్ని ఉద్దేశించి) ఘోష్ అన్నారు. బెంగాల్‌లోని పేద ప్రజలకు సంబంధించి కేంద్ర ప్రాజెక్టులకు నిధులను ఎందుకు నిలిపివేశారో కూడా ప్రధాని వివరణ ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదంటూ తప్పుడు కథనం వినిపించారని దుయ్యబట్టారు.గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు నిర్మించుకునే పరిస్థితిని పేదలకు ఎందుకు కల్పించలేదు? తాగునీటి ప్రాజెక్టును కేంద్రం ఎందుకు నిలిపి వేసింది? అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుల కోసం మమత సర్కారు సొంతంగా నిధులు సమకూరుస్తోందని ఘోష్ తెలిపారు. మోదీ ర్యాలీ కోసం వస్తూ రైలు ప్రమాదంలో చనిపోయిన బీజేపీ కార్యకర్తల గురించీ మోదీ మాట్లాడలేదని అన్నారు. రద్దీని నియంత్రించడంలో మోదీ ప్రభుత్వ విధానం విఫలమైందని, అందుకే ప్రాణ నష్టం జరిగిందని ఘోష్ విమర్శించారు. వేదికకు వెళ్లే మార్గంలో సరైన ఏర్పాట్లు జరిగివుంటే ప్రాణ నష్టం జరిగేది కాదన్నారు. అయితే దట్టమైన పొగమంచు కారణంగా రైలు ఢీ కొని ముగ్గురు చనిపోగా, మరో ముగ్గురు గాయపడ్డారని రైల్వే అధికారుల ప్రకటన పేర్కొన్నారు. టీఎంసీ అధికార ప్రతినిధి అరూప్ చక్రవర్తి స్పందిస్తూ 'నరేంద్ర మోదీ గో బ్యాక్' వంటి పోస్టర్ల గురించి మోదీకి తెలిసింది. ప్రధాని, ఆయన పార్టీపై మతువా వర్గీయులు కోపంగా ఉన్నారు' అని అన్నారు. మతువా వర్గీయులకు న్యాయం చేసే చిత్తశుద్ధి మోదీకి లేదని విమర్శించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలిలో పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లాలో శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పర్యటించి ఘట్ కేసర్ లోని బంధన్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే చామకూరు మల్లారెడ్డితో కలిసి 350 మంది లబ్దిదారులకు రూ.4 కోట్ల 6 లక్షల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఘట్కేసర్ మండలంలో 46 మందికి, మేడిపల్లిలో 110 మందికి, కీసరలో 60 మందికి, కాప్రా లో 16 మందికి మూడు చింతలపల్లి మండలంలో 32 మందికి, మేడ్చల్ మండలంలో 86 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మహేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సుల ప్రయాణాలను కల్పించడంతోపాటు అర్హులైన ప్రతి నిరుపేదకు రేషన్ కార్డులను, సన్న బియ్యంను కొత్తగా పంపిణీ చేసిందని చెప్పారు. ఇళ్ళులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లా మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొంటూ 50 చర్చిలకు రూ.30 వేల చొప్పున రూ.15 లక్షల నిధులను మహేందర్‌రెడ్డి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ఆర్టీఏ సభ్యులు జైపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, ఘట్కేసర్ మండల తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరసనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - మొయినాబాద్ : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లో గాంధీజీ పేరు తొలగించినందుకు నిరసనగా ఏఐసీసీ పిలుపుమేరకు మండలంలోని అజీజ్ నగర్‌లో ఆదివారం 10:30 నిమిషాలకు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో పేదరికాన్ని నిర్మూలించడానికి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దానిని నిర్వీర్యం చేసి కుట్రలో భాగంగా గాంధీజీ పేరును బీజేపీ ప్రభుత్వం తొలగించింది దీనికి నిరసనగా వ్యతిరేకించవలసిన ఆవశ్యకత ప్రతి భారతీయుని పైన ఉందన్నారు. వికసిత్ భారత్ వద్దు - మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ముద్దు అనే పథకాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి అధ్యక్షులు పి. మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రెటరీ జిల్లా వంశీ చంద్ రెడ్డి , జిల్లా అధ్యక్షులు చెల్లా నరసింహారెడ్డి,ఎమ్మెల్యేలు, పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు మాజీ ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసిలు అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

అక్రమ నిర్మాణాలు హైడ్రా కూల్చివేత

విశాలాంధ్ర, మల్కాజిగిరి : చెరువులు, కుంటల వంటి ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. ఆర్కే పురం చెరువు పరిధిలోని సర్వే నంబర్ 243లో గల సుమారు 700 గజాల స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి, రేకులతో హద్దులు నిర్మిస్తున్నట్లు స్థానికు లు విక్రమ్, గోవర్ధన్, ముఖేష్, శ్రీరామ్, అంటోని, లక్ష్మణ్, రాజేష్ గౌడ్‌లు ఫిర్యాదు చేయడంతో దీనిపై తక్షణమే స్పందించిన మల్కాజిగిరి తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది, హైడ్రా బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువు శిఖం భూమిలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన రేకులను హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. ఈ సందరరేగా గిర్దావర్ పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువుల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉందని, ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే అధికారులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మరియు హైడ్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం సుభాష్‌నగర్ పరిధి కృషి కాలనీ నందు రూ.10 లక్షలతో యూజీడీ పనులు,అంజిరెడ్డి బస్తీలో రూ.20 లక్షలతో మంజీరా వాటర్ పైప్‌లైన్ పనులకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ద్వారా నిధులు మంజూరైనా సందర్భంగా శనివారం కృషి కాలనీ వాసులు భాస్కర్ రెడ్డి అంజిరెడ్డి బస్తి సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన చేతుల మీదగా పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,పార్టీ నాయకులు బాల్లెం షామెల్,తన్నీరు శ్రీనివాస్,కండక్టర్ హరి,గోపాల, మజీద్ పాషా,వెంకట్ రెడ్డి,సత్తిరెడ్డి చంద్రకాంత్,శాంతయ్య పంతులు, ప్రభాకర్, సిద్దు, లక్ష్మణ్, రాజు,నరసింహారెడ్డి,కృష్ణంరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి,హరికిరణ్,నాగిరెడ్డి,తులసి, గురువారెడ్డి,రాజు చారి,నాగేష్ రెడ్డి,ఆనంద్,తిరుపతి రెడ్డి, నరసింహ గౌడ్,రామ్ చందర్, చందు,కరణ్, శైలజ, అర్చన,బాలాజీ, రాహుల్, కొమురయ్య, సలోని,మల్లారెడ్డి,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరసనలు జయప్రదం చేయండి : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను నిరసిస్తూ ఆదివారం నాడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దానసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి చేశారు. నిరసనకార్యక్రమాల్లో కార్మికులు, కర్షకులు, కూలీలు, సర్పంచులు, ప్రజాస్వామ్యవాదులు ప్రగతిశీల శక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో ఆమె పిలుపునిచ్చారు. పల్లెల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి కనీసం వందరోజుల పాటు ఉపాధి కల్పించేందుకు 20 ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం ఉరి వేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. లోక్‌సభలో పూర్తిస్థాయి చేర్చ లేకుండా, హడావుడిగా బిల్లును పాస్ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీల్లో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, మహిళలు ఉపాధి పొందుతున్నారని.. వారి ఉపాధిని దెబ్బతీసేందుకు కేంద్రం దుర్మార్గంగా

వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా ఉపాధి కూలీల్లో 60 శాతం మహిళలు, తెలంగాణలో ఉపాధి హామీ లబ్దిదారుల్లో 62 శాతం మహిళలే ఉన్నారని, 20 శాతం ఎస్సీలు, 20 శాతం ఎస్టీలు లబ్దిదారులుగా ఉన్నారని, కేంద్ర వైఖరి కారణంగా వారంతా ఉపాధి కోల్పోయే పరిస్థితి తలెత్తిందని వెల్లడించారు. ఉపాధి హామీ చట్టం కేవలం ఉపాధి హామీ కల్పనకే పరిమితం కాలేదని, మహిళలు అట్టడుగు వర్గాల ఆర్థిక స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ కలగన్న రామ రాజ్యం, గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. కానీ బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది పనిదినాలను తగ్గిస్తూ పేదల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 45 కోట్ల పనిదినాలకు కోత, తెలంగాణలో 5 కోట్ల పనిదినాలకు కోత పెట్టారని తెలిపారు. జి రామ్ జి చట్టం ద్వారా 125 రోజులు పని కల్పిస్తామని పైకి చెప్పినా, బీజేపీ పాలనలో ఏ ఏడాదీ 50 రోజులకు మించి పని ఇవ్వలేదని, ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటుకి నివేదించిందని అన్నారు. గాంధీ పర్సెస్ రాముడు అన్నట్లుగా చర్చను చిత్రీకరించి దొడ్డి దారిన ఉపాధి చట్టం ఉసురుతీస్తున్నారని మండి పడ్డారు. మునుపు ఉపాధి హామీ పనులకు కేంద్రం 100 శాతం నిధులు ఇస్తే, ఇప్పుడు తన బాధ్యత నుంచి తప్పుకుని 60 శాతం మాత్రమే ఇచ్చి 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ పేరును తొలగించి 'జీ రాం జీ' పేరుతో ఉపాధి హామీకి రామ్ రామ్ చెబుతోందని విమర్శించారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న ఈ దాడిని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని, కూలీల ఉపాధి హక్కును కాపాడుకునేందుకు కలసి కట్టుగా పోరాడుతామని, రాజకీయాలకు అతీతంగా అందరూ ఉపాధి హామీ పరిరక్షణ పోరాటంలో పాలుపంచుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చారిత్రక ప్రదేశాల సందర్శన

విశాలాంధ్ర, హైదరాబాద్ : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ శనివారం కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని ప్రముఖ చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం గల ప్రాంతాలను సందర్శించారు. శనివారం మధ్యాహ్నం శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న సీఈసీ, ముందుగా గోల్కొండ కోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. గోల్కొండ కోటకు సంబంధించిన చారిత్రక, శిల్పకళా విశేషాలను పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు సీఈసీకి వివరించారు. అనంతరం సీఈసీ హుస్సేన్‌సాగర్ను సందర్శించి, సరస్సు మధ్యలో ప్రతిష్ఠితంగా నిలిచిన బుద్ధ విగ్రహాన్ని దర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి లోకేశ్ కుమార్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి సత్యవాణితో పాటు ఎన్నికల విభాగానికి చెందిన ఇతర అధికారులు సీఈసీతో ఉన్నారు. సాయంత్రం నగరంలోని ప్రసిద్ధ చార్మినార్ను సీఈసీ సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రజలు 'ఫుట్‌బాల్' ఆడుకోవడం ఖాయం : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాజకీయాల్లో సంస్కారం ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. 'రేవంత్ రెడ్డి ఇంట్లోని మహిళలు, పిల్లలు లేదా ఆయన మనమడి గురించి నేను మాట్లాడను. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు చేయను' అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పోరాటం కేవలం నేతల మధ్యే ఉండా లని, అస్సాం సీఎం రాహుల్ గాంధీ పుట్టుకను ప్రశ్నించి నప్పుడు కూడా కేసీఆర్ ఖండించారని, అది తమ సంస్కృతి అని గుర్తు చేశారు. మొన్న మీడియా సమా వేశంలో జరిగిన చర్చలో రేవంత్ రెడ్డి మనవడితో ఫుట్‌బాల్ ఆడిన అంశంపై స్పందించాలని జర్నలిస్టులు కోరినప్పుడు.. రేవంత్ రెడ్డి మనవడి గురించి, కుటుంబ సభ్యుల గురించి తాను మాట్లాడే సంస్కారాన్ని మా పార్టీ అధినేత కేసీఆర్ నేర్పించారని కేటీఆర్ అన్నారు. రాజకీయాల్లోకి కుటుంబ సభ్యులను లాగడం ఏనాడూ చేయలేదని కేటీఆర్ చెప్పారు. దీంతోపాటు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా ఆయన మనవడు ఆయు రారోగ్యాలతో నిండు నూరేళ్లు బాగుండాలని ప్రార్థిస్తానని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో శనివారం మీడియా ప్రతినిధులతో జరిగిన సుదీర్ఘ చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి పాలన, రాజకీయ విలువలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సుమారు గంటకు పైగా సాగిన ఈ చర్చలో రాజకీయ ఫిరాయింపులు, బీసీ రిజర్వేషన్లు, కాంగ్రెస్-బీజేపీ అంతర్గత ఒప్పందాలు రాష్ట్ర అభివృద్ధి కుంటుపడటం వంటి అంశాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి లాగి, ప్రత్యర్థుల చావును కోరుకునేంత నీచమైన మనస్తత్వం తనది కాదన్న కేటీఆర్.. రాజకీయంగా మాత్రం రేవంత్ రెడ్డిని వదిలిపెట్టేది లేదన్నారు. రేవంత్ రెడ్డి ఎవరితో ఫుట్‌బాల్ ఆడినా తనకు సంబంధం లేదని, ఆయనతో ప్రజలు 'ఫుట్‌బాల్' ఆడుకోవడం ఖాయం అని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు బాగుండాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని, వారిపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం కేసీఆర్ కుటుంబ పద్ధతి కాదని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో పచ్చి మోసం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. అందుకే 23శాతం ఉన్న రిజర్వేషన్లను పంచాయతీ ఎన్నికల్లో 17 శాతానికి తగ్గించిందని మండి పడ్డారు. పార్టీలపరంగా 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే అం శంపై రేవంత్ రెడ్డికి సంబంధమే లేదని, ఆయన సొంత పార్టీతో పాటు ఇతర పార్టీలకు అధ్యక్షుడు కాదని కేటీఆర్ అన్నారు. అసలు బిసిలను మోసం చేసినందుకు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ బీసీలకు క్షమాపణ చెప్పాలి. బీసీలకు సీట్లు ఇచ్చే అంశంలో కాంగ్రెస్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి తమ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ 42 శాతానికి మించి, అన్ని సందర్భాల్లో బీసీలకు సరైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన పార్టీ మాది అని కేటీఆర్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 12 జనరల్ సీట్లలో 6 సీట్లు బీసీలకు ఇస్తే, కాంగ్రెస్ ఎన్ని ఇచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీలో తాము 34 సీట్లు బీసీలకు ఇస్తే, కాంగ్రెస్ కేవలం 19 సీట్లు మాత్రమే ఇచ్చిందని లెక్కలు చెప్పారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తెచ్చి, బీసీ డిక్లరేషన్‌లోని అన్ని అంశాలపై రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని కేటీఆర్ ఆరోపించారు. ఢిల్లీలో బీజేపీ ఎంపీ దూబే గృహప్రవేశానికి రేవంత్ రెడ్డి ఎందుకు వెళ్లారో బీజేపీ నాయకుడు రామచంద్రరావు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్‌లో రేవంత్ రెడ్డి నివాసాన్ని రీమోడల్ చేయించింది ఒక బీజేపీ ఎంపీయేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రమేష్ వంటి వారికి రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు ఇస్తుంటే, బీజేపీ ఆయనకు అండగా నిలుస్తోందని ఆరోపించారు. తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని, ఇక్కడ 'ఆర్ఆర్ ట్యాక్స్' నడుస్తోందని సాక్షాత్తు ప్రధాని, హోంమంత్రి అన్నా కూడా బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అఖిలేష్ యాదవ్ తమకు మొదటి నుంచి మిత్రుడని, ఆయనతో కలిస్తే బీజేపీ నేతలకు ఎందుకు బాధ అని ప్రశ్నించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై రాజీనామా సవాల్

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'అభివృద్ధి కోసం పార్టీ మారామని ఎమ్మెల్యేలు మైకుల్లో బహిరంగంగా చెబుతున్నారు. కాంగ్రెస్ ఆఫీసులో కూర్చుని మేము బీఆర్ఎస్‌లోనే ఉన్నామనడం పెద్ద కామెడీ' అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి వంటి వారు స్పీకర్ ముందు వచ్చి అబద్ధాలు ఆడుతున్నారని, బయట మాత్రం రాహుల్ గాంధీ కండువా కప్పుకున్నామని చెబుతున్నారని మండిపడ్డారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితి గబ్బిలాల్లా తయారైందని, పదవుల కోసం ఇంత దిగజారడం దురదృష్టకరమని అన్నారు. ఉపాధి హామీకి చేసిన సవరణల వలన గ్రామీణ పేదలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ అంశంపైన ప్రియాంక గాంధీ పార్లమెంట్‌లో మాట్లాడుతూ పేర్ల మార్పు వల్ల దేశవ్యాప్తంగా అదనపు భారం పడుతుందని చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న 'హనీమూన్ పీరియడ్' ముగిసిందని, ఇకపై కేసీఆర్ నేరుగా ప్రజల్లోకి వస్తారని కేటీఆర్ ప్రకటించారు. ఆదివారం జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలో కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత అనేక స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించానని, రేవంత్ రెడ్డి తన సొంత పార్లమెంట్ స్థానాన్ని గెలిపించుకోలేకపోయారని గుర్తు చేశారు.

సీపీఐ పోరాట ఘట్టాలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ : న్యూ నాగోల్‌లోని యూనియన్ బ్యాంక్, వద్ద సీపీఐకి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నూతన జెండాను ఏర్పాటు చేసి ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు ఉజ్జిన్ రత్నాకర్ రావు, సిపిఐ అరుణ పథకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ఉడతల మల్లేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ భారతదేశంలో స్వతంత్రానికి పూర్వం నుండే ఉజ్వల పోరాట ఘట్టాలు, వెలకట్టలేని త్యాగాలు, దేశ ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన సిపిఐ ఎర్రజెండా అని తెలియజేశారు. ఎందరో త్యాగదనుల చిందించిన రక్తంతో ఎరుపెక్కిన ఈ జెండా ఈ దేశంలో జరిగిన అనేక పోరాట ఉద్యమాలు ప్రపంచ చరిత్ర పుట్టలోకి ఎక్కాయని గుర్తు చేశారు. ఈ శతవసంతాల ముగింపు భారీ బహిరంగ సభ ఖమ్మం గడ్డపై, ఐదు లక్షల మందితో నిర్వహిస్తున్నామని, బహిరంగ సభను విజయవంతం కావడానికి దేశం నలుమూలల నుంచి కార్మికులు కష్టజీవులు పీడిత తాడిత ప్రజలు తరలి వస్తున్నారని తెలిపారు. అందులో 41 దేశాల కమ్యూనిస్టు ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు, దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల పార్టీ నాయకత్వం హాజరవుతుంది. దేశం నలుమూలల నుంచి ఇప్పటికే బస్సు ప్రచార జాతాలు ప్రారంభమైన అని తెలిపారు. మీ వంతు కర్తవ్యంగా మీరు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. బొడ్డుపల్లి కృష? సిపిఐ సీనియర్ నాయకులు

మాట్లాడుతూ భారత గడ్డపై సిపిఐకి వందేళ్ళ పూర్తయ్యాయని, ఈ సందర్భంగా శతవసంతాల ముగింపు కార్యక్రమం బహిరంగ సభలు అనేక రకాల ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే శనివారం న్యూ నాగోల్‌లోని నూతన జండా ఎగరవేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ. టి.యు.సి నాయకులు ఎం.మద్దిలేటి, నరేష్, పి.లలిత, ఏ.లక్ష్మి, వై.ఎల్లయ్య, జంగయ్య, వెంకటమ్మ, యాదమ్మ, నర్సయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని.. శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ లోగల సుదర్శన్ నగర్ కాలనీలో జిహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ భాస్కర్, వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్ కుమార్, స్థానికవాసులతో కలిసి పలు సమస్యలపై, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ పర్యటించారు. నేరుగా ప్రజలతో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

ప్రధాన సమస్యలుగా ఉన్న వాటిని వెంటన పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. గతంలో పలు కాలనీల్లో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న చాలా కాలనీలకు కార్పొరేటర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎమ్మెల్యే గారి సహకారంతో డివిజన్ లో మౌలిక సదుపాయాలు ఇతర మెరుగైన సౌకర్యాలు కల్పించామని తెలిపారు. అదేవిధంగా ఏ చిన్న సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, సుదర్శన్ నగర్ కాలనీ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ నిర్మల్ కుమార్, ట్రెజరర్ సుధాకర్, జాయింట్ సెక్రటరీ కోటేశ్వర్ రావు, కాంక్రీట్ డెస్టినా అపార్ట్మెంట్స్ ప్రెసిడెంట్ పవన్, హానరరీ ప్రెసిడెంట్ వెంకటయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రాజేంద్ర చారీ, వెంకటేశం, సుబ్రహ్మణ్యం, వాణి, మానస, మాట్రిక్స్ యూత్ మెంబర్స్ కోటేశ్వరరావు, రంజిత్, సిద్ధార్థ్, స్థానికవాసులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ గడ్డ రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : గెలిచిన సర్పంచులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. ఐదేళ్లలో అభివృద్ధి చేసి చూపించాలని చెప్పారు. హుజూరాబాద్ పర్యటనలో భాగంగా స్థానిక ఎన్నికల్లో గెలిచిన సర్పంచులను అయన శనివారం సన్మానించారు. ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ హుజురాబాద్, తనకు రాజకీయ బిక్ష పెట్టిన ప్రాంతమని ఈ హుజురా బాద్ గడ్డ రుణం తీర్చుకుంటానని, చెప్పారు. ఎమ్మెల్సీ నిధుల్లో నుంచి 80 శాతం వరకు గ్రామాల అభివృద్ధికి నిధులను కేటాయించి హుజు రాబాద్ ప్రాంత గ్రామాల అభివృద్ధికి పాటుపడతానని స్పష్టం చేశారు. హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. హుజురాబాద్ మండల సర్పంచులను పలువురిని ఆయన అభినందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం తెరిచి నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభంజనాన్ని అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నా యని, వాటిని ప్రజలు తిప్పి కొట్టి కాంగ్రెస్ సిద్ధాంతాల వైపే నిలిచారని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఓడించేందుకు విశ్వప్ర యత్నాలు చేశాయని అన్నారు. రెండు పార్టీలు కలిసి 40 గ్రామపంచాయతీ స్థానాలు గెలిస్తే, కాంగ్రెస్ ఒంటరిగా 31 స్థానాలను గెలిచిం దన్నారు. మరో 15 మంది కాంగ్రెస్ రెబల్ అభ్య ర్థులు త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరతారని ఆశాభా వం వ్యక్తం చేశారు. సీఎం నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని,గెలిచిన అభ్యర్థులు బీజేపీ, బీఆర్ఎస్ అని చూడకుండా సమానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు కేటాయిస్తారని, హామీ ఇచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లోనూ.. అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించినట్లు, ఇంటిగ్రేటెడ్ మాడల్ స్కూళ్లు, రైతు రుణమాఫీ వంటి పథకాలను సమర్థవంతంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. ఇది కాంగ్రెస్ చిత్తశుద్ధి అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు సొంత లాభం కోసం పనిచేస్తా యని, కాంగ్రెస్ పార్టీ ప్రజల బాగుకోసం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా ఉండి హుజూరాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తన వంతుగా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హామీ ఇచ్చారు. పీసీసీ మెంబెర్ పత్తి కృష్ణారెడ్డి, మాజీ జడ్పిటిసి వీరేశలింగం,మాజీ ఎంపీటీసీ జైపాల్ రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్లు రాజేశ్వర్ రావు, పొనగంటి మల్లన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సారంగపాణి, మహిళా కార్యకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు,పట్టణ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్య, క్రీడలు అవసరం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని అందుకు కావలసిన పరికరాలు, గ్రౌండ్ వంటి సౌకర్యాలను అందిస్తానని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు తెలియజేసారు. శనివారం శామీర్ పేట్ మండలం హకీంపేట లో గల తెలంగాణ ప్రభుత్వ క్రీడల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందరరేగా కలెక్టరు మాట్లాడుతూ స్కూల్లో ఎంతమంది విద్యార్థులున్నారని, ఏయే స్పోర్ట్స్ ఉన్నాయని, కోచ్‌లు బాగా ప్రాక్టీస్ చేయిస్తున్నారా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ విద్య తో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, వారికి ఆసక్తి ఉన్న క్రీడల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న స్పోర్ట్స్ కాకుండా అదనంగా ఏమేమి స్పోర్ట్స్ కావాలని విద్యార్థులను అడుగగా, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, స్కేటింగ్, రైఫిల్ షూటింగ్, వాలీబాల్, సైక్లింగ్, హాకీ వంటి క్రీడలకు అవసరమైన గ్రౌండ్, స్పోర్ట్స్ పరికరాలను విద్యార్థులు కావాలని కోరగా కలెక్టర్ పరిశీలించి అందజేస్తామని తెలిపారు. అంతర్జాతీయ క్రీడల పోటీల వరకు వెళుతున్న విద్యార్థుల పై ప్రభుత్వం ఒక్కొక్క విద్యార్థి పై 4 నుండి 5 లక్షల వరకు ఖర్చు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. కోచ్ లు ఎంత శిక్షణ ఇచ్చినప్పటికి మీకు చిత్తశుద్ధి, అంకితభావం స్వీయ క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. రోజురోజుకు మన ఆలోచనలు, అభిప్రాయాలు మారుతుంటాయని వాటిని ఎప్పటిక ప్పుడు అప్ డేట్ చేస్తూ ముందుకు వెళ్లాలని వివరిస్తూ, మీరు శ్రద్ధగా బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో మీకు ఉద్యోగ పరంగా గాని, వ్యాపార పరంగా గాని అవసరమైన సహాయాన్ని తప్పకుండా అందిస్తానని కలెక్టరు విద్యార్థులకు హామీ ఇచ్చారు. సివిల్స్ చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎప్పుడైన సరే అందుబాటులో ఉంటూ మీకు కావలసిన అవసరమైన మార్గనిర్దేశాన్ని సలహా, సూచనలను అందిస్తానని కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి విద్యార్థులకు తెలియజేసారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు విద్యార్థులకు కలెక్టర్ తెలిపారు. అనంతరం జిమ్నాస్టిక్ హాల్, గ్రౌండ్స్ ను కలెక్టర్ సందర్శించారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో అయ్యప్ప స్వాములు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: గ్రీన్ ఇండియా ఛాలెంజ్లో భాగంగా చందనగర్ లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో మాజీ కార్పొరేటర్ నవత రెడ్డి, గురుస్వామి సత్యం, ప్రసాద్ స్వామి, నవతా రెడ్డి, ప్రసాద్ స్వామి అయ్యప్ప భక్తులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలు నాటే పవిత్ర కార్యక్రమం లో అయ్యప్ప స్వాములతో కలిసి పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యతగా చేపట్టాలని మొక్కలు పెట్టడమే కాదు వాటిని రక్షించే బాధ్యత కూడా మన యువతరం మీద ఉంది అన్నారు. రేపటి తరాలకు మనం ఇచ్చే ఆస్థి మంచి వాతావరణం అని అన్నారు. ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన మాజీ రాజ్యసభసభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, శ్రీకాంత్, మల్లారెడ్డి, సంగారెడ్డి, నగేష్ రెడ్డి,రాజు, సునీత, అనంత్ రెడ్డి అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: సర్పంచ్ ఎన్నికల్లో బీసీల ఘన విజయంతో ఐనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అన్నారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలలోనైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ ఆయన చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న బీజేపీకి నిన్న జూబ్లీహిల్స్ నేటి సర్పంచ్ ఎన్నికలలో వేలాదిచోట్ల డిపాజిట్లు కోల్పోయి కేవలం ఐదు శాతం ఓట్లకి పరిమితమైనా బుద్ధి రాదా అని ఆయన ప్రశ్నించారు. జనాలను ఎన్నికల మత్తులో ఉంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిపి 42 శాతం ఎగరగొట్టాలనే కుట్రలు ఇంకా కొనసాగిస్తే శాశ్వతంగా కనుమరుగు కాక తప్పదని హెచ్చరించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల హామీ అమలు కాకుండా ఎన్నికలు, ఉద్యోగ నోటిఫికేషన్లు, విద్యాసంస్థలు ఆడ్మిషన్ల ప్రకటనలు ఇవ్వకూడదనే డిమాండ్తో ఈనెల 27న రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఉంటుందని, దీంట్లో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాగుల శ్రీనివాస్ యాదవ్, పి.సతీష్, నాగు నరేష్, అరుణ్, బాలకృష్ణ, బోయ గోపి, బి.వై.శ్రీకాంత్, పి.రాజ్ కుమార్, యశ్వంత్ రావ్, రాములు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏసు క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసు క్రీస్తు ఈ లోకానికి ప్రేమ, క్షమ, త్యాగం, సేవ అనే అమూల్యమైన విలువలను బోధించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రతి ఏడాది సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ సేవాభావానికి ప్రేమకు, శాంతికి ప్రతిరూపం యేసుక్రీస్తు అని అన్నారు. పరోపకారం, ప్రాణుల పట్ల సేవాభావం కలిగి ఉండడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని పండుగలను ఒకరినొకరు కలిసిమెలిసి జరుపుకుంటారని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధియే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి , నాయకులు చంద్రకుమార్ గౌడ్, వినోద్ కుమార్, ఎన్పి.వెంకటేశ్, జహీర్ అఖ్తర్, సిరాజ్ ఖాద్రీ, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, అజ్మత్అలీ, రాములు యాదవ్, నాగరాజు, ప్రవీణ్ కుమార్, పక్రు, బాలస్వామి పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన కళా సంబరం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: నగరంలో కళా వసంతం వికసించింది. భాగ్యనగరాన్ని అంతర్జాతీయ కళా కేంద్రంగా మారుస్తూ.. నార్సింగ్, లోని నవనామి ఈయాన్ వేదికగా ప్రారంభమైన 'హైడ్.ఆర్ట్ 2025' మహా సాంస్కృతిక వేడుక రెండో రోజు అత్యంత ఉత్సాహంగా కొనసాగింది. మొదటి రోజు ఎంతో వేడుకగా జరిగిన ఈ ప్రదర్శన రెండో రోజున ఒక చారిత్రక ఘట్టానికి వేదికైంది. ప్రఖ్యాత కార్టూనిస్ట్ శంకర్ పామర్తి రూపొందించిన 'మహాత్మా, ఇలస్ట్రేటెడ్' పుస్తకావిష్కరణ ఈ రోజు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ గ్రంథం బాపూజీ జీవన ప్రయాణాన్ని, ఆయనలోని ఆత్మను కొత్త తరానికి పరిచయం చేసే ఒక దృశ్య కావ్యంగా నిలిచింది. ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన 'మాస్టర్స్ ఆఫ్ ఇండియా' గ్యాలరీలో ఎంఎఫ్ హుస్సేన్, ఎస్హెచ్ రజా వంటి దిగ్గజాల కళాఖండాలను వీక్షించేందుకు కళాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 200 మందికి పైగా కళాకారుల సృజనాత్మకతతో ఈ వేదిక ఒక మినీ ఇండియాను తలపించింది. ఈ సందర్భంగా శంకర్ పామర్తి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ చేసిన అపార త్యాగాలకు ఇది నా వినమ్ర నివాళి అన్నారు. కళ ద్వారా గాంధీజీ జీవన తత్వాన్ని సజీవంగా నిలుపుతూ, యువతను మాత్రమే కాకుండా రాబోయే తరాలను కూడా ప్రేరేపించాలన్న లక్ష్యంతో రూపొందించానని చెప్పారు. ఈ కార్యక్రమంలో హైడ్.ఆర్ట్ క్యూరేటర్, షో డైరెక్టర్ అన్నపూర్ణ మడిపడిగ, హైడ్.ఆర్ట్ వ్యవస్థాపకుడు హసన్, నవనామి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ నవీన్ గద్దె, నవనామి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కృష్ణ కాంత్ కోటగిరి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా పండుగలు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలే పండుగలు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో 35 కాలనీలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతి కాలనీలో పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, 5 ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుంది. దీనిలో భాగంగా ఆర్బిఆర్ కాంప్లెక్స్ 4వ బ్లాక్, లింగంపల్లి బాపునగర్ నందు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షులు కొమిరిశెట్టి సాయిబాబా మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవులు మాట్లాడుతూ పరిశుభ్రత, ఆరోగ్యం, అలంకరణల మేళవింపే ముగ్గులు అని అన్నారు. ఈ పోటీల వలన మహిళలలో ఉన్న సృజనాత్మక శక్తి వెలికి రావడానికి అవకాశం ఉంటుంది. పట్టణీకరణ నేపథ్యంలో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగిన తరువాత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు నానాటికి కనుమరుగవుతున్నాయి. నేటి యువతరం మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగించేందుకై ఈ పోటీలు నిర్వహిస్తున్నాము అని అన్నారు. పోటీలలో విజేతల ఎంపికలో ఉమాచంద్రశేఖర్, విజయలక్ష్మి జడ్జీలుగా వ్యవహరించారు. ఈ పోటీలలో 75 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకురాళ్ళు కస్తూరి , తన్వీర్ బేగం, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అమ్మయ్య చౌదరి , శివరామకృష్ణ, చంద్రశేఖర్ , రమ్య తదితరులు పాల్గొన్నారు.

నిజాం నాటి చెరువుకు ప్రాణం పోసిన హైడ్రా

- బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు ప్రారంభానికి సన్నాహం
- అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ పరిశీలన

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాతబస్తీలో నిజాంల నాటి చారిత్రక చెరువుకు హైడ్రా ప్రాణం పోసింది. కబ్జాలను తొలగించి ఊపిరిలూదింది. ఆక్రమణలతో ఆనవాళ్లే కోల్పోయిన చెరువును బతికించింది. చరిత్రను తవ్వితీసిన మాదిరి చెరువును రూపొందించి చారిత్రక వైభవాన్ని హైడ్రా చాటింది. ఇలా పాతబస్తీకే మణిహారంగా బమ్ - రుక్న్-ఉద్-దౌలా చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. జనవరిలో ఈ చెరువును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాలగర్భంలో కలిసిపోయిందనుకున్న చరిత్రకు ప్రాణం పోస్తున్నాం.. ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అక్కడ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులను ఆదేశించారు. చెరువుకు స్థానికులు సులభంగా చేరుకునేలా రహదారులతో పాటు ప్రవేశ ద్వారాలుండాలని సూచించారు. చెరువు చుట్టూ బండ్పై వాకింగ్ ట్రాక్లను పరిశీలించారు. చెరువు లోపలి వైపు ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. చిన్నారులు ఆడుకునేందుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న ప్లే ఏరియాలను పరిశీలించారు. వృద్ధులు సేదదీరే విధంగా అక్కడ గజబోలు నిర్మాణాలు నలువైపులా ఉండేలా చూడాలన్నారు. పార్కులు, ఓపెన్ జిమ్ల ఏర్పాట్లను పరిశీలించారు.

విహార కేంద్రంగా తీర్చిదిద్దాలి....

కాంక్రీట్ జంగిల్గా నగరాలు మారిపోతున్న వేళ.. పాతబస్తీలో నేషనల్ పోలీస్ అకాడమీకి చేరువలో అభివృద్ధి చేస్తున్న బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు విహార కేంద్రంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తీర్చిదిద్దాలన్నారు. ఔషధ గుణాలున్న వృక్ష జాతితో పాటు.. మొక్కలను చెరువు చుట్టూ నాటాలని సూచించారు. పచ్చిక బైళ్లతో పార్కులు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. బయటకు చెరువు పరిసరాల్లో ఉన్న ఉష్ణో?గ్రతల్లో తేడా తెలిసేలా.. పచ్చని వాతావరణం ఉండేలా చూడాలన్నారు. నిజాంల కాలంలో చెరువు నిర్మాణంలో వాడిన రాతిని వినియోగించి కట్టడాన్ని పటిష్టం చేయాలన్నారు. ఇన్లెట్లు, ఔట్లెట్లు విశాలంగా ఉండేలా చేపట్టిన నిర్మాణాలను చూశారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్ ఇలా 10 కిలోమీటర్ల మేర చెరువుకు వర్షం నీరు వచ్చేలా ఇన్లెట్లు నిర్మించాలని.. ఈ ప్రాంతంలో వరద కష్టాలకు ఈ చెరువు చెక్పెట్టేలా చూడాలని సూచించారు. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నారు.

చరిత్రను చాటేలా.....

1970లో మూడవ నిజాం సికందర్ జాహ్ పాలనలో అప్పటి ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్న్ - ఉద్ - దౌలా ఈ చెరువును నిర్మించారని.. అందుకే బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు పేరు వచ్చిందని చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. తాగు నీటి అవసరాలను తీర్చేలా 104 ఎకరాల మేర ఈ చెరువు విస్తరించి ఉందని చరిత్ర చెబుతోంది. కాలక్రమంలో చెరువు విస్తీర?ం తగ్గుతూ హెచ్ ఎం డీ ఏ ఈ చెరువును 17.05 ఎకరాలుగా నిర్ధారించింది. చివరికి 4.12 ఎకరాలుగా మిగిలిపోయింది. హైడ్రా గత ఏడాది ఆగస్టులో ఆక్రమణలను తొలగించింది. హెచ్ ఎం డీ ఏ పేర్కొన్న విధంగా పూర్తి స్థాయిలో భూమి అందుబాటులోకి తెచ్చింది. ఆక్రమణలు తొలగిస్తున్నప్పుడు అనేక అవరోధాలను అధిగమించి.. విమర్శలను ఎదుర్కొంది. అలా విమర్శించిన వారే ఔరా అనేట్టు హైడ్రా ఈ చెరువును అభివృద్ధి చేసింది. ఇప్పుడు స్థానికులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలలో కూడా ఊహించడం కష్టంగా ఉన్న ఈ ప్రాంతానికి ఇంత అందాన్ని తీసుకువచ్చిన హైడ్రాకు అభినందనలు తెలుపుతున్నారు.

చరిత్రను పరిశీలిస్తే....

అడుగడుగునా చారిత్రక ఆనవాళ్లు, ఎన్నో విశేషాలు స్థానికంగా ఉన్న వృద్ధులు పలు విధాలుగా వివరిస్తున్నారు. రాజేంద్రనగర్, ఆరాంఘర్, కాటేదాన్ ప్రాంతాల నుంచి వచ్చే వరద ఈ చెరువుకు చేరేదని చెబుతున్నారు. నిజాంల కాలంలో మీరాలం ట్యాంక్ను రాజులు, బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువును రాణులు స్నానాలకు వినియోగించేవారని చెబుతున్నారు. అలాగే బమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి.. ఆ దిగువున నిర్మించిన బావిలోకి వచ్చిన ఊట నీటిని తాగేందుకు నిజాం పాలకులు వినియోగించేవారని మరి కొంతమంది వివరిస్తున్నారు. ఔషధగుణాలున్న ఈ నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారంటున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని.. ఇందుకోసం అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లేవారంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు.

ఇది ప్రజాస్వామ్యమా? రహస్య పాలన? : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కోట్లాది మంది బీసీల భవిష్యత్తును నిర్ణయించే కుల గణన డేటా, ఎస్ ఈఈఈపిసి సర్వే రిపోర్టులను ప్రభుత్వం ఎందుకు రహస్యంగా ఉంచుతోంది అసలు ప్రజల డేటాపై ప్రజలకే హక్కు లేదా అని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులు డాక్టర్ శ్రవణ్ కుమార్ దాసోజు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం ఆయన రాష్ట్ర సమాచార కమిషనర్కు ఒక సమగ్రమైన ఫిర్యాదు లేఖను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని చట్టాలు చేస్తున్న ప్రభుత్వం, దానికి ప్రాతిపదిక అయిన సర్వే నివేదికలను ఎందుకు బయట పెట్టడం లేదు. ఎక్స్పర్ట్ కమిటీలు ఇచ్చిన సూచనలను ప్రజలకు ఎందుకు తెలియజేయడం లేదు? పునాదులు తెలియకుండా భవనం కట్టినట్టు, డేటా లేకుండా రిజర్వేషన్లు ఎలా ఇస్తారని ఆయన నిలదీశారు. ఆర్టీఐ చట్టం సెక్షన్ 4 ప్రకారం.. ప్రభుత్వం తీసుకునే ప్రతి పెద్ద నిర్ణయం వెనుక ఉన్న వాస్తవాలను, సమాచారాన్ని ప్రభుత్వం స్వచ్ఛందంగా ప్రజల ముందు ఉంచాలన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఈ నిబంధనను పూర్తిగా విస్మరించి, "రహస్య పాలన" సాగిస్తోందని డాక్టర్ శ్రవణ్ విమర్శించారు. సర్వేకు సంబంధించిన పూర్తి డేటా, 'రా' డేటా శాస్త్రీయ నివేదికలను వెంటనే ప్రభుత్వ వెబ్సైట్లలో పిడిఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ సమాచారం సామాన్యులకు అర్థమయ్యేలా, డౌన్లోడ్ చేసుకునేలా మెషిన్-రీడబుల్ ఫార్మాట్లో ఉండాలన్నారు. రాబోయే 15 నుంచి 30 రోజుల్లోగా ఈ వివరాలన్నీ బహిర్గతం చేసేలా రాష్ట్ర సమాచార కమిషన్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సమాచారం అనేది ప్రజల ఆస్తి అని దానిని దాచిపెట్టే అధికారం ఏ ప్రభుత్వానికి లేదన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ప్రకారం, పారదర్శకమైన పాలన కోసమే మా ఈ పోరాటం అని డాక్టర్ శ్రవణ్ స్పష్టం చేశారు. తెలంగాణ సమాచార హక్కు కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డికి పంపిన ఈ లేఖ ప్రతిని గౌరవ ముఖ్యమంత్రికి, గవర్నర్కు లోక్ సభ ప్రతిపక్ష నాయకులకు కూడా పంపినట్లు ఆయన వెల్లడించారు.

కార్మికుల పోరాటం విజయవంతం

విశాలాంధ్ర , కాప్రా : నాచారం పారిశ్రామికవాడలోని షాహీ ఎక్స్పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికులు గత 12 రోజులుగా నిరవధిక పోరాటం విజయవంతం అయింది.మూడు రోజులుగా జాయింట్ లేబర్ కమిషనర్ శ్యామ్ సుందర్ రెడ్డితో మహిళా కార్మికులు, ట్రేడ్ యూనియన్ సంఘాలు మరియు కంపెనీ జీఎం మురళి తో సంయుక్తంగా నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి, కార్మికులు పెట్టిన డిమాండ్లను కంపెనీ యాజమాన్యం లిఖితపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ వద్ద టపాసులు కాల్చి సంబురాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. బోస్లి. మాట్లాడుతూ మహిళా కార్మికుల పోరాటం అద్వితీయమని, మొక్కవోని పోరాట పటిమ కనబర్చి కంపెనీ యాజమాన్యం ను ఒప్పించడంలో కీలకభూమిక పోషించారని అన్నారు. యాజమాన్యం ప్రధానంగా జీతభత్యాల పెంపు అంశంలో ఏప్రిల్ మాసం లోపు హై లెవల్ కమిటీ ద్వారా కార్మిక చట్టం ప్రకారం ఇంక్రిమెంట్లు,ఆయా విభాగాల వారీగా జీతాల పెంపుదల చేస్తామని అన్నారు. అలాగే కార్మికులపై వేధింపులు ఇకపై ఉండవని, కంపెనీలో క్యాంటీన్, మరుగుదొడ్ల సంఖ్యను పెంచుతామని, జీతాల చెల్లింపులో అనవసర తొలగింపులు ఉండవని, ఒకరోజు సెలవు పెడితే రూ.800/- లు కటింగ్ చేసే పద్ధతికి స్వస్తి పలుకుతామని, సమ్మె కాలపు వేతనం ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఐఎన్టీయూసీ నేతలు రామకృష్ణ రెడ్డి, హబీబ్, ఏఐటీయూసీ నేతలు గిరిబాబు, అజీమ్, శేఖర్, స్వప్న, మహిళా కార్మికులు రజిత, పద్మ, షాలిని, పూజ, రంకు పాల్గొన్నారు.

శ్రీబయో సౌందర్య సాధనాలకు జాతీయ గౌరవం

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: హైదరాబాద్కు చెందిన స్టార్టప్ శ్రీబయో ఎస్థెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్కు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు అగ్రి బయోలాజికల్స్లో అత్యుత్తమ స్టార్టప్ లభించింది. 7వ ఎఫ్ఐ సీసీఐ అగ్రి సమ్మిట్, అవార్డులు 2025లో వ్యవసాయ జీవశాస్త్ర రంగంలో ఉత్తమ స్టార్టప్ విభాగంలో ఈ సంస్థ ప్రథమ బహుమతి సాధించింది. న్యూఢిల్లీలోని ఫెడరేషన్ హౌస్లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో, శ్రీబయో ఎస్థెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ డా. కేఆర్కే రెడ్డికి ఈ అవార్డును డా. ప్రభాత్ కుమార్, హార్టికల్చర్ కమిషనర్, వ్యవసాయశాఖ, భారత ప్రభుత్వం, ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నగరంలో శనివారం విడుదల చేసిన ప్రెస్ నోట్లో మిస్టర్ కేఆర్కే రెడ్డి మాట్లాడుతూ, ఈ అవార్డు శాస్త్ర ఆధారిత, మైక్రోబయోమ్ ఆధారిత వ్యవసాయానికి శ్రీబయో చూపుతున్న నిబద్ధతకు గుర్తింపుగా, అలాగే భారతదేశ మట్టిని పునరుజ్జీవింపజేస్తూ రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచాలనే తమ లక్ష్యానికి లభించిన గౌరవంగా అభివర్ణించారు. శ్రీబయో ఎస్థెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు యొక్క సాయిల్ఫస్ట్ క్యాంపెయిన్ సుస్థిర వ్యవసాయానికి పునాది అయిన మట్టి ఆరోగ్య పునరుద్ధరణపై దృష్టి సారించిన ప్రధాన కార్యక్రమంగా నిలిచింది. ఈ కార్యక్రమం ప్రస్తుతం వ్యవసాయ రంగంలో అత్యంత చర్చనీయాంశమైన ఉద్యమంగా గుర్తింపు పొందింది. అధునాతన పరిశోధన అండ్ అభివృద్ధి, దేశీయ బయో-మాన్యుఫాక్చరింగ్, అలాగే విస్తృత రైతు భాగస్వామ్యం ద్వారా శ్రీబయో, శాస్త్రాన్ని క్షేత్ర స్థాయి అమలుతో అనుసంధానం చేస్తూ, ఆరోగ్యకరమైన మట్టే బలమైన వ్యవసాయానికి మరియు జాతీయ ఆహార భద్రతకు పునాది అనే నమ్మకాన్ని మరింత బలపరుస్తోంది.

మహిళలు, చిన్నారుల రక్షణకు చట్టాలు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: మహిళలు చిన్నారుల భద్రతకు సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన పర్యవేక్షణలో అనేక చర్యలు చేపట్టారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో ఆరుగురు సెక్స్ వర్కర్లు, 11 మంది ట్రాన్స్జెండర్లను అదుపులోకి తీసుకున్నారు. 2 పిటీ కేసులు నమోదు చేశారు. ఆరుగురు బాధితులను పోలీసులు రక్షించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. షీ టీం బృందాలు ఈ వారం మొత్తం 137 డెకాయ్ ఆపరేషన్లు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకర ప్రవర్తనకు పాల్పడిన 66 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. మహిళల నుండి అందిన 23 ఫిర్యాదులను స్వీకరించారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్స్ / సీడిఇడబ్ల్యూ కేంద్రాలు భార్యాభర్తల వివాదాల పరిష్కారంలో 22 కుటుంబాలను తిరిగి కలిపి వారి జీవితాల్లో కొత్త వెలుగులను నింపారు. సైబరాబాద్ పరిధిలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీం బృందాలు ఈ వారంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా మొత్తం 7229 మంది పాల్గొన్నారు. ముఖ్యంగా మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, వేధింపులు, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు, సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల హెల్ప్లైన్ 181, చైల్డ్ హెల్ప్లైన్ 1098, డయల్ 100, నేరాలు 1930 వంటి సేవల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు.

యాప్తో యూరియా పంపిణీ



విశాలాంధ్ర - మొయినాబాద్ : ఇక నుంచి రైతులకు యూరియా కష్టాలు ఉండవని మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారి అనురాధ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత రబీసీజన్ నుండి రైతులకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియాను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతుల ఆధీనంలో ఉన్న భూమి విస్తీర్ణాన్ని బట్టి మూడు నుండి నాలుగు సార్లు స్లాట్ బుకింగ్ ద్వారా ఎరువులు పొందే అవకాశం ఉందన్నారు. మండలంలోని రైతులు ఈ నెల 20వ తేదీ నుండి యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల నుండి 24 గంటలలో యూరియాను పొందవచ్చునని తెలిపారు.

మంచి నీటి సమస్యకు కృషి : నెమలి

విశాలాంధ్ర, కాప్రా : బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ లో ప్రజలు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్య పరిష్కారం కోసం గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మల్లాపూర్ జలమండలి అధికారి ఏ ఈ సిరాజ్తో కలిసి కేఎల్.రెడ్డి నగర్ కాలనీ, భవానినగర్ కాలనీ, హెచ్సిఎల్ కాలనీలలో పర్యటించడం జరిగింది, నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేయాలనీ ఈ సందర్భంగా ఏఈని నెమలి అనిల్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్, సంయుక్త కార్యదర్శి వుండం శ్రీనివాస్ ,కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,లైన్ మెన్లు తదితరులు పాల్గొన్నారు.

రితికా ఎస్కేకు ఐఈటీ ఇండియా స్కాలర్షిప్ అవార్డు

విశాలాంధ్ర, జూబిలీహిల్స్ : ప్రపంచంలోని ప్రముఖ ప్రొఫెషనల్ ఇంజినీరింగ్ సంస్థలలో ఒకటైన ది ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఐఈటి), కేసీజీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థిని రితికా ఎస్.కే.ను 9వ ఐఈటీ ఇండియా స్కాలర్షిప్ అవార్డుకు జాతీయ విజేతగా ప్రకటించింది. ఇది అండర్గ్రాడ్యుయేట్ ఇంజినీర్లకు భారత్లో అందించే అత్యంత ప్రతిష్ఠాత్మక గౌరవాలలో ఒకటి. దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం 43,971 దరఖాస్తులలో నుంచి కఠినమైన, బహుళ దశల మూల్యాంకన ప్రక్రియ అనంతరం రితికా అగ్రస్థానానికి చేరుకున్నారు. ప్రక్రియలో విద్యా ప్రతిభ, ఆవిష్కరణ, నాయకత్వం, సామాజిక ప్రభావంపై నిబద్ధత వంటి అంశాలను పరిశీలించారు. డిసెంబర్లో నిర్వహించిన నేషనల్ ఫైనల్స్లో రూపొందించిన సౌరశక్తితో పనిచేసే హెల్త్కేర్ కియోస్క్ (హేకియో) విజయం సాధించింది. ఇది వాస్తవ ప్రపంచ సవాళ్లకు ఇంజినీరింగ్ ఆలోచనలను అన్వయించి, భావన దశను దాటి ప్రాయోగిక అమలువైపు తీసుకెళ్లడంపై ఈ కార్యక్రమం దృష్టిని ప్రతిబింబిస్తుంది. జాతీయ విజేతగా రితికాకు రూ.3 లక్షల స్కాలర్షిప్తో పాటు ఉచిత ఐఈటీ సభ్యత్వం లభించింది.కలింగ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కెఐఐటి)కి చెందిన వన్సికా ఝూవర్ ఫస్ట్ రన్నర్-అప్గా, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏపీ కి చెందిన ఖుషి మల్హోత్రా సెకండ్ రన్నర్-అప్గా నిలిచారు. ఈ ఏడాది మొత్తం రూ.10 లక్షల స్కాలర్షిప్ బహుమతి మొత్తాన్ని కార్యక్రమం ద్వారా అందించారు. ఐఈటీ ఇండియా స్కాలర్షిప్ అడ్వైజరీ కమిటీ చైర్ ప్రొఫెసర్ అభిజిత్ చక్రబర్తి మాట్లాడుతూ, ఐఈటీ ఇండియా స్కాలర్షిప్ అవార్డు సాంకేతిక నైపుణ్యంతో పాటు నాయకత్వం, స్పష్టమైన లక్ష్యబద్ధతను ప్రదర్శించే యువ ఇంజినీర్లను గౌరవిస్తుంది. ఈ ఏడాది ఫైనలిస్టులు తమ పరిష్కారాల నాణ్యతతో పాటు వాటిని వాస్తవ అమలుకు అత్యంత దగ్గరగా తీసుకెళ్లిన కృషికి ప్రత్యేక అభినందనలన్నారు. తొలిసారిగా పూర్తిగా మహిళలే ఫైనలిస్టులుగా ఉండటం, భారతదేశం నుంచి వెలుగులోకి వస్తున్న ఇంజినీరింగ్ ప్రతిభ యొక్క లోతు వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తోంది. విజేతకు ఫైనలిస్టులందరికీ నా శుభాకాంక్షలు. ప్రస్తుతం తొమ్మిదవ ఏడాదిలోకి వచ్చిన ఐఈటీ ఇండియా స్కాలర్షిప్ అవార్డు, అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఒక ప్రాముఖ్యమైన జాతీయ స్థాయి స్కాలర్షిప్ కార్యక్రమంగా స్థిరపడింది. 2013లో ప్రారంభమైన ఇప్పటివరకు దాదాపు 25 మంది జాతీయ విజేతలను వెలుగులోకి తీసుకువచ్చి, భారత్లోను విదేశాల్లోను ప్రముఖ టెక్నాలజీ సంస్థలు, పరిశోధనా సంస్థలు ఆవిష్కరణల ఆధారిత సంస్థల్లో ప్రభావవంతమైన వృత్తులను నిర్మించడాన్ని సూచిస్తూ ఒక కీలక మైలురాయిని సూచిస్తోంది. తదుపరి ఎడిషన్కు దరఖాస్తులు ఏప్రిల్ 2026లో ప్రారంభమవుతాయి.

42 శాతం చట్టబద్ధంగా నిర్వహించాలి : ఎంపీ ఆర్ కృష్ణయ్య

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు 42 శాతంతోనే చట్టబద్ధంగా ఎన్నికలకు వెళ్లాలనీ తెలంగాణ బిసి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్బా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన బీసీ సంఘం అధ్యక్షులు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కొన్ని చోట్ల ఎన్నికలలో రిగ్గింగ్ జరిపి బి.సి.లను ఓడించారనీ ఆరోపించారు.గ్రామ పంచాయతీ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం నుంచి 22 శాతంకి తగ్గించి అమలు చేసేటప్పుడు 17 శాతానికి తగ్గించి అన్యాయం చేశారన్నారు. బీసీ ప్రజలలో చైతన్యం పెరిగి జనరల్ సీట్లలో మెజారిటీ సీట్లు మొత్తం 52 శాతం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులు బీసీలు గెలుచు కున్నారని అన్నారు. జనరల్ స్థానాల్లో బీసీలు ఎక్కువ సంఖ్యలో గెలిచారనీ, జనరల్ స్థానాలు 5233 అందులో బీసీలు 2937 గెలిచారన్నారు. రిజర్వు స్థానాలు 2186 గెలిచి, జనరల్ స్థానాలు 2937 కలిపి బీసీలు 5123 స్థానాలు సర్పంచులుగా గెలిచారన్నారు.రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం షేర్ గూడ గ్రామంలో జనరల్ కి కేటాయించారని, ఆ స్థానంలో బీసీలు కూడా పోటీ చేశారనీ, ఈ స్థానంలో ఓసి అభ్యర్థిని గెలిపించడానికి ఎలక్షన్ ఆఫీసర్ పనిచేస్తున్న వారి స్వంత అక్క ను క్యాండిడేట్ గా నియమించారన్నారు. దీనితో ఎలక్షన్ ఆఫీసర్ తన సోదరి గెలుపు కోసం అనేక అక్రమాలకు పాల్పడి దొంగ ఓట్లకు వేయించారనీ ఆరోపించారు. వెంటనే షేర్ గుడా ఎన్నికల రద్దు చేసి మళ్ళీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నేతలు నీల వెంకటేష్, సి రాజేందర్, రాజ్ కుమార్, బాలయ్య, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపైనే ఆశలు

- వారి బంగారు భవిష్యత్‌కు నాదే బాధ్యత
- చిన్న ఆలోచనలే అభివృద్ధికి మార్గాలు కాగలవు
- 'ముస్తాబు' ప్రారంభోత్సవంలో చంద్రబాబు

విశాలాంధ్ర-తాళ్లపాలెం (కసింకోట): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యార్థులు రాష్ట్రానికి ఆస్తివంటివారని, వారిపైనే ప్రభుత్వం ఆశలు పెట్టుకున్నదని చెప్పారు. చిన్న ఆలోచనలే అభివృద్ధికి మార్గాలు కాగలవన్నారు. సీఎం శనివారం అనకాపల్లి జిల్లా, కసింకోట మండలం, తాళ్లపాలెంలో పర్యటించారు. అక్కడి సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి 'ముస్తాబు' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ముస్తాబు వంటి కార్యక్రమాలు వినూత్న ఆలోచనల నుంచి వచ్చినవేనని చెప్పారు. ఖర్చు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం... విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తామని చంద్రబాబు తెలిపారు. దీనిని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేస్తున్నామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆలోచనతో రూపుదిద్దుకున్న ముస్తాబు కార్యక్రమాన్ని తాళ్లపాలెం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యార్థుల్లో ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. మన్యం జిల్లాలో ముస్తాబు కార్యక్రమం ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 75 లక్షల మంది ఇంటర్ వరకూ చదువుతున్నారని, 'ముస్తాబు' ద్వారా చక్కగా తలదువ్వుకోవటం, భోజనానికి ముందు చేతులు కడుక్కోవటం వంటివి వారికి నేర్పుతున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రులతో పాటు ప్రభుత్వం కూడా విద్యార్థులపైనే ఆశలు పెట్టుకుందని అన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో భాగం కావాలని విద్యార్థులకు సూచించారు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేయాలన్నారు. రాష్ట్రంలో 75 లక్షల మంది విద్యార్థులకు త్వరలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే విద్యార్థులకు పౌష్టికాహారం, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు ఉచితంగా ఇస్తున్నామన్నారు. విద్య శాఖలో వినూత్న సంస్కరణలను మంత్రి లోకేశ్ తెస్తున్నారని చెప్పారు. వివిధ శాఖల మంత్రులు కూడా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకే కృషి చేస్తున్నారని సీఎం అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎంపీ సీఎం రమేశ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కష్టపడుతున్నా... సస్పెన్షన్లా?

పలిశెట్టి దామోదరరావు ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ... ఈ పథకం కారణంగా కండక్టర్లు, డ్రైవర్లు పడుతున్న ఇబ్బందులపై గానీ, పెరిగిన ఒత్తిడిని గానీ పట్టించుకోవడం లేదని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ఆవేదన వెలిబుచ్చారు. మరోవైపు తనిఖీల పేరుతో తనిఖీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ...విధినిర్వహణలో జరుగుతున్న చిన్నచిన్న పొరపాట్లును కూడా క్షమించకుండా కండక్టర్లపై కేసులు రాస్తున్నారని తెలిపారు. డిపో మేనేజర్లు అయినా నిజానిజాలు పరిశీలించకుండా... వాటి ఆధారంగా సస్పెన్షన్లు, పనిష్మెంట్లు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇలా అయితే భవిష్యత్‌లో కండక్టర్లు, డ్రైవర్లు డ్యూటీలు చేయడమే కష్టమవుతుందని పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో యన్టీఆర్ జిల్లా విద్యాధరపురం డిపో యూనియన్ నిర్మాణ మహాసభ శనివారం జరిగింది. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఉమ్మడి జిల్లాల్లోని 15 డివిజన్లలో న్యాయపరమైన చిక్కుల కారణంగా నిలిచిపోయిన పదోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించి... అర్హులైన ట్రాఫిక్ అండ్ మెయింటినెన్సు ఉద్యోగులకు, ఇతర కేటగిరి ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈయూ రాష్ట్ర ఉపప్రధానకార్యదర్శి యండీ ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం అమలుతో ఉద్యోగులపై పెరిగిన పనిభారం తగ్గించాలంటే కనీసం 3,000 అదనపు బస్సులు పెంచాలని, అన్ని కేటగిరీల్లో 1000 ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులు, కొత్త నియామకాలు లేకుండా ఇదే సిబ్బంది, బస్సులతో స్త్రీశక్తి పథకం ఎంతోకాలం నడవబోదని చెప్పారు. విజయవాడ జోన్-2 జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాధరపురం డిపో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. కొత్త కమిటీని ఆయన ప్రకటించారు. యన్టీఆర్ జిల్లాలో ఉన్న జోన్, జిల్లా కమిటీ సభ్యులు విద్యాధరపురం డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో విపరీత ధోరణులపై చర్చ జరగాలి

- ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యంలో విజయవాడలో సెమినార్
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్వర్యాన జనవరిలో నిర్వహించే సెమినార్‌కు హాజరవుతానని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. శనివారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేశ్‌ను ఐజేయూ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో ఏపీయూడబ్ల్యూజే బృందం కలిసింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై మంత్రితో చర్చించారు. సోషల్ మీడియా, ప్రస్తుత ధోరణులు అనే అంశంపై ఏపీయూడబ్ల్యూజే అధ్వర్యంలో జనవరిలో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి లోకేశ్‌ను కోరగా, ఆయన అంగీకరించారు. సోషల్ మీడియాలో జరుగుతున్న విపరీత ధోరణులపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత యూనియన్‌లపై ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల అభివృద్ధి, సంక్షేమం హక్కుల సాధన కోసం ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న కృషిని లోకేశ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందిస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విజయవాడలో ఐజేయూ ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్న విషయాన్ని శ్రీనివాస్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమావేశాలు విజయవంతం కావాలని, ప్రభుత్వం తరపున తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, ఉపాధ్యక్షులు చావా రవి పాల్గొన్నారు.

డాక్టర్లు స్వేచ్ఛగా విదేశాలకు వెళ్లొచ్చు: నడ్డా

లక్నో: దేశంలో వైద్య సౌకర్యాలు సమృద్ధిగా లేవని యువ డాక్టర్లు ఇక ఫిర్యాదు చేయరాదని, విదేశాలకు వెళ్లాలనుకుంటే స్వేచ్ఛగా వెళ్లవచ్చు అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. ముఖ్యంగా దేశంలో ఉన్న వనరులను, సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కానీ విదేశాలకు వెళ్లే నెపంతో దేశంలో వైద్య సౌకర్యాలు సరిగా లేవని నిందలు మోపరాదని నడ్డా పేర్కొన్నారు.

లక్నోలో కింగ్ జార్జి మెడికల్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో దేశీయ వైద్య వ్యవస్థ పూర్తిగా మారిందన్నారు. దేశంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సంస్థల సంఖ్య ఇప్పుడు 23కు పెరిగిందన్నారు.

దళితులు... బహుజన శక్తులు

ఏకం కావాలి

వడ్డే శోభనాద్రీశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): దేశంలో దళిత, బహుజన, మైనార్టీ వర్గాలపై దాడులు, కుల వివక్షత సమస్య కొనసాగుతోందని, ఈ ఘటనలు దేశ వ్యాప్తంగా నమోదవుతున్నాయని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఏపీ రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విజయవాడ వన్‌టౌన్‌లోని వించిపేట సీఎస్‌ఐ చర్చి ఆవరణలో దేశంలో దళిత, గిరిజన, మైనార్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై (ఏపీడీజేఎస్) అధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు కంకిపాటి అనిల్ కుమార్ అధ్యక్షతన దళిత బహుజన శక్తుల ఐక్యతా సదస్సు జరిగింది. ముఖ్య వక్త వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఈ దాడులు, వివక్ష ఘటనలు 2021 సంవత్సరంలో పోలిస్తే 15 శాతం పెరిగాయని తెలిపారు. ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో దళితులపై దాడులు జరిగాయని, ఇది అమానుషమని అన్నారు. ప్రభుత్వాలు స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. దళిత, బహుజన శక్తులు ఏకం కావాలని, వివక్షకు గురవుతున్న ఈ వర్గాలు సమాజంలో అన్యాయాలకు వ్యతిరేకంగా ఒక బలమైన శక్తిగా ఏర్పడి పోరాడాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాపులర్ షూమార్ట్ గ్రూప్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి అరుణ్ కుమార్ తమ సంస్థ తరఫు నుంచి మహిళలకు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు, టీడీపీ నాయకులు పేటేటి రాజశేఖర్, దళిత నాయకులు కండెల విజయ్ కుమార్, కరుణానిధి, దైవజనులు కంకిపాటి జాన్ ఆనంద్ కుమార్, చర్మకార సంఘం నాయకులు పల్లికంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి కనకరాజు వందన సమర్పణతో కార్యక్రమాన్ని ముగించారు.

'ఏపోలిస్'తో క్షణాల్లో సంక్షేమ రుణాలు: డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ డిజిటల్ పాలన దిశగా కీలక ముందడుగు వేసింది. పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఏపోలిస్ (ఆటోమేటెడ్ పోలీస్ ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) అనే పూర్తిస్థాయి ఆటోమేటెడ్ వెల్ఫేర్ లోన్ ప్రాసెసింగ్ వ్యవస్థతో పాటు మొబైల్ యాప్‌ను శనివారం డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ పోలీస్ ఉద్యోగికి రూ.మూడు లక్షల సంక్షేమ రుణాన్ని మంజూరు చేసి... డిజిటల్ వ్యవస్థ ద్వారా తక్షణమే నగదు విడుదల చేశారు. ఉద్యోగి కుమార్తె వివాహానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇంతకు ముందు మాన్యువల్ విధానంలో సంక్షేమ రుణాల మంజూరు, విడుదలకు సుమారు మూడు నెలల సమయం పట్టేదని, ప్రస్తుతం ఏపోలిస్ అమల్లోకి రావడంతో, అవసరమైన పత్రాల పరిశీలన అనంతరం ఒక రోజులోనే రుణ ప్రక్రియ పూర్తి అవుతోందని తెలిపారు. తాజాగా ఆవిష్కరించిన యాప్ ద్వారా సంక్షేమ రుణాలు, సెలవుల కోసం దరఖాస్తు, జీతభత్యాల స్లిప్‌లు, మెడికల్ రిపోర్టులు, తదితరల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. అడిషనల్ డీజీపీ (శాంతి భద్రతలు) ఎన్.మధుసూదన్ రెడ్డి, ఐజీపీ (టెక్నికల్ సర్వీసెస్) శ్రీకాంత్, డీఐజీ (సంక్షేమం) అన్బు రాజన్ పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కర్బన రహితం చేద్దాం

- నాలుగో ఏడాదీ ఇంధన పరిరక్షణలో జాతీయ స్థాయిలో ప్రథమం
- సీఎస్ విజయానంద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్బన రహితంగా రాష్ట్రాన్ని తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈ సీఎమ్) చైర్మన్ కె.విజయానంద్ పిలుపునిచ్చారు. విజయవాడ వివంతా హోటల్‌లో శనివారం ఎనర్జీ కన్జర్వేషన్ వీక్ వాలిడిక్టరీ-2025 స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డుల కార్యక్రమం, షార్ట్ వీడియో బహుమతి పంపిణీ కార్యక్రమానికి సీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఇంధన పరిరక్షణలో నాలుగేళ్లుగా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలుస్తోందని, భవిష్యత్‌లో కూడా మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆశిస్తున్నామన్నారు. 2015లో హుదూద్ తుపాను తర్వాత విశాఖ నగరంలోని వీధి దీపాలు అన్నీ ఎల్ఈడీ లైట్లుగా మార్చామని, దీనివల్ల దాదాపు 45 శాతం వరకు ఇంధన పొదుపు సాధ్యమైందన్నారు. ఈ లైట్లను రిమోట్ ద్వారా పర్యవేక్షించడానికి సీసీఎంఎస్ బాక్సులను కూడా ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలయిన బీఈఈ, ఈఈఎస్ఎల్ భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2 కోట్లకు పైగా ఇళ్లలో ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేశామని, దీనివల్ల 30 శాతం విద్యుత్ ఆదా అయిందని తెలిపారు. మునిసిపల్ చట్టంలో మార్పులు చేసి, కొత్త భవనాలకు ప్లాన్ మంజూరు కావాలంటే తప్పనిసరిగా ఎనర్జీ ఎఫిషియంట్ ఎక్విప్ మెంట్ వాడాలనే నిబంధనను తీసుకువచ్చా మని, ఇప్పటికే దాదాపు 2 వేల నుంచి 3 వేల భవనాలను హరిత భవనాలుగా గుర్తించామన్నారు. స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్రాన్ని కర్బన రహితంగా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశమని తెలిపారు. ప్రతి గ్రామంలో సోలార్ రూఫ్ ప్రోత్సహిం చడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయడం, పంపిణీ నష్టాలను తగ్గించడం చేయవచ్చని అన్నారు. ఇంధన పరిరక్షణ, పొదుపు, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏడాది వారోత్సవాలు నిర్వహిస్తూ చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామని సీఎస్ వివరించారు. ఏపీ జెన్‌కో సీఈవో, ఏపీఎస్ఈ సీఎం ఎస్.నాగలక్ష్మి, ఏపీసీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి అవార్డులు గెలుచుకున్న సంస్థలకు, షార్ట్ వీడియో పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం సంస్థలు, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

విశాలాంధ్ర జాతీయ దినపత్రిక

సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు కావలెను

74 సంవత్సరాల చరిత్ర కలిగిన విశాలాంధ్ర జాతీయ దినపత్రికలో పని చేయడానికి సీనియర్ జర్నలిస్టులు, ట్రైనీ సబ్ ఎడిటర్లు కావాలి.

సీనియర్ జర్నలిస్టులు

సీనియర్ జర్నలిస్టులకు అనుభవానికి తగిన వేతనం ఇవ్వబడును. ఆసక్తిగలవారు నేరుగా విశాలాంధ్ర ప్రధాన కార్యాలయం, చంద్రం బిల్డింగ్స్, విజయవాడలో 2025 డిసెంబరు 27వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావలెను. వారికి రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఉంటుంది.

ట్రైనీ సబ్ ఎడిటర్లు

అర్హతలు : తెలుగులో రాయగల నేర్పు, ఆంగ్లభాషపై అవగాహన కలిగి ఉండాలి. లోకజ్ఞానం, వర్తమాన వ్యవహారాలపై పట్టు, ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలన్న తపన, పాత్రికేయ రంగం పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. జనవరి 1, 2026 నాటికి 30 ఏళ్ళ వయసు మించనివారై, డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన వారై ఉండాలి.

ట్రైనీ సబ్ఎడిటర్లకు శిక్షణకాలంలో మొదటి సంవత్సరం రూ. 14,000, ఆ తర్వాత ప్రొబేషన్ పీరియడ్‌లో రూ. 15,000 చొప్పున నెలవారీ భృతి ఇవ్వబడును. అనంతరం ప్రతిభ ఆధారంగా వేతనం నిర్ణయించబడును. దరఖాస్తును e-mail : editorvisalaandhra2026@gmail.com మెయిల్‌కు, లేదా ఈ క్రింది చిరునామాకు ఫొటోతో సహ పంపించవలెను.

చిరునామా : ఎడిటర్, విశాలాంధ్ర జాతీయ దినపత్రిక, చంద్రం బిల్డింగ్స్, చంద్ర రాజేశ్వరరావు రోడ్డు, చుట్టుగుంట, విజయవాడ - 520004,

వివరాలకు ఫోన్ నెంబర్ : 9590952106, 7997014006

e-mail : editorvisalaandhra2026@gmail.com

రైలు ఢీకొని ఏడు ఏనుగుల మృతి

గువహతి: అసోంలో శనివారం రైలు ప్రమాదం జరిగింది. సైరాంగ్ నుంచి దిల్లీ బయల్దేరిన రాజధాని ఎక్స్‌ప్రెస్ జాయ్ జిల్లాలో ఏనుగుల మందను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడు ఏనుగులు మృతిచెందగా... ప్రమాదం ధాటికి రైలు బోగీలు పట్టాలు తప్పాయి. రైలు ఇంజిన్‌తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పినట్లు నార్త్‌ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే, ప్రయాణికులెవరికీ ప్రమాదం జరగలేదని తెలిపారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలు ఢీకొనడంతో ఏడు ఏనుగులు మృతి చెందగా... మరో ఏనుగు గాయపడింది. రైల్వే, అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం కారణంగా ఈ మార్గంలోని రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఘటన జరిగిన ప్రాంతం ఎలిఫెంట్ కారిడార్ కాదని రైల్వే అధికారులు తెలిపారు. పట్టాలపై ఏనుగుల మందను చూడగానే లోకో పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులు వేశాడని, అయినప్పటికీ ప్రమాదం జరిగిందని వివరించారు. దీనిపై దర్యాప్తు జరుగుతోందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.